www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

నిద్రలోనే అగ్నికి ఆహుతి
చిన్నారి సహా ఆరుగురు సజీవ దహనం
టిప్పర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు
టిప్పర్ ఆయిల్ ట్యాంకర్ పగిలి వ్యాపించిన మంటలు
డ్రైవర్లు కూడా మృత్యువాత.. మరో 29 మందికి గాయాలు
ఓటేయడానికి వచ్చి హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం
పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం 12


సూర్యనారాయణ, రుక్మిణి (ఫైల్)

చెట్టును ఢీకొట్టిన కారు.. 14
వృద్ధ దంపతుల మృతి
మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
ప్రమాద తీవ్రతకు కారు దహనం
ఖమ్మం జిల్లాలో ఘోర ప్రమాదం

గురువారం | 16-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 30
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి ఉ. 6.23 తదుపరి నవమి; నక్షత్రం: మఖ సా. 6.14 తదుపరి పుబ్బ; వర్జ్యం: శేషం ఉ.6.36, తె.3.15-5.03, దుర్ముహూర్తం: ఉ.10.03-10.54, మ.3.11-4.02, అమృతఘడియలు: మ.3.33-5.20, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.46, సూర్యాస్తమయం: 6.36
హైదరాబాద్ సిటీ
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కేజ్రీకి సుప్రీం స్పెషల్ ట్రీట్‌మెంట్
ఇది సాధారణ తీర్పని నేను అనుకోవట్లేదు
దేశంలో చాలామంది నమ్ముతున్నది ఇదే
ఆప్ అధినేతకు సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ ఇవ్వడంపై అమిత్ షా వ్యాఖ్యలు
2029 దాకా పీఎం మోదీనే.. ఆ తర్వాతా ఆయనే మాకు నాయకత్వం వహిస్తారు!
75 ఏళ్లకు మోదీ రిటైర్ అవుతారంటూ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై షా ప్రతిస్పందన

న్యూఢిల్లీ, మే 15: కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు బెయిల్ ఇవ్వడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఇదేదో సాధారణ తీర్పు అని నేను అనుకోవట్లేదు. దేశంలో చాలా మంది.. కేజ్రీవాల్‌కు (కోర్టు) స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చినట్టు నమ్ము తున్నారు" అని ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. బీజేపీలో ఉన్న ఆనవాయితీ ప్రకారం.. 75 ఏళ్ల వయసు రాగానే.. అంటే 2025లో మోదీ రిటైర్ అవుతారంటూ కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపైనా అమిత్ షా స్పందించారు. "నరేంద్ర మోదీ 2029 దాకా (అధికారంలో) ఉంటారు. మీకొక దుర్వార్త

మిగతా 2వ పేజీలో...

'ఇండియా'కు బయట నుంచి మద్దతు
ఇది జాతీయ రాజకీయాలకే పరిమితం 2
బెంగాల్ కాంగ్రెస్, సీపీఐ కూటమిలో భాగం కాదు
టీఎంసీ అధ్యక్షురాలు, బెంగాల్ సీఎం మమత

పంద్రాగస్టులోగా రుణమాఫీ
చేసి తీరాల్సిందే
అత్యధిక రుణాలిచ్చే బ్యాంకర్లతో సంప్రదించండి
ఇతర రాష్ట్రాల విధానాలపై అధ్యయనం చేయండి
ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగేలా చూడండి
అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై ఉక్కుపాదం మోపండి
అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
ఏపీతో విభజన సమస్యలను పరిష్కరించుకుందాం
ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన సహా పెండింగ్ అంశాలన్నింటిపై నివేదిక ఇవ్వండి
ఏపీకి కేటాయించిన భవనాలు స్వాధీనం చేసుకోండి
మంత్రులు, అధికారులతో భేటీలో ముఖ్యమంత్రి
18న కేబినెట్ భేటీ నిర్వహించాలని నిర్ణయం



హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15వ తేదీలోగా రైతు రుణమాఫీ చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులతో అన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని వారిని ఆదేశించారు. రైతులను రుణ విముక్తులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున.. నిర్దేశిత గడువులోగా నిధులను సమీకరించే ప్రయత్నాలు పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం భారీ మొత్తంలో నిధులు ఇచ్చేందుకు ముందుకువచ్చే బ్యాంకర్లతో సంప్రదింపులు చేయాలని సూచించారు. రుణమాఫీకి సంబంధించి మహారాష్ట్ర, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. అవసరమైతే రైతుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణ మాఫీకి సరిపడే నిధులను సర్దుబాటు చేయాలని, ఎన్నికల కోడ్ ముగిసేలోపు ఈ నిధుల సమీకరణకు మార్గాలను అధ్యయనం చేయాలని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీకి

మిగతా 13వ పేజీలో...

వీసీల నియామకానికి
ఈసీ ఓకే
13
సెర్చ్ కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు
వారం రోజుల్లో ఉపకులపతుల నియామక ప్రక్రియ పూర్తి
21వ తేదీతో పూర్తి కానున్న ప్రస్తుత వీసీల పదవీ కాలం

పాలనతోపాటు ప్రచారానికి సై!
2 రోజులుగా సమీక్షలతో సీఎం బిజీ
ఏఐసీసీ స్టార్ క్యాంపెయినర్ హోదాలో వీలును బట్టి ప్రచారానికి..
పలు పీసీసీల నుంచి ఆహ్వానాలు
రాయ్‌బరేలీతోపాటు భీవండీ, బరంపురంలో ప్రచారం చేసే చాన్స్
13

త్వరలో ఐఏఎస్, ఐపీఎస్‌ల
బదిలీలు?
కసరత్తు మొదలు పెట్టిన సర్కారు
కౌంటింగ్ ముగియగానే ఉత్తర్వులు
ఒకరిద్దరు కీలక ఐఏఎస్‌లకు స్థానచలనం
జీఏడీకి పూర్తిస్థాయి అధికారి?
కొందరు కలెక్టర్లకూ తప్పని బదిలీ!
విజిలెన్స్ డీజీగా సీనియర్ ఐపీఎస్‌ను నియమించే చాన్స్
నెలాఖరున యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ రిటైర్మెంట్
పోలీసు కమిషనర్లు, ఎస్పీల బదిలీలపైనా నజర్



'హిందూ-ముస్లిం' అని
విడదీయను
- అలా చేస్తే రాజకీయాలకు అర్హుడినే కాదు!
- మా ఇంట్లో ఈద్ జరిపేవాళ్లం.. ఆ రోజు పొరుగున ఉండే ముస్లింలే అన్నం పెట్టేవారు
- 'గోద్రా' తర్వాత నా ప్రతిష్ఠను దెబ్బతీశారు
- ప్రతిపక్షాలు పూర్తిగా విఫలం.. ఇక పాలనలో ఎలా సక్సెస్ అవుతారు: మోదీ

న్యూఢిల్లీ, మే 15: 'హిందూ-ముస్లిం' రాజకీయాలు చేయకూడదని తాను సంకల్పం తీసుకున్నానని ప్రధాని మోదీ అన్నారు. అలా విడదీసి రాజకీయాలు చేసిన రోజున ప్రజాజీవితంలో కొనసాగేందుకు తాను అర్హుడినే కాదని స్పష్టం చేశారు. 2002లో గోద్రా ఘటన తర్వాత తన ప్రతిష్ఠను కావాలనే దెబ్బతీశారని విపక్షాలను విమర్శించారు. 'ఆంగ్ల వార్తా చానల్ సీఎన్ఎన్-న్యూస్18'కు ఆయన ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. తన ఎన్నికల ప్రసంగాల్లో తానెప్పుడూ ముస్లింలను చొరబాటుదారులని అనలేదన్నారు. ఎక్కువ మంది పిల్లలను కలిగిఉన్నది ముస్లింలేనని కూడా

మిగతా 2వ పేజీలో...

ఏపీలో ఏం జరుగుతోంది?
పోలింగ్ ముగిసినా హింస ఏమిటి?.. ఈసీ సీరియస్
ఎన్నికల రోజున నిర్లక్ష్యం.. ఆ తర్వాతా ఇంత నిర్లిప్తతా?
ఈ హింసాకాండకు బాధ్యులెవరు..? 12
నేడు ఢిల్లీ వచ్చి వివరణివ్వండి.. సీఎస్, డీజీపీకి సమన్లు
డీజీపీ, నిఘా చీఫ్‌తో సీఎస్ జవహర్‌రెడ్డి అత్యవసర భేటీ
కమిషన్‌కు ఏం చెప్పాలనే దానిపై చర్చలు



ప్రపంచంలోనే సంపన్న పార్టీ బీజేపీ: ప్రియాంక

రాయ్‌బరేలీ, మే 15: కేవలం పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ ప్రపంచంలోనే అత్యంత సంపన్న పార్టీగా అవతరించిందని, అయినా అది కాంగ్రెస్‌ను అవినీతి పార్టీ అంటూ ఆరోపిస్తుందని ప్రియాంక గాంధీ ఎద్దేవా చేశారు. బుధవారం రాయ్‌బరేలీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె... ఎన్నికల బాండ్లలో భారీగా అవినీతి జరిగిందని మండిపడ్డారు. ప్రధాని సహా బీజేపీలో ప్రతి నేత మత విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ముందుంటారన్నారు.

లోకం తీరు



'ఇండియా'కు బయట నుంచి మద్దతు



కోల్‌కతా, మే 15 : ఇండియా కూటమి విషయంలో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ స్వరం మారింది. సీట్ల పంపకం అంశంలో కాంగ్రెస్‌తో వచ్చిన విభేదాల వల్ల 'ఇండియా'కు దూరంగా ఉన్న ఆమె బుధవారం కూటమికి మద్దతుగా మాట్లాడారు. హుగ్లీ జిల్లాలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మమత మాట్లాడుతూ.. 400 స్థానాల్లో గెలిచి మళ్లీ అధికారం చేపడతామంటూ బీజేపీ చెబుతున్న మాటలను తోసిపుచ్చారు. అంతేకాక, ఇండియా కూటమి కేంద్రంలో అధికారం చేపట్టేందుకు అవసరమైన మద్దతును తాము బయటి నుంచి ఇస్తామని ప్రకటించారు. అయితే, బీజేపీతో కలిసి పని చేస్తున్న బెంగాల్ కాంగ్రెస్, సీపీఐ పార్టీలు తమ దృష్టిలో ఇండియా కూటమిలో భాగం కాదన్నారు. తమ మద్దతు జాతీయ రాజకీయాలకే పరిమితమని మమత స్పష్టం చేశారు.

పేదలకు 10 కిలోల ఉచిత రేషన్ ఇస్తాం: ఖర్గే

లఖ్‌నవూ, మే 15: ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశంలోని పేదలకు బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత రేషన్ పరిమాణాన్ని రెట్టింపు చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ప్రకటించారు. కాంగ్రెస్ ఆహార భద్రతా చట్టాన్ని తెచ్చిందని, పేదల కోసం మీరేమీ చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. బుధవారం సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో కలసి ఖర్గే మీడియాతో మాట్లాడారు. 'మీరు 5కిలోలు ఇస్తున్నారు. ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడితే మేం పేదలకు 10కిలోల రేషన్ ఇస్తాం. తెలంగాణ, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో ఇప్పటికే దీన్ని అమలు చేశాం కాబట్టే గ్యారంటీగా చెబుతున్నాను' అని ఆయన పేర్కొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీకి వీడ్కోలు పలికేందుకు దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఖర్గే చెప్పారు. జూన్ 4న ఇండియా కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ యత్నం: రాహుల్

బోలంగిర్, మే 15: రాజ్యాంగాన్ని నాశనం చేయాలని, దళితులు, గిరిజనులు, బీసీలకు కల్పించిన రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ చూస్తోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. బుధవారం ఒడిశాలోని బోలంగిర్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఈసారి బీజేపీ గెలిస్తే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తారని, దేశాన్ని 22మంది బిలియనీర్లు నడిపిస్తారని పేర్కొన్నారు. ప్రజల నుంచి జీఎస్టీ రూపంలో వసూలు చేసిన డబ్బు కేవలం ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు మాత్రమే వెళ్తోందని ఆరోపించారు. విమానాశ్రయాలను పారిశ్రామికవేత్తలకు అప్పగించడం, రక్షణ కాంట్రాక్టులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వడమే తాము చేసిన అభివృద్ధిగా బీజేపీ చూపిస్తోందని ఎద్దేవా చేశారు. వారు 22మంది బిలియనీర్ల కోసం పనిచేస్తే, తాము కోట్ల మంది లక్షాధికారులను సృష్టించబోతున్నామని ప్రకటించారు.

ఆర్మీపై రాహుల్ వ్యాఖ్యలు అర్థరహితం: బీజేపీ

న్యూఢిల్లీ, మే 15: మోదీ ప్రభుత్వం ఆర్మీలో సైనికులను రెండు వర్గాలుగా విభజించిందని ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎన్నికల కమిషన్‌ను కోరింది. విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేఘవాల్, రాజీవ్ చంద్రశేఖర్‌తో కూడిన సీనియర్ నేతల బీజేపీ బృందం బుధవారం ఈసీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసింది. రాయ్‌బరేలీ ఎన్నికల ప్రచారంలో రాహుల్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం ఆర్మీలోని సైనికులను రెండు వర్గాలకు విభజించిందని.. ఒక వర్గంలో పేద, వెనుకబడిన తరగతుల సైనికులు ఉంటారని, మరో దాంట్లో ఉన్నత కుటుంబాల నుంచి వచ్చిన సైనికులు ఉంటారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని జైశంకర్ చెప్పారు. ఇది ఎన్నికల అంశం కాదని, దేశ భద్రతకు సంబంధించినదని అన్నారు. సైన్యంపై రాహుల్ వ్యాఖ్యలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు.

మెషిన్‌గన్‌తో విరుచుకుపడే 'హెక్సాకాప్టర్'

» సైన్యంలోకి సరికొత్త డ్రోన్



న్యూఢిల్లీ, మే 15: భారత రక్షణ రంగంలో కీలక ముందడుగు పడింది. మెషిన్‌గన్‌తో శత్రువులపై విరుచుకుపడే అత్యాధునిక హెక్సాకాప్టర్ డ్రోన్‌ను భారత సైన్యం పరిచయం చేసింది. 'మేకిన్ ఇండియా'లో భాగంగా ఇక్రాన్ ఏరోస్పేస్ అండ్ టెక్నాలజీస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దీన్ని రూపొందించింది. ఇదొక మానవ రహిత ఏరియల్ వాహనం (యూఏవీ). ఆర్మీ ఆపరేషన్లలో ఇది సైన్యానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. చిన్న తుపాకుల నుంచి.. గ్రెనేడ్లు, మోర్టార్ల వంటి ఆయుధాల శ్రేణిని కలిగి ఉంటుంది. వివిధ పరిస్థితుల్లో దీన్ని నిఘా కోసం ఉపయోగించవచ్చు. అలాగే సామగ్రిని, మిషన్ గన్లను, గ్రేడ్లను తరలించడానికి దీన్ని వాడుకోవచ్చు. ఇటీవల చిన్న ఆయుధాల టెస్ట్ ఫైరింగ్ సమయంలో ఆర్మీ అధికారులు దీని పనితీరుని పరిశీలించారు.

పంబా బేస్‌లో పార్కింగ్‌కు హైకోర్టు అనుమతి

కోచి, మే 15: శబరిమల యాత్రికులకు శుభవార్త..! నెలవారీ పూజలకు శబరిమలకు వెళ్లే భక్తుల కార్లను పంబాబేస్‌లో పార్క్ చేసేందుకు కేరళ హైకోర్టు అనుమతినిచ్చింది. గతంలో హైకోర్టు పంపాలో పార్కింగ్‌పై నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీంతో భక్తులు పంబాబేస్‌కు 43 కిలోమీటర్ల దూరంలో ఉన్న నీలక్కల్‌లో వాహనాలను పార్క్ చేసి, అక్కడి నుంచి కేఎస్ఆర్టీసీ బస్సుల్లో వచ్చేవారు. అయితే.. భక్తుల సౌకర్యార్థం ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) ఇటీవల హైకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై విచారణ జరిపిన డివిజన్ బెంచ్.. తాత్కాలికంగా(నెలవారీ పూజల సమయంలో) పంపా(చక్కుపాలెం), త్రివేణి సంగమం, హిల్‌టాప్ ప్రాంతాల్లో కార్ల పార్కింగ్‌కు అనుమతినిచ్చింది. కాగా.. కేరళ ఆలయాల్లో గన్నేరు పూలపై నిషేధం విధించారు. గత నెల 28న సూర్య సురేంద్రన్(24) అనే నర్సు దేవుడికి పూలు తెంపుతూ.. ఓ పువ్వును నోట్లో వేసుకుని అస్వస్థతకు గురయ్యారు. ఆ తర్వాత చికిత్స పొందుతూ మృతిచెందారు. గన్నేరు పూలలో హానికారక విష పదార్థాలుంటాయని తేలడంతో.. ఆ పువ్వులను నిషేధిస్తున్నట్లు రెండు దేవాలయ బోర్డులు ప్రకటించాయి.

హెచ్ 1బీ గడువు దాటినా అమెరికాలో ఉండొచ్చు!

న్యూఢిల్లీ, మే 15: అగ్రరాజ్యం అమెరికాలో నివసిస్తూ లేఆఫ్‌లకు గురైన హెచ్-1బీ వీసాదారులకు భారీ ఊరట కలిగించేలా అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) నూతన మార్గదర్శకాలను ప్రకటించింది. ఈ మార్గదర్శకాలు లే ఆఫ్‌లో ఉన్నవారికి అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను వివరిస్తున్నాయి. వీటి ప్రకారం.. ఉద్యోగం కోల్పోయిన విదేశీయులు 60 రోజుల గ్రేస్ పీరియడ్ తర్వాత కూడా అమెరికాలో నివసించేందుకు అవకాశం కలుగుతుంది. గ్రేస్ పీరియడ్ పూర్తయ్యేలోపు నాన్‌ఇమిగ్రెంట్ స్టేటస్ మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఉద్యోగులు ఒక సంవత్సరం పాటు 'తప్పనిసరి పరిస్థితుల' ఉపాధి అధికార పత్రం(ఈఏడీ) కోసం దరఖాస్తును దాఖలు చేయవచ్చు. దీనితోపాటు కంపెనీ మారడానికి కూడా పిటిషన్ దాఖలు చేయవచ్చు.

పీవోకేని భారత్‌లో కలుపుతాం!

పాక్ దగ్గర అణు బాంబులున్నా వెనక్కి తగ్గేదేలేదు.. చేసి తీరుతాం

» ఆ ప్రాంతం ఈ దేశంలో భాగం
» కేంద్ర హోం మంత్రి షా ప్రకటన



న్యూఢిల్లీ, మే 15: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో ఒకవైపు అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన ప్రకటన చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 400 సీట్లతో కేంద్రంలో తిరిగి అధికారం చేపట్టిన తర్వాత పీవోకేని తిరిగి భారత్‌లో కలుపుతామని ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లోని సిరాంపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. 370 అధికరణం రద్దు తర్వాతే జమ్ము కశ్మీర్‌లో శాంతి పవనాలు వీస్తున్నాయని, స్వేచ్ఛా నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయని తెలిపారు. 2019లో తమ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయం కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు ముందు ఈ రాష్ట్రంలో నిత్యం రాళ్ల దాడులు జరిగేవని చెప్పారు. ఇప్పుడు రాళ్ల దాడులు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ వరకే పరిమితమయ్యాయని తెలిపారు. "పీవోకే భారత్‌లో భాగం అవునా? కాదా?" అని సభకు వచ్చిన వారిని ప్రశ్నించారు. పీవోకే భారత్‌లో భాగమని, దీనిని తిరిగి వెనక్కి తీసుకుంటామని చెప్పారు. ఇదేసమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్ దగ్గర అణుబాంబులు ఉన్నాయని.. కాబట్టి పాకిస్థాన్ జోలికి వెళ్లవద్దన్న మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. "పాక్ దగ్గర అణు బాంబులు ఉన్నాయని వారు(కాంగ్రెస్) భయపడుతున్నారు. అయినప్పటికీ పీవోకేను వెనక్కి తీసుకుంటాం. పీవోకే భారత్‌లో భాగం. దీనిని ఖచ్చితంగా తిరిగి తీసుకుంటాం" అని షా నొక్కి చెప్పారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు జీహాద్‌కు ఓటు వేస్తారో, అభివృద్ధికి ఓటు వేస్తారో నిర్ణయించుకోవాలన్నారు.

జ్ఞాన్‌వాపీలో ఆలయం

మరోవైపు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కూడా ఇవే వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీ కూటమికి 400 సీట్లకు పైగా వస్తే పీవోకేను భారత్‌లో విలీనం చేస్తామని ప్రకటించారు. జార్ఖండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మభూమిలో ఆలయాన్ని నిర్మిస్తామని, జ్ఞానవాపీలోనూ ఆలయ నిర్మాణం తథ్యమని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతిని కూడా అమలు చేయనున్నట్టు తెలిపారు. "2019లో కేవలం 300 సీట్లు దాటినప్పుడే అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించాం. ఆర్టికల్ 370ని రద్దు చేశాం. సీఏఏని అమలు చేశాం. 400 సీట్ల మార్కు దాటితే మరిన్ని చేస్తాం" అని సీఎం బిశ్వశర్మ అన్నారు.

కేజ్రీకి సుప్రీం స్పెషల్ ట్రీట్‌మెంట్

(మొదటి పేజీ తరువాయి)

ఏమిటంటే, 2029 తర్వాత కూడా మోదీ మాకు నాయకత్వం వహిస్తారు" అని కేజ్రీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్‌పై కేజ్రీ పీఏ బిభవ్ కుమార్ దాడి గురించి ప్రస్తావిస్తూ.. "ఆయన ప్రస్తుతానికి వేరే వివాదంలో చిక్కుకున్నారు. ముందు దాన్నుంచి బయటపడనివ్వండి" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమికి మెజారిటీ వస్తే జూన్ 5న తాను జైలు నుంచి బయటకు వస్తానని, చీపురు గుర్తుకు ప్రజలు వెల్లువలా ఓటేస్తే తాను అసలు జైలుకే వెళ్లాల్సిన అవసరం ఉండదని కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు స్పష్టంగా కోర్టు ధిక్కారమేనని పేర్కొన్నారు. "ఎన్నికల్లో ఎవరైనా గెలిస్తే.. వారు దోషులుగా తేలినా సరే, సుప్రీంకోర్టు వారిని జైలుకు పంపలేదని చెప్పడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. కేజ్రీకి బెయిల్ ఇచ్చిన న్యాయమూర్తులు ఇప్పటికైనా గమనించాలి" అని వ్యాఖ్యానించారు.

సీఏఏ కింద తొలిసారి 14మందికి భారతీయ పౌరసత్వం

న్యూఢిల్లీ, మే 15: దేశంలో పౌరసత్వ సవరణ చట్టం- 2019 (సీఏఏ) అమలులోకి వచ్చిన తర్వాత తొలిసారి 14 మందికి భారతదేశ పౌరసత్వం లభించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో 14 మందికి తొలి విడతగా.. కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా ఢిల్లీలో బుధవారం సీఏఏ కింద జారీ అయిన పౌరసత్వ సర్టిఫికెట్లను అందజేశారు. దేశంలో సీఏఏ అమలులోకి వచ్చిన దాదాపు నాలుగేళ్ల తర్వాత ఈ ఏడాది మార్చి 11న కేంద్ర ప్రభుత్వం ఈ చట్టానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసిన సంగతి తెలిసిందే. కాగా, 2019 డిసెంబరులో ప్రతిపక్షాల తీవ్ర ఆందోళనల నడుమ పార్లమెంటు ఉభయ సభల్లో ఈ చట్టం ఆమోదం పొందింది. అనంతరం రాష్ట్రపతి సమ్మతితో అమల్లోకి వచ్చింది. సీఏఏ ప్రకారం పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతర శరణార్థులకు భారతదేశ పౌరసత్వం లభిస్తుంది. 2014 డిసెంబరు 31 కంటే ముందు మన దేశానికి వచ్చిన హిందూవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవ శరణార్థులకు ఇది వర్తిస్తుంది.

ఝార్ఖండ్ మంత్రి ఆలంగీర్ అరెస్టు

న్యూఢిల్లీ, మే 15 : ఝార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, కాంగ్రెస్ నేత ఆలంగీర్ ఆలమ్(70)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మనీలాండరింగ్ కేసులో బుధవారం అరెస్టు చేసింది. ఆలంగీర్ ఆలమ్ పర్సనల్ సెక్రటరీ(పీఎస్) సంజీవ్ లాల్ పని మనిషి జహంగీర్ ఆలమ్ ఇంట్లో రూ.35.23 కోట్లు దొరికిన కేసులో ఈడీ చర్యలు తీసుకుంది. ఆలంగీర్ ఆలమ్‌ను బుధవారం వరుసగా రెండో రోజు విచారణకు పిలిచిన ఈడీ ఆయన్ను అరెస్టు చేసినట్టు ప్రకటించింది. ఈడీ అధికారులు జహంగీర్ ఆలమ్ ఇంట్లో గత వారం రూ.35.23 కోట్లు గుర్తించి సీజ్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే అరెస్ట్ అయిన సంజీవ్ లాల్, జహంగీర్ ఆలమ్ ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నారు.

మనీశ్ సిసోడియా కస్టడీ 30 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా జ్యూడీషియల్ కస్టడీని మే 30వ తేదీ వరకు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. గతంలో సీబీఐ, ఈడీ కేసులలో కోర్టు విధించిన కస్టడీ ముగియడంతో బుధవారం సిసోడియాను వర్చువల్ విధానంలో ప్రత్యేక న్యాయమూర్తి కావేరి భవేజా ఎదుట హాజరు పరిచారు. కుంభకోణం నిందితుల్లో ఒక్కరైన అరుణ్‌పిళ్లై అప్పీల్.. ఢిల్లీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున, సిసోడియాపై అభియోగాల నమోదుకు అదనపు వాదనలు వినేందుకు కేసును కోర్టు మే 30కి వాయిదా వేసింది.

రూ. 170 కోట్ల సొత్తు స్వాధీనం

» నాందేడ్ భండారీ బ్రదర్స్‌పై ఐటీ దాడులు
» సొత్తు విలువ లెక్కింపునకు 14 గంటలు

నాందేడ్, మే 15: మహారాష్ట్రలోని నాందేడ్, శంభాజీనగర్, నాసిక్‌లలో మైక్రో ఫైనాన్స్, సహకార బ్యాంకులను నడిపే భండారీ బ్రదర్స్‌పై దాడులు జరిపిన ఆదాయ పన్ను శాఖ(ఐటీ) రూ.170 కోట్ల సొత్తును సీజ్ చేసింది. వీటిల్లో 26 ఖరీదైన కార్లు, 12 కిలోల బంగారం, ఆస్తులు, రూ.14 కోట్ల నగదు ఉన్నట్లు ఐటీ అధికారులు వెల్లడించారు. శుక్రవారం ప్రారంభమైన దాడులు.. మూడు రోజులపాటు కొనసాగాయని వివరించారు. ఆస్తుల విలువ కట్టేందుకు 14 గంటల సమయం పట్టినట్లు తెలిపారు. నాందేడ్‌కు చెందిన భండారీ బ్రదర్స్- సంజయ్ భండారీ, వినయ్ భండారీ, ఆశిష్ భండారీ, సంతోష్ భండారీ, మహావీర్ భండారీ, పరమ్ భండారీలు ఆదినాథ్ కో-ఆపరేటివ్ బ్యాంక్, భండారీ ఫైనాన్స్ సంస్థలను నిర్వహిస్తున్నారు. ఈ రెండు సంస్థలను 2022 సెప్టెంబరు, నవంబరులో స్థాపించారు. అయితే.. ఆదాయ పన్ను చెల్లింపుల్లో తేడాలు, పన్ను ఎగవేతలను గుర్తించిన ఐటీ అధికారులు.. శుక్రవారం ఏకకాలంలో ఆరు కార్యాలయాలు, భండారీ బ్రదర్స్ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సోమవారం రాత్రి దాకా సోదాలు జరిగాయి.

'హిందూ-ముస్లిం' అని విడదీయను

(మొదటి పేజీ తరువాయి)

అనలేదని తెలిపారు. 'ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారంటే దానర్థం వారు ముస్లింలు అనేనా? వారి పట్ల అంత అన్యాయంగా ఎలా వ్యవహరిస్తారు? కుటుంబాల్లో ఎక్కువ మంది పిల్లలు ఉంటే వారి పోషణ, విద్య, వస్త్రాల కొనుగోలు మొదలైనవి కష్టమవుతాయి. మతంతో సంబంధం లేకుండా పేదలందరి పరిస్థితి ఇలాగే ఉంటుంది' అని తెలిపారు. చిన్నతనంలో తమ ఇరుగుపొరుగున ముస్లిం కుటుంబాలు ఉండేవని.. వారి ఆచార వ్యవహారాలను దగ్గరగా చూసి అర్థం చేసుకున్నానని చెప్పారు. 'ఇతర పండుగల్లాగే మా ఇంట్లో ఈద్ కూడా జరిపేవాళ్లం. ఆ రోజున ఇంట్లో వంటచేసేవాళ్లు కాదు. పొరుగున ఉన్న ముస్లింల ఇళ్ల నుంచి భోజనం వచ్చేది. మొహర్రం ఊరేగింపులకు వెళ్లేవాళ్లం. తజియా (మహ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హసన్ సమాధి ప్రతిరూపం)ను మోసేవాళ్లం. అలాంటి సమాజంలో నేను పెరిగాను. నాకు పలువురు ముస్లిం స్నేహితులు ఉన్నారు. కానీ ఈ కోణాన్ని ప్రచారం చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. వ్యక్తిగతంగా నాకు మద్దతిచ్చే ముస్లింలు చాలా మంది ఉన్నారు. అయితే మీరు ఇది చేయాలి.. ఇది చేయాలంటూ వారిని నిర్దేశించే శక్తి వేరే ఉంది. 2002లో గోధ్రా ఘటన తర్వాత నా ప్రతిష్ఠను కావాలనే దెబ్బతీశారు' అని అన్నారు.



బుధవారం మహారాష్ట్రలో మోదీ ప్రచారం

నేను ప్రజాస్వామ్యవాదిని..

తాను ప్రజాస్వామ్యవాదినని.. 2014 నుంచి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షం లేకపోయినా.. అందులో అతి పెద్ద విపక్షానికి చెందిన నేతను వివిధ కమిటీల్లో నియమించేలా చట్టం తీసుకొచ్చానని మోదీ తెలిపారు. అలా చేయకపోయినా ఇబ్బంది లేదని.. కానీ చేశానని చెప్పారు. 400కిపైగా సీట్లను సాధించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ప్రతిపక్షం బలంగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. 'అయితే బలమైన ప్రతిపక్షమని అంటే.. పార్లమెంటు జరక్కుండా రచ్చరచ్చచేయడం కాదు. అది అప్రజాస్వామికం. దురదృష్టవశాత్తూ.. గత పదేళ్లలో ఆయా పార్టీలు తమ విపక్ష పాత్రను సక్రమంగా పోషించడంలో విఫలమయ్యాయి. ప్రతిపక్షంగానే విఫలమైన వారు పాలనలో ఎలా విజయవంతమవుతారు' అని నిలదీశారు. భారత్‌కు దృఢమైన ప్రజాస్వామ్యం ఉండాలని.. ఇందుకోసం పటిష్ఠ ప్రతిపక్షం ఉండాలని అన్నారు. అందుకే చిన్న చిన్న పార్టీలన్నీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ మంచి సలహాయే ఇచ్చారని.. ఇదే జరిగితే గౌరవప్రదమైన విపక్షం ఏర్పడుతుందని చెప్పారు. 'అయితే విలీనమైతే.. ఈ ఎన్నికల్లో వచ్చే సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా ఏర్పడడం సాధ్యం కాదు. గుర్తింపు పొందిన ప్రతిపక్షంగా ఆవిర్భవించడానికి తగినన్ని సీట్లు వాటికి రావు' అని ప్రధాని స్పష్టం చేశారు.

యూపీలో ఎవరిది పైచేయి?

» ఎన్డీఏకు ఇండియా గట్టి పోటీ
» ఎస్పీ-కాంగ్రెస్‌వైపు దళితులు, ముస్లింలు.. బీఎస్పీ బలహీనం



న్యూఢిల్లీ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ బలమైన పార్టీగా ఉన్నప్పటికీ 2019లో ఆ పార్టీ సాధించిన ఫలితాలు పునరావృతం కావని ప్రతిపక్ష శిబిరంలో ఉన్న పలువురు నేతలు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీనికి ప్రతిగా బీజేపీ నేతలు మాత్రం.. రామమందిరం నిర్మాణం, డబుల్ ఇంజిన్ సర్కార్ హయాంలో జరిగిన నిర్మాణాత్మక కార్యక్రమాలతో గతంలో కంటే ఎక్కువ ఫలితాలు సాధిస్తామని ఆశాభావంతో ఉన్నారు. 2014లో యూపీలో బీజేపీ 71 సీట్లు సాధించగా, 2019లో 62 సీట్లు గెల్చుకుంది. ఆ పార్టీ మిత్రపక్షం అప్నాదళ్ (ఎస్) మరో రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఈసారి రాష్ట్రంలోని మొత్తం 80 సీట్లలో తమ ఎన్డీఏ కూటమి 75కుపైగా స్థానాలను సాధిస్తుందని కమల నాథులు ఆత్మవిశ్వాసంతో ఉండగా.. 50 సీట్లకే పరిమితం అవుతుందని ప్రతిపక్ష శిబిరంలో ఉన్న వాళ్లు చెబుతున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీనైతే యూపీలో ఇండియా కూటవిం తుఫాన్ రానుందని, 50 సీట్లను తాము గెల్చుకుంటామని చెప్పారు. దీంతో ప్రజాతీర్పు ఎవరికి అనుకూలమనేది ఆసక్తిగా మారింది.

అఖిలేశ్.. పీడీఏ వ్యూహం


రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ, ఎస్పీ నేతృత్వంలోని ఇండియా కూటముల మధ్య పోటీ కేంద్రీకృతమై ఉండగా.. మాయావతి సారథ్యంలోని బీఎస్పీ ఒంటరిగా పోటీ చేస్తోంది. ఒవైసీ ఎంఐఎం కూడా యూపీలో ఓ స్థానిక పార్టీతో కలిసి తన ఉనికి కోసం పోరాడుతోంది. ఇండియా కూటమితో పోలిస్తే పలు సామాజిక వర్గాలను ఎన్డీఏ కూటమి తమవైపునకు తిప్పుకొన్నప్పటికీ ఈసారి గతంలో లేనంతగా బలమైన పోటీని ఎదుర్కొంటోంది. ఇందుకు ప్రధాన కారణం- గతంలో ప్రతిపక్ష ఓట్లను చీల్చిన బీఎస్పీ రోజురోజుకూ బలహీనపడుతోంది. 2019 ఎన్నికల్లో దాదాపు 20% ఓట్లు సాధించిన ఆ పార్టీ.. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 13% ఓట్లకే పరిమితమైంది. ప్రస్తుత ఎన్నికల్లో తన ఓటు శాతాన్ని మరింత కోల్పోనుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. బీఎస్పీ బలమైన మద్దతుదారైన దళిత ఓటుబ్యాంకులో గణనీయమైన భాగం ఈసారి కాంగ్రెస్‌వైపు మళ్లిందన్న అంచనాలు వెలువడుతున్నాయి. మరోవైపు, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా.. తమ పార్టీపై ఉన్న యాదవ్-ముస్లింల పార్టీ అన్న ముద్రను చెరిపివేసుకునేలా ఈసారి పీడీఏ (పిచ్‌డా దళిత్ అల్పసంఖ్యాక్ - బీసీ, ఎస్సీ, మైనారిటీ) నినాదంతో కొత్త ప్రయోగానికి తెర తీశారు. ఎస్పీ పోటీ చేస్తున్న 62 సీట్లలో కుర్మీ, మౌర్య, శాక్య తదితర పలు బీసీ వర్గాలకు, దళితులకు సీట్లు కేటాయించారు. ముస్లిం ఓటర్ల సంఖ్య గణనీయంగా ఉన్న నియోజకవర్గాల్లోనూ హిందూ అభ్యర్థులనే అఖిలేశ్ నిలబెట్టి.. బీజేపీ హిందూ-ముస్లిం వ్యూహాన్ని ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. మరోవైపు, పలు నియోజకవర్గాల్లో బీఎస్పీ ముస్లిం అభ్యర్థులను బరిలో నిలిపింది. 20 సీట్లలో ఎంఐఎం తలపడుతోంది.

గర్భస్థ పిండానికీ జీవించే హక్కు

అవివాహిత మహిళ 27 వారాల గర్భవిచ్ఛిత్తికి సుప్రీంకోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ, మే 15: తల్లి గర్భంలో ఉన్న పిండానికి కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 27 వారాల గర్భవిచ్ఛిత్తికి అనుమతించాలంటూ 20 ఏళ్ల అవివాహిత మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు బుధవారం నిరాకరించింది. అంతకుముందు ఢిల్లీ హైకోర్టు కూడా ఇదే విధమైన తీర్పునిచ్చింది. దీంతో సదరు మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. 'క్షమించండి.. చట్టానికి విరుద్ధంగా మేం ఏ ఉత్తర్వులను జారీ చేయలేం' అని జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తేల్చి చెప్పింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ 'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టం కేవలం తల్లి గురించే చెబుతోంది. పిటిషనర్ తీవ్ర బాధలో ఉన్నారు. నీట్ పరీక్షల కోసం సన్నద్ధమౌతున్నారు. ఆమె శారీరక, మానసిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోండి' అని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'కడుపులో ఉన్న బిడ్డకూ జీవించే హక్కు ఉంది. గర్భం దాల్చి ప్రస్తుతం 7 నెలలు కావచ్చింది. గర్భాన్ని కొనసాగించడం వల్ల పిటిషనర్‌కు ఎటువంటి ప్రమాదం లేదని తేలింది. భ్రూణహత్య చట్టవిరుద్ధం, అనైతికం' అంటూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థించింది.

మార్తాండుడి మహోగ్రరూపం



గడిచిన పదేళ్ల కాలంలో ఎన్నడూ లేనంతగా అత్యంత బలమైన సౌర తుఫాను మంగళవారం సంభవించింది. ఆ సమయంలో నాసా సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ తీసిన సూర్యుడి చిత్రం ఇది. సౌర తుఫానుల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలతో పాటు ఇటీవల లద్దాఖ్‌లో కూడా వివిధ రంగుల రూపం(అరోరా)లో కనిపించిన సంగతి తెలిసిందే.

స్లొవేకియా ప్రధానిపై కాల్పులు

విషమంగా పరిస్థితి.. నిందితుడి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు



రాబర్ట్ ఫికో

హ్యాండ్లోవా, మే 15: స్లొవేకియా దేశ ప్రధాన మంత్రి రాబర్ట్ ఫికోపై బుధవారం హత్యాయత్నం జరిగింది. హ్యాండ్లోవా నగరంలో మంత్రిమండలి సమావేశంలో పాల్గొని బయటికొచ్చిన అనంతరం ఆయనపై దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆయన్ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఫికో పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానిక మీడియా తెలిపింది. నిందితుణ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రష్యా అనుకూలుడిగా పేరున్న ఫికో, గతంలో రెండు పర్యాయాలు (2006-10, 20012-18) ప్రధానిగా పనిచేశారు. గతేడాది అక్టోబర్‌లో మూడోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పొరుగుదేశమైన ఉక్రెయిన్‌తో సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పలుమార్లు ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించిన ఆయన, రష్యాతో రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. మీడియా చట్టం సహా పలు వివాదస్పద మార్పులు చేసిన ఫికో పై ఆ దేశంలో నిరసనలు వెల్లువెత్తాయి. కాగా, ఫికోపై దాడిని ఆ దేశాధ్యక్షురాలు జుజానా క్యాపుటోవా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఫ్రాన్స్‌లో డ్రగ్స్ గ్యాంగ్ బీభత్సం

» పోలీస్ కాన్వాయ్‌పై తుపాకులతో దాడి
» తమ నాయకుడు 'ది ఫ్లై'ని తీసుకొని పరార్



మహ్మద్ అమ్రా

పారిస్, మే 15: విలన్‌ను పోలీసులు అరెస్టు చేసి వ్యాన్‌లో తీసుకువెళ్తారు.. అతని అనుచరులు దారి మధ్యలో కాపు కాసి, వ్యాన్‌ను అడ్డగించి పోలీసులను కాల్చివేసి తమ నాయకుడిని విడిపించుకొని పోతారు.. ఎన్నో సినిమాల్లో ఈ సీన్ చూసి ఉంటారు. అచ్చం అదే తరహాలో ఫ్రాన్స్‌లో ఓ గ్యాంగ్ తమ నాయకుడిని పోలీసుల నుంచి విడిపించుకుపోయింది. పోలీసుల కాన్వాయ్‌ను ఆపి మిషన్ గన్‌లతో కాల్పులు జరిపి తమ నాయకుడిని తీసుకొని పోయింది. ఈ గ్యాంగ్ జరిపిన దాడిలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు చనిపోయారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఫ్రాన్స్‌లో మహ్మద్ అమ్రా అనే వ్యక్తి ఓ డ్రగ్స్ గ్యాంగ్‌కు లీడర్. అంతా అతన్ని 'ది ఫ్లై' అని పిలుస్తారు. అతడిని పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో విచారణ కోసం రోయాన్ పట్టణం నుంచి నార్మండీకి తీసుకువెళ్తుండగా, మార్గమధ్యలో ఓ టోల్ బూత్ దగ్గర మాటేసిన అతని అనుచరులు ముసుగులు ధరించి కాన్వాయ్‌ను కారుతో ఢీకొట్టారు. కాన్వాయ్‌పై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఆ తర్వాత 'ది ఫ్లై'ని తీసుకొని పారిపోయారు. ఈ దాడి ఘటన అంతా టోల్ బూత్ దగ్గర ఉన్న కెమెరాల్లో రికార్డు అయింది. ఈ ఘటనపై ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితులను తప్ప శిక్షిస్తామన్నారు. నిందితుల కోసం వేట సాగుతోంది. కాగా, ఫ్రాన్స్‌లో ఇటీవల డ్రగ్స్ సంబంధిత నేరాలు బాగా పెరిగిపోయాయి. దీనిపై, ఆ దేశ సెనెట్ మంగళవారమే ఓ నివేదిక విడుదల చేసింది.

బీబీ క్యాన్సర్ ఆస్పత్రితో..
రెనోవా హాస్పిటల్స్ గ్రూప్ ఒప్పందం



ఒప్పంద పత్రాలను అందజేసుకుంటున్న డాక్టర్ పి.శ్రీధర్, డాక్టర్ సయ్యద్ నిస్సార్

చాదర్‌ఘాట్, మే 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మలక్‌పేటలోని బీబీ క్యాన్సర్ ఆస్పత్రితో ప్రముఖ రెనోవా హాస్పిటల్స్ గ్రూప్ ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు బుధవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసినట్లు రెనోవా హాస్పిటల్స్ చైర్మన్, ఎండీ డాక్టర్ పి.శ్రీధర్ ప్రకటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతమున్న బీబీ క్యాన్సర్ ఆస్పత్రిని అత్యాధునిక క్యాన్సర్ సంరక్షణ సౌకర్యాలతో అభివృద్ధి చేసి రెనోవా బీబీ క్యాన్సర్ ఆస్పత్రిగా ప్రారంభించినట్లు తెలిపారు. రెనోవా హాస్పిటల్స్ విస్తరణలో భాగంగా మలక్‌పేటలోని బీబీ అంకాలజీ సెంటర్‌ను అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. ఈ కేంద్రం భారతదేశంలో రెనోవా గ్రూప్ 9వ కేంద్రంగాను, 5వ అంకాలజీ కేంద్రంగానూ మారనుంది. అధిక నాణ్యత కలిగిన వైద్య సంరక్షణ ప్రాముఖ్యతను విస్తరించడానికి ఉత్తమ సేవల ద్వారా రోగుల శ్రేయస్సును మెరుగుపరచడానికి రెనోవా నిరంతరం కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా రేడియేషన్, న్యూక్లియర్ మెడిసిన్‌లలో సాంకేతికత అభివృద్ధి కోసం రూ.40కోట్ల పెట్టుబడులు పెట్టనున్నామని ప్రకటించారు. త్వరలో విద్యానగర్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ హాస్పిటల్ నుంచి కూడా రెనోవా హాస్పిటల్స్ గ్రూప్ సేవలు అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని ప్రముఖ నగరాల్లో రెనోవా హాస్పిటల్స్ వైద్యసేవలు విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు. బీబీ అంకాలజీ సెంటర్ చైర్మన్, ఎండీ డాక్టర్ సయ్యద్ నిస్సార్ మాట్లాడుతూ.. 1984లో స్థాపించిన తమ ఆస్పత్రి దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొట్టమొదటి ప్రైవేటు అంకాలజీ హాస్పిటల్‌గా పేరొందిందన్నారు.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను
జూన్ 10లోగా పునరుద్ధరించండి

కాళేశ్వరం ప్రాజెక్టు అధికారులకు జస్టిస్ పీసీ ఘోష్ సూచన



హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు చేసి, వాటిని జూన్ 10 లోగా పునరుద్ధరించాలని జస్టిస్ పీసీ ఘోష్ అధికారులకు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీలు దెబ్బతినడం, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై జస్టిస్ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ జరుగుతన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఇటీవల రాష్ట్రంలో పర్యటించారు. అనంతరం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ)కి లేఖ రాశారు. ఆయన లేఖతో.. బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకునే చర్యలపై ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక ఇచ్చింది. ఆ నివేదికను పరిశీలించిన జస్టిస్ ఘోష్.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు జూన్ 10కల్లా పూర్తికావాలని తాజాగా అధికారులకు సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ మరింత దెబ్బతినకుండా నష్టనివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఘోష్ సూచనలతో పాటు ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదికతో మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న గేట్లను ఎత్తడం లేదా, 10 రోజుల్లోగా పూర్తిగా తొలగించాలని నిర్మాణ సంస్థ 'ఎల్ అండ్ టీ'ని నీటిపారుదలశాఖ అధికారులు ఇప్పటికే ఆదేశించారు. ఏటా జూన్‌లో మేడిగడ్డకు వరదలు ప్రారంభమై ఫిబ్రవరి దాకా కొనసాగుతాయి. దీంతో ఈసారి వరదలు తగ్గుముఖం పట్టాక బ్యారేజీ పైన షీట్‌ఫైల్స్‌తో కాఫర్ డ్యామ్‌ను కట్టనున్నారు. మరోవైపు, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో పునాది కింద రంధ్రాలున్నట్లు గుర్తించారు. పునాది కింద ఇసుక కొట్టుకుపోవడంతో రంధ్రాలు ఏర్పడినట్లు తేల్చారు. వాటిని వానాకాలం వచ్చేలోపు సరిచేయనున్నారు. ఇదిలా ఉండగా, మేడిగడ్డ బ్యారేజీకి ఇప్పటికే పలు సాంకేతిక పరీక్షలు నిర్వహించారు. మరికొన్ని నిర్వహించాల్సి ఉంది. ఆ పరీక్షల నివేదిక పరిశీలన తర్వాత 7వ బ్లాకును తొలగించాలా.. ఆ బ్లాకు కుంగిన ప్రభావం 6, 8వ బ్లాకులపై పడిందా.. ఒకవేళ ప్రభావం చూపితే మొత్తం మూడు బ్లాకులు తొలగించి, కొత్త బ్లాకులు కట్టాలా.. అన్నదానిపై నిర్ణయం తీసుకోనున్నారు.



జూలైలో సీపీజెట్ పరీక్షలు

18 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు



హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే సీపీజెట్ పరీక్షలను జూలై నెలలో నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిలు సీపీజెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. దాని ప్రకారం ఈనెల 18 నుంచి వచ్చేనెల 17వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. రూ.500 ఆలస్య రుసుముతో జూన్ 25 వరకు, రూ.2 వేల ఆలస్యరుసుముతో జూన్ 30 వరకు దరఖాస్తులను సమర్పించవచ్చు. జూలై 5వ తేదీ నుంచి సీపీజెట్ పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో మొత్తం 51 పీజీ కోర్సులు ఉండగా, వాటిలో మొత్తం 47,211 సీట్లు ఉన్నాయి. అయితే ఈ సీట్లలో గతేడాది 21,519 సీట్లు(43.46 %) మాత్రమే భర్తీ అయ్యాయి. అలాగే గతేడాది పీజీ కోర్సుల్లో పురుషులు 5,412 మంది చేరగా మహిళలు 15,107 మంది చేరారు.


ఎమ్మెల్యే పల్లా, కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డిపై కేసు

మరో 9 మంది అనుచరులపై కూడా

జనగామ, మే 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ పడిన ఘటనలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులపై జనగామ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 13న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి ధర్మకంచ పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. దీనిపై అక్కడే ఉన్న బీఆర్‌ఎస్ ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అక్కడకు చేరుకోగా.. ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రం వద్ద గందరగోళం సృష్టించారంటూ కాంగ్రెస్ నేతలు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, దాసరి క్రాంతి, మేడ శ్రీనివాస్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నేతలు వీరస్వామి, మాజిద్, తిప్పారపు విజయ్, మల్లిగారి రాజు, గజ్జెల నర్సిరెడ్డి, ఉల్లెంగుల సందీప్ పై పోలీసులు కేసు నమోదు చేశారు.

జగన్ ఇంట్లో రాజశ్యామల యాగం

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నివాసం తాడేపల్లి ప్యాలెస్‌లో రాజశ్యామల యాగం నిర్వహించారు. బుధవారం చివరిరోజు పూర్ణాహుతిలో ముఖ్యమంత్రి స్వయంగా పాల్గొన్నారు. దాదాపు 41రోజులు సాగిన ఈ యాగం గురించి బయటకు పొక్కకుండా మొత్తం క్రతువును పూర్తిచేశారు. ఈ కార్యక్రమం మొత్తం సీఎం నివాసంలో ప్రత్యేకంగా నిర్మించిన ఆలయంలో నిర్వహించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మంచి పరిణామం

జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ లోక్‌సభ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో 38శాతం పోలింగ్ నమోదుకావడం సంతోషించాల్సిన అంశం. 1996 తరువాత అత్యధిక పోలింగ్ జరిగిన రికార్డు ఇదే. ఓటర్లు ఉత్సాహంగా ఓట్లువేయడంతో పాటు, ఎటువంటి దాడులు, ఘర్షణలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా పూర్తికావడం మరో విశేషమైన పరిణామం. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), పీడీపీతో పాటు 24మంది ఇక్కడ పోటీలో ఉన్నారు. బుద్గాం జిల్లాలోని కొన్ని భాగాలను తొలగించి, పుల్వామా జిల్లాను, షోపియాన్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలను చేర్చి పునర్వ్యవస్థీకరించిన శ్రీనగర్ లోక్‌సభ నియోజకవర్గం కశ్మీరీ పండిట్ల ఉత్సాహపూరితమైన భాగస్వామ్యంతో, ఘనమైన పోలింగ్‌తో అందరి దృష్టినీ ఆకర్షించింది. పోస్టల్ బ్యాలెట్‌తోపాటు, ఢిల్లీ, జమ్మూ, ఉదంపూర్ లలోని శరణార్థ శిబిరాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను కూడా ఓటర్లు చక్కగా వినియోగించుకున్నారు. దశాబ్దాలుగా ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని 2019 ఆగస్టులో రద్దుచేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలు మార్చిన తరువాత అక్కడ జరుగుతున్న తొలి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు విస్తృతంగా పాల్గొనడం మంచి పరిణామం. 370వ అధికరణ రద్దు నిర్ణయం సరైనదీ సముచితమైనదీ అని ప్రజలు ఈ విధంగా తీర్పుచెప్పారంటూ ప్రధాని నరేంద్రమోదీ వెంటనే ట్వీట్ చేశారు. మంగళవారం ఒక ఆంగ్లదినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా అదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

సంస్థాగతంగా తమ పార్టీని బలోపేతం చేసుకొనేవరకూ అక్కడ పోటీచేయకూడదని నిర్ణయించుకున్నామని హోంమంత్రి అంటున్నారు. అయితే, బీజేపీ బరిలో లేకపోలేదని, మారువేషంలో ఉన్నదని కశ్మీరీ పార్టీలైన పీడీపీ, ఎన్సీల వాదన. అల్తాఫ్ బుఖారీకి చెందిన అప్నీ పార్టీ (ఏపీ), సజ్జాద్‌లోన్ నాయకత్వంలోని పీపుల్స్ కాన్ఫరెన్స్ (పీసీ)లను బీజేపీ ఆశీస్సులున్న పార్టీలుగా ప్రజలు కూడా అనుమానిస్తున్నారు. ఈ రెండు పార్టీలు వేర్వేరు స్థానాల్లో బరిలో ఉంటూ ప్రధానంగా అబ్దుల్లాలకు, ముఫ్తీలకు సవాలు విసురుతున్నాయి. తమ ప్రత్యేకప్రతిపత్తిని హరించి, అన్ని రక్షణలనూ తొలగించి, బయటివారికి తలుపులు తెరిచిన కేంద్రపాలకుల మీద కశ్మీరీలు ఆగ్రహంగా ఉన్నారని, పోలింగ్ జరుగుతున్న స్థానాల్లో ఓటింగ్ గణనీయంగా పెరగడం బీజేపీమీద ఆగ్రహమే తప్ప అనుగ్రహం కాదని కొందరి వాదన. పోలింగ్ శాతం తక్కువగా ఉంటూ, కశ్మీరీ పార్టీల మధ్య ఓట్లు చీలిన పక్షంలో బీజేపీ ఆశీస్సులున్న కొత్తపార్టీలకు లబ్ధి చేకూరుతుందని, ఇప్పుడు అధికపోలింగ్‌తో పాతపార్టీలకే మేలు చేకూరుతుందని వారి విశ్లేషణ. ఎవరి అంచనాలు ఎలా ఉన్నప్పటికీ, మారిన వాతావరణం నేపథ్యంలో కశ్మీర్‌లో ఓటర్ల మనోగతాన్ని విశ్లేషించడం నిజానికి సాహసమే. కానీ, దశాబ్దాలుగా ఓటుచేయని వృద్ధులు సైతం లైన్లలో నిలబడి, ఈవీఎంల గురించి తెలుసుకొని మరీ ఓటుచేయడం సంతోషం కలిగించే పరిణామం. స్వేచ్ఛగా, ఏమాత్రం భయం లేకుండా ఓటువేయగలిగే అవకాశాలు గతంతో పోల్చితే ఇప్పుడు మరింత మెరుగ్గా ఉన్నాయి. ప్రజలు ఎంతో ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. వలసపోయిన కశ్మీరీ పండిట్లలో నలభైశాతం మంది ఓటువేశారని హోంమంత్రి గుర్తుచేస్తున్నారు. హింస, పోలింగ్ బహిష్కరణ ఆదేశాలు పాటించనివారిపై దాడులు ఇత్యాది దృశ్యాలను దశాబ్దాలుగా అక్కడ చూశాం. నిరుద్యోగం, అధికధరలు, భవిష్యత్‌మీద అపనమ్మకం ఇత్యాదివి ఇప్పుడు ఓటర్లమీద పనిచేశాయి. ఓటుద్వారానే తమ బతుకులను మార్చుకోవాలని ప్రజలు నిర్ణయించుకున్నారు.


ఈ ఎన్నికల్లో కశ్మీర్‌లోయను వదిలిపెట్టి, లద్దాఖ్, జమ్మూలకు పరిమితం కావాలని బీజేపీ ఎందుకు నిర్ణయించుకుందో తెలియదు. 370అధికరణ రద్దును కశ్మీరీలు స్వాగతిస్తున్నారని నమ్మినపక్షంలో బీజేపీ నిర్భయంగా ఈ ఎన్నికల ద్వారా ప్రజామోదాన్ని కోరివుండేది. తద్వారా, ప్రత్యేకప్రతిపత్తి రద్దు తరువాత తాను చేపట్టిన సంస్కరణలను, సాధించిన అభివృద్ధిని ప్రజలు మెచ్చుకున్నారని దేశానికి సగర్వంగా చెప్పుకోగలిగే అవకాశమూ దానికి దక్కేది. ఈ రాజకీయాన్నంతా పక్కనబెడితే, ఈ ఏడాది సెప్టెంబర్ 30లోగా జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తిచేయాల్సిందేనంటూ ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. సాధ్యమైనంత త్వరలో రాష్ట్రహోదాను పునరుద్ధరించాలని కూడా కోర్టు పేర్కొంది. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయి, ఓటరు జాబితాలు సిద్ధంగా ఉన్నందున, ఇక ఆ దిశగా వేగంగా అడుగులు వేయడం ముఖ్యం.

విప్లవోద్యమంలో కుల కోణం లేవనెత్తిన మారోజు

సాంప్రదాయ బ్రాహ్మణీయ మనువాదుల చేతిలో బందీ కాబడ్డ కమ్యూనిస్ట్ సిద్ధాంతానికి కుల వర్గ చైతన్యాన్ని అందించిన ఇండియన్ మావో మారోజు వీరన్న. ఉస్మానియా యూనివర్సిటీ గడ్డ మీద ఉద్యమ ఓనమాలు నేర్చుకొని కామ్రేడ్ జార్జ్, జంపాలల విప్లవోద్యమ స్ఫూర్తిని నరనరాన నింపుకుని, భారతదేశంలో విప్లవం విజయవంతం కాకపోవడానికి గల కారణాలను విశ్లేషించి, ఆ లక్ష్య సాధన కోసం ముందుడుగు వేస్తూ, పీడిత ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల ప్రతినిధిగా మారుతున్న మారోజు వీరన్నను 1999 మే 16న రాజ్యం బలి తీసుకున్నది.

భారతదేశంలో భూమి, భుక్తి, విముక్తి కోసం వందేళ్ళ క్రితం ప్రారంభమైన కమ్యూనిస్ట్ ఉద్యమం చీలికలు పేలికలై, ఎగుడు దిగుడు ఎత్తుపల్లాల్లోంచి కొనసాగుతూ, అనివార్యంగా అడుగులు బలహీన పడుతున్న నేపథ్యంలో 'రివిజనిజంతో తెగదెంపులు చేసుకున్న విప్లవోద్యమం బ్రాహ్మణిజంతో తెగదెంపులు చేసుకోలేకపోయింది' అనే ఒక చారిత్రక సాక్ష్యాన్ని మారోజు వీరన్న ముందుకు తెచ్చాడు. ఈ సైద్ధాంతిక చర్చ భారత విప్లవోద్యమంలో ఒక నూతన ఒరవడిని సృష్టించింది.

ప్రపంచంలో పీడిత ప్రజల విముక్తి ఉద్యమాలు మొత్తం ఆయా దేశాల నిర్దిష్ట ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక భౌగోళిక పరిస్థితుల్ని ఆధారం చేసుకొని ముందుకు వెళ్ళాయి. ఈ మార్గంలో లక్ష్యాన్ని చేరుకున్న అనేక దేశాల చారిత్రక అనుభవాలు మన కళ్ళ ముందు ఉన్నప్పటికీ ఆ అనుభవాలను గుణపాఠాలుగా తీసుకొని ముందుకు పోవడంలో భారత కమ్యూనిస్ట్ ఉద్యమం విఫలం కావడానికి ప్రధాన కారణం ఆ ఉద్యమం అగ్రకుల బ్రాహ్మణీయ సామాజిక వర్గాల కనుసన్నల్లో కొనసాగడమే అని వీరన్న ప్రకటించాడు. ఈ దేశంలో కొనసాగిన చారిత్రక సామాజిక ఉద్యమాలని ఈ దేశ నిర్దిష్ట సమస్యలకి అన్వయించడంలో, ఆ ఉద్యమాలని ప్రగతిశీల దృక్పథంతో పరిశీలించడంలో, వాటిని కమ్యూనిస్ట్ ఉద్యమాలకు స్నేహపూరిత ఉద్యమాలుగా నిలబెట్టడంలో విఫలం కావటానికి ఆనాటి నాయకుల స్వీయ మానసిక ఆధిపత్య సామాజిక దృక్పథం ఒక అడ్డుగోడై నిలిచింది. ఈ సమస్యను వీరన్న తన సైద్ధాంతిక విశ్లేషణతో ప్రజల ముందుకు తీసుకెళ్ళారు. నిర్దిష్ట పరిస్థితుల్ని విశ్లేషించి తదనుగుణమైన కార్యాచరణను రూపొందించడమే కమ్యూనిస్ట్ ఉద్యమ సూత్రమని మహనీయులు కార్ల్ మార్క్స్, లెనిన్ లాంటి వారు సూత్రీకరించినప్పటికీ వాటిని ఇండియాలో నిర్దిష్టంగా అధ్యయనం చేయడంలో, అనుసరించడంలో విఫలం కావడం మూలాన భారతదేశంలో విప్లవం వైపు అడుగులు వేయలేదని కామ్రేడ్ మారోజు వీరన్న ఆవేదన చెందాడు.



వర్గాన్ని విస్మరించిన కుల పోరాటం, కులాన్ని విస్మరించిన వర్గపోరాటం భారతదేశంలో శ్రామిక రాజ్యాన్ని నిర్మించలేవని చెప్తూ, ఇండియాలో విప్లవం ముందుకు పోవాలి అంటే 'కుల వర్గ జమిలి పోరాటలే ఏకైక మార్గం' అన్న సత్యాన్ని ముందుకు తెచ్చి నిలబెట్టిన దార్శనికుడు వీరన్న.

ఆధిపత్య కుల వ్యవస్థ తన రక్షణ కోసం ప్రజలను, ముఖ్యంగా శ్రామిక వర్గాలను, ఐక్యం కానీయ కుండా కులం పేరుతో విడదీసి విప్లవోద్యమానికి ఆటంకంగా కొనసాగుతున్న పరిస్థితులు ఆనాడు ఉండేవి. ఈ నేపథ్యంలో కుల నిర్మూలన కోసం భారతదేశ గడ్డపై కొనసాగిన ఉద్యమాలను కనీసం ప్రజాస్వామిక ఆకాంక్షల ఉద్యమాలుగానైనా చూడడానికి నిరాకరించిన ఆధిపత్య కమ్యూనిస్టుల చరిత్రను బట్టబయలు చేశాడు వీరన్న. భారతదేశ సామాజిక ఉద్యమకారులైన సాహు మహరాజ్, పెరియార్, చార్వాకులు, బుద్ధుడు, అంబేడ్కర్, జ్యోతిరావుఫూలే లాంటి వాళ్ళ ఉద్యమాలను, అనుభవాలను, సైద్ధాంతిక స్ఫూర్తిని అధ్యయనం చేసి కమ్యూనిస్ట్ ఉద్యమంలో భాగంగా చేసుకోవడం ద్వారా మాత్రమే ఈ దేశంలో సంపూర్ణ విప్లవోద్యమం కొనసాగి విజయం వైపు అడుగులు వేస్తామన్న సత్యాన్ని కామ్రేడ్ మారోజు ప్రజల ముందు ఉంచాడు.

అప్పటివరకు కమ్యూనిస్ట్ నేతలు కులాన్ని కేవలం సామాజిక సమస్యగా మాత్రమే చూశారు కానీ అది సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలను ప్రభావితం చేస్తుంది. కులం భారతీయ సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చేసింది. ఇది ఒక పథకం ప్రకారం జరిగింది. దీని వెనుక బ్రాహ్మణీయ మనువాద తాత్విక దృక్పథం దాగి ఉన్నది అని అంబేడ్కర్ చెప్పాడు. కులం శ్రామిక వర్గాన్ని విచ్ఛిన్నం చేసి వాళ్ళ మధ్యన కనీసం కంచం పొత్తు మంచం పొత్తు లేకుండా చేసింది. అందుకే ఇది కేవలం శ్రమ విభజన కాదు శ్రామికుల విభజన అని అంబేడ్కర్ అంటాడు. దడి కట్టుకున్న కులమే ఇండియాలో వర్గ రూపంలో మనకు బహిరంగంగా కనపడుతున్నది. దీనిని నిర్మూలించకుండా వర్గాన్ని ఐక్యం చేయలేరు. వర్గాన్ని విస్మరించిన కుల పోరాటం, కులాన్ని విస్మరించిన వర్గపోరాటం భారత దేశంలో శ్రామిక రాజ్యాన్ని నిర్మించలేవని చెప్తూ, ఇండియాలో విప్లవం ముందుకు పోవాలి అంటే 'కుల వర్గ జమిలి పోరాటలే ఏకైక మార్గం' అన్న సత్యాన్ని ముందుకు తెచ్చి నిలబెట్టిన దార్శనికుడు వీరన్న. మారోజు వీరన్న ముందుకు తీసుకొచ్చిన 'ఇండియాలో ఏం చేయాలి' అనే చారిత్రక గ్రంథం భారత విప్లవోద్యమానికి ఒక దిక్సూచి లాంటిది. వెనుకపట్టుపట్టిన ఇండియన్ కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని నిలబెట్టడంలో, ముందుకు తీసుకపోవడంలో నిజమైన, నిర్దిష్ట చారిత్రక విశ్లేషణ ఈ సైద్ధాంతిక గ్రంథం.

మారోజు వీరన్న ముందుకు తెచ్చిన సైద్ధాంతిక చర్చను శాస్త్రీయంగా పరిశీలించలేకపోయిన వాళ్ళు కొంతమంది కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని కులంలోకి దిగజార్చిన సిద్ధాంతం అని, మరికొంత మంది కులాల జల్లెడలో కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని ఒడపోస్తున్న సిద్ధాంతం అని తప్పుడు విమర్శలు చేస్తూ వచ్చారు. దేశ చారిత్రక సామాజిక ఉద్యమ అనుభవాలను పరిశీలించి భవిష్యత్ విప్లవోద్యమానికి అందించడంలో హ్రస్వ దృష్టిని కొనసాగించారు.

ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలవుతున్నా నేటికీ రోజు రోజుకీ పేదరికం, ఆకలి చావులు, రైతాంగ ఆత్మహత్యలు, దళితులపైన, మైనార్టీలపైన, స్త్రీలపైన దాడులు పెరుగుతూనే ఉన్నాయి. భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తిలోదకాలిస్తూ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలపై దాడులు కొనసాగిస్తూ నేడు పాలకులు అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తున్నారు. భారత పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థ దళారీ, బూర్జువా, భూస్వామ్య, బ్రాహ్మణీయ, అగ్రకుల ఆధిపత్య, సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో దేశంలో నిజమైన దేశభక్తి గల యువత ఉద్యమాలను నిర్మాణం చేయవల్సిన అవసరం ఉన్నదని మారోజు వీరన్న చాటి చెప్పాడు.

నేడు బ్రాహ్మణీయ, మనువాద పాలక వర్గాలు రెండు కూటములుగా ఏర్పడి మెజారిటీ ప్రజల ఆర్థిక సామాజిక రాజకీయ ఆకాంక్షలను పక్కదారి పట్టిస్తున్నాయి. లౌకిక విలువలు, ఉన్మాద మత ధోరణులపై గొంతుచించుకుంటూ, మేమే ప్రత్యామ్నాయం అని చెప్పుకునే ఇండియా కూటమి కూడా కులవ్యవస్థ నిర్మూలన గురించి ఎక్కడా ప్రస్తావించదు. కుల నిర్మూలన లక్ష్యం లేకుండా మతాన్ని, అది సృష్టించిన అప్రజాస్వామిక ధోరణుల్ని నిర్మూలించలేం. కేవలం ప్రజల భావోద్వేగాలను ఓట్ల రూపంలో మార్చుకొని అధికారంలోకి రావాలనే దురుద్దేశం తప్ప, లౌకిక ప్రజాతంత్ర విలువలను కాపాడగలిగే నిజాయితీని ఈ కూటముల దగ్గర చూడలేం. దీనికి మారోజు వీరన్న అందించిన 'మేమెంత మందిమో మాకంత వాటా' అన్న సూత్రమే నిజమైన ప్రజా ప్రత్యామ్నాయం.

• యం. సుగుణాకర్
అడ్వకేట్, ఖమ్మం

(నేడు మారోజు వీరన్న 25వ వర్ధంతి)

వంద అదనమా? వంద పతనమా?


దిగ్భ్రాంతి చిన్నమాట. సర్వ జ్ఞానేంద్రియాలూ స్తంభించిపోయి, మనసుకు చీకట్లు కమ్మి, అవాక్కై ఉనికి ఉనికే కొయ్యబారిపోయిన అచేతనావస్థ. ఇన్ని రోజులు వింటున్నదేమిటి? వారణాసి నగరంలో పవిత్ర గంగానది మధ్యలో, ఆ పెద్దమనిషి ఇప్పుడు అంటున్నది ఏమిటి? 'మహాశ్చర్యంబు చింతింపగన్'.

"నేనెప్పుడన్నాను? చొరబాటుదారులని నేను వాళ్లను అనలేదే? అధికసంతానులంటే ముస్లిములని ఎవరు చెప్పారు? ఎందుకు వాళ్ల గురించి అన్యాయంగా ఆలోచిస్తారు? నేను పేదవాళ్లను దృష్టిలో పెట్టుకుని అన్నాను. హిందూ ముస్లిం అన్న తేడాలను నేను తీసుకువస్తే, నేనసలు ప్రజాజీవితానికి పనికేరాను' అన్నారు నరేంద్ర మోదీ. ముస్లిములతో ఇరుగుపొరుగు జీవితం గురించి, ఈద్ వేళల్లో తమ ఇంటికి కానుకగా వచ్చే భోజనాల గురించి, మొహర్రం ఊరేగింపులో తాను పాల్గొనడం గురించి మోదీ ఎంతో తన్మయంతో చెప్పారు. తాను కఠినుడిని కానని, తనలోపల ఒక తడిహృదయం ఉన్నదని, తనను ఇంతవాడిని చేసింది జనమేనని, తనలో ఏవైనా లోపాలుంటే సరిచేసుకుంటానని ఆయన మనసు విప్పిమాట్లాడారు. తనకూ ముస్లిములకూ మధ్య ప్రతిపక్షాలు అపార్థాలను కల్పించాయని చెబుతున్నప్పుడు ఆయన గొంతు పూడుకుపోయింది.

కాశీలో నామినేషన్ వేళ, సాధారణ ఎన్నికల అయిదో దశ పోలింగ్‌కు పూర్వరంగంలో ఈ అపరిచితుడి ఆవిష్కరణ జరిగింది. రెండో దశ పోలింగ్ తరువాత మారిన స్వరానికి, ఇప్పుడు నాలుగోదశ తరువాత మారుతున్న స్వరానికి తేడాలు గమనించిన వారికి, అందుకు కారణాలు కూడా ఊహించడం కష్టం కాకపోవచ్చు. ఇంకా పోలింగ్ జరగవలసి ఉన్న 163 లోక్‌సభ నియోజకవర్గాలలో మునుపటి మంగళసూత్రాలూ, ముస్లిం రిజర్వేషన్లూ పెద్ద అవసరం లేకపోవచ్చు.

ఇంతకూ దశల వారీగా ఎన్నికల ప్రచారాంశాలను, శైలిని మార్చుకోవడం ముందే రూపొందించుకున్న ప్రణాళికా బద్ధ వ్యూహంలో భాగమా? లేక, ఈ కొత్త రాజకీయ సంవాదాలు, గడచిన దశల పోలింగ్ సరళుల ఆధారంగా తీసుకుంటున్న ఆపద్ధర్మ దిద్దుబాట్లా?

తాను సొంతంగా 303, ఎన్‌డీఏ కూటమి మిత్రులతో కలిసి 353 గెలుచుకున్న భారతీయ జనతాపార్టీ, ఈసారి 370, 400 అన్న లక్ష్యాన్ని ప్రకటించుకుని రంగంలోకి దిగింది. ఆ పార్టీ ధీమాను, ఎదుటి పక్షాన్ని బెదరగొట్టాలనే ధోరణిని ఆ సంఖ్యలు వ్యక్తం చేస్తూ వచ్చాయి. మొదటి రెండు దశల దాకా, ఆ నినాదానికి ప్రతినినాదమే లేదు. మునుపటి కంటె మెరుగైన ప్రచారశక్తితో ప్రయత్నించడం తప్ప ఇండియా కూటమి ప్రారంభదశలో దూకుడు ప్రదర్శించింది లేదు. ముస్లిం వ్యతిరేక ప్రచారాంశాలను సాక్షాత్తూ ప్రధానమంత్రి ధాటిగా మాట్లాడడం మొదలుపెట్టిన తరువాత, ఇండియా కూటమి ఆలోచనలో పడింది. ప్రతికూలపవనాలు వీస్తున్నాయని తెలిసి, తెగింపుతో సాక్షాత్తూ ప్రధానమంత్రి ముస్లిం వ్యతిరేక ప్రచారానికి ఒడిగట్టారని భావించి, సమాధానమివ్వడం మొదలుపెట్టింది. మోదీకి ప్రతికూలత పెరిగిందన్న అభిప్రాయాన్ని, అంకెలలోకి అన్వయించసాగింది. బీజేపీ కూటమికి 400 స్థానాలు అసాధ్యం అన్న మాటతో మొదలై, క్రమంగా, సాధారణ మెజారిటీకే ఆమడ దూరంలో ఆ పార్టీ ఆగిపోతుందన్న దాకా ఇండియా కూటమి నేతలు మాట్లాడారు. అందుకు వివరణగా, ఉత్తరాదిలో అంతా తరుగేనని, దక్షిణాదిలో వస్తుందనుకున్న పెరుగుదల రాదని ఒక వాదన కూడా ప్రచారంలో పెట్టారు. పోయిన ఎన్నికలలో అత్యధిక స్థానాలు గెలిచిన రాష్ట్రాలన్నిటిలో ఈసారి గణనీయమైన కోత తప్పదని చెబుతూ వచ్చారు.



చివరకు వాళ్ల 400, వీళ్ల 220 రెండూ మానసిక యుద్ధతంత్రంలో భాగమే కావచ్చు. అదీ ఇదీ కూడా అసాధ్యమైన సంఖ్యనే కావచ్చు. ఇంకా 163 స్థానాల పోలింగ్ ఉన్న మిగిలిన దశలను మనసులో పెట్టుకుని, ఈ ఎత్తుగడలు సాగుతూ ఉండవచ్చు. కానీ, ఒకరిలో పెరుగుతున్న అధైర్యం, మరొకరిలో కనిపిస్తున్న ఉత్సాహం ఎందువల్ల అన్న సందేహం మిగిలే ఉంటుంది. తనకు ఇష్టమైన ఊహలో ఉండడానికి ఓటరుకు ఇరవైరోజుల అవకాశం ఉంది. బరిలో ఉన్నవారి సంగతి వేరు, అధికారం చేజిక్కుతుందని కొందరి ఆశ. చేజారుతుందని కొందరి భయం.

పోలింగ్ సరళి సమాచారం ప్రతిపార్టీకి సొంత యంత్రాంగం ద్వారా అందుతుంది. ప్రభుత్వ యంత్రాంగం కూడా అందుబాటులో ఉండే పార్టీలకు మరింత లోతైన సమాచారం అందే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు జరిగిన పోలింగ్‌పై బీజేపీకి అందిన కూపీలేమిటో తెలియదు. ఆ పార్టీ సరళిని బట్టి ఊహించవలసిందే. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేత ఎటువంటి మాటలైనా మాట్లాడించడం, అసత్యాలనిపించే ప్రకటనలు కూడా చేయించడం, గద్గద స్వరంతో భావోద్వేగాలను కూడా ప్రదర్శింపజేయడం చూస్తుంటే, లక్ష్యాన్ని సాధించలేకపోవడం గురించిన నిస్పృహ భావం బీజేపీ ప్రచారనిపుణులలో కలిగిందా, ఆ ఆత్రుత, ఉత్కంఠ నుంచే ఆపద్ధర్మ నిర్ణయాలు తీసుకుంటున్నారా? అన్న సందేహాలు కలుగుతాయి.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఇప్పుడు లక్ష్యాన్ని 272కు దించుకోవాలా? అన్న అంశం మీద, నాలుగో దశ పోలింగ్ ముగిసిన రోజు రాత్రి రాజ్‌దీప్ సర్దేశాయి ఇండియాటుడే టీవీలో చర్చ నిర్వహించారు. 2019 ఎగ్జిట్ పోల్స్‌లో చాలా సమీపస్థాయిలో ఫలితాలను ఊహించగలిగిన యాక్సిస్ మై ఇండియా సారథి ప్రదీప్ గుప్తా, అనేక రాజకీయ పార్టీలకు వ్యూహనిపుణుడిగా పనిచేసిన ప్రశాంత్ కిశోర్, ఎన్నికల విశ్లేషకుడు, సామాజిక శాస్త్రవేత్త యోగేంద్రయాదవ్ పాల్గొన్న ఈ చర్చ మీడియాలో మరింత విస్తృత సంవాదాలకు కారణమైంది. 2019 నాటి పరిస్థితికి, ఇప్పటి పరిస్థితికి పెద్ద తేడా ఏమీ లేదని, బీజేపీ బలం తగ్గిపోతుందని చెప్పేవాళ్లు ఎక్కడ ఏ రాష్ట్రంలో తరుగుదల ఉంటుందో చెప్పాలని ప్రశాంత్ కిశోర్ అభిప్రాయపడ్డారు. 2004 నాటి అనుభవాన్ని చెబుతూ, బీజేపీ పరాజయావకాశాలను చర్చిస్తున్న యోగేంద్రయాదవ్ మాత్రం పరిస్థితిలో మార్పు ఉన్నదని అన్నారు. సీట్లసంఖ్య జోలికి పోను గానీ, గత ఎన్నికలకు ఇప్పటికీ ఓటింగ్ సరళిలో పెద్ద తేడా కనిపించడం లేదని ప్రదీప్ గుప్తా అంటున్నారు. అనేక దశల పోలింగ్‌లో మధ్య దశల నుంచి గాలిమారే అవకాశం లేదని ఖాయంగా చెబుతున్నారు.

ఈ ఇద్దరిలో కనీసం ప్రదీప్ గుప్తా దగ్గర గడచిన మూడు దశల పోలింగ్ ధోరణి గురించిన సమాచారం ఉండవచ్చు. ప్రశాంత్ కిశోర్‌కు ఇప్పుడు సొంతంగా యంత్రాంగం లేదు కానీ, అనుభవం నుంచి, విధాన విశ్లేషణ నుంచి ఫలితాలను ఊహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ఘోరంగా ఓడిపోతారని ఆయన చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలకు ఆరు నుంచి తొమ్మిది లోపు స్థానాలు వస్తాయని చెబుతున్నారు. జాతీయస్థాయిలో యథాతథ స్థితే ఉంటుందని, ఉత్తరాదిలో ఏమైనా కోల్పోయిన పక్షంలో అవి తక్కిన చోట్ల భర్తీ అవుతుందని ఆయన అంటున్నారు. వీరందరూ 2019 కంటె ఇప్పుడు రాష్ట్రాలలో ఎన్నికల సర్దుబాట్లు భిన్నంగా జరిగాయని, కొత్త సమీకరణలు ఏర్పడ్డాయని గుర్తించారా? మోదీ జాతీయస్థాయి ఎన్నికల యుద్ధం చేస్తుంటే, ప్రతిపక్ష కూటమి ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం లెక్కన పోరాడుతోందని గ్రహించారా? ఈ నిపుణుల అనుభవాన్ని గౌరవించవలసిందే కానీ, ఈ చర్చ, ఈ దశలో ఎందుకు అవసరమవుతోంది? అన్నది ప్రశ్న. బీజేపీ 400 లక్ష్యాన్ని చెప్పినప్పుడు, ఈ గుప్తా, కిశోర్ వంటివారు, అదనంగా 100 స్థానాలు ఎక్కడ గెలుస్తారు అని అడిగారా? ఇప్పుడు మాత్రం బీజేపీ 100 స్థానాలు ఎక్కడ కోల్పోతుందో చెప్పమని ఇండియా కూటమిని నిలదీస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి 220 మించి రాకపోవచ్చునని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబితే, మమతాబెనర్జీ ఇండియా కూటమికి 315 స్థానాలు దక్కవచ్చునని అంటున్నారు. తాజాగా ఖర్గే కూడా గొంతు కలిపి, నాలుగుదశల తరువాత ఇండియా కూటమి బలం పెరిగిందని అన్నారు. న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మరొక అడుగు ముందుకు వేసి, బీజేపీకి 200 స్థానాలే నని, ఇండియా కూటమి మమతా బెనర్జీని పక్కకు బెట్టి కాంగ్రెస్‌కు నాయకత్వం అప్పగించాలని మాట్లాడారు. బీజేపీ 400 వాదనకు ఇవి పోటీ వాదనలు మాత్రమేనా? ఆత్మవిశ్వాసాన్ని దట్టించిన ప్రకటనలతో బీజేపీని బెదరగొట్టడానికేనా? కేవలం వ్యూహమే అయితే, వాస్తవం కాకపోతే, మరి ఇండియా కూటమిలో కొంత కొత్త ఉత్సాహం, బీజేపీలో ఉత్కంఠ ఎందుకు కనిపిస్తున్నాయి? ప్రతిపక్ష కూటమి చెబుతున్న గాలిమార్పు వాదనను ఖండించే ఆత్మరక్షణలో ఎందుకు పడిపోయారు? రాహుల్ శివశంకర్ వంటి అస్మదీయ జర్నలిస్టులు పనిగట్టుకుని, 2004కు, 2024కు పోలికే లేదని, మోదీ తిరిగి ఘన విజయం సాధిస్తారని ఎందుకు కొత్తగా విశ్లేషణలు చేయవలసి వస్తోంది?

మతవిభజన ముద్రను ఉన్నట్టుండి తుడిచేసుకోవాలని మోదీ ఎందుకు చూస్తున్నారు? ఇటీవలి ప్రచారం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేత ఎటువంటి మాటలైనా మాట్లాడించడం, అసత్యాలనిపించే ప్రకటనలు కూడా చేయించడం, గద్గద స్వరంతో భావోద్వేగాలను కూడా ప్రదర్శింపజేయడం చూస్తుంటే, లక్ష్యాన్ని సాధించలేకపోవడం గురించిన నిస్పృహ భావం బీజేపీ ప్రచారనిపుణులలో కలిగిందా, ఆ ఆత్రుత, ఉత్కంఠ నుంచే ఆపద్ధర్మ నిర్ణయాలు తీసుకుంటున్నారా? అన్న సందేహాలు కలుగుతాయి.

మోతాదు మించిందని, జనం హర్షించడం లేదని సంకేతం అందిందా? సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ చివరి మూడు దశలకు ఎందుకు అవసరమైంది? జూన్ ఒకటో తేదీ లోగా, మోదీ మరిన్ని అవతారాలు ప్రదర్శించబోతారా? సామాజిక మాధ్యమాలలో బీజేపీ వర్గీయులు ఎందుకు గోరువెచ్చగా మారిపోయారు? విమర్శక వీడియోలకు యూట్యూబ్‌లలో కోట్లాది వీక్షణలు ఎందుకు లభిస్తున్నాయి? న్యాయవ్యవస్థలో కొంత ధైర్యం పెరిగిందని వినిపిస్తున్న వ్యాఖ్యలను ఎట్లా అర్థం చేసుకోవాలి? (కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు నుంచి ప్రత్యేక సదుపాయం లభించిందని బాహాటంగా అమిత్ షా విమర్శించడం దేనికి సూచిక?)

చివరకు వాళ్ల 400, వీళ్ల 220 రెండూ మానసిక యుద్ధ తంత్రంలో భాగమే కావచ్చు. అదీ ఇదీ కూడా అసాధ్యమైన సంఖ్యనే కావచ్చు. ఇంకా 163 స్థానాల పోలింగ్ ఉన్న మిగిలిన దశలను మనసులో పెట్టుకుని, ఈ ఎత్తుగడలు సాగుతూ ఉండవచ్చు. కానీ, ఒకరిలో పెరుగుతున్న అధైర్యం, మరొకరిలో కనిపిస్తున్న ఉత్సాహం ఎందువల్ల అన్న సందేహం మిగిలే ఉంటుంది. తనకు ఇష్టమైన ఊహలో ఉండడానికి ఓటరుకు ఇరవైరోజుల అవకాశం ఉంది. బరిలో ఉన్నవారి సంగతి వేరు, అధికారం చేజిక్కుతుందని కొందరి ఆశ. చేజారుతుందని కొందరి భయం.

రైతుపై మొసలి కన్నీరు!

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే రైతుల విషయంలో ఇంత అన్యాయమా అంటూ మొసలి కన్నీరు మొదలెట్టేశారు కేసీఆర్, హరీష్, కేటీఆర్. గత ప్రభుత్వ హయాంలోనే రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేసి ఉంటే బాగుండేది. వందలమంది రైతుల ఆత్మహత్యలు జరిగేవి కాదు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ళల్లో రెండుసార్లుగా రుణమాఫీ చేపట్టింది. కానీ కుటుంబానికి ఇద్దరు ముగ్గురు రైతులున్నవారిని వదిలిపెట్టడంతో లక్షల మంది రైతులు రుణాలతోనే మిగిలిపోయారు. ఇలాంటి నియమం పెట్టుకున్నప్పుడు పంట రుణాలు కూడా కుటుంబంలో అందరికీ గాక ఒక్కరికే ఇస్తే సరిపోయేది! ఓట్లు కూడా కుటుంబంలో ఒక్కరినే వేయమంటే సరిపోయేది! ఓట్లు అందరివీ కావాలి కానీ రుణమాఫీ మాత్రం అందరికీ చేయరా?

గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు తమ టార్గెట్‌ల కోసం రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పెట్టుబడి రుణం కోసం వెళ్తే అప్పు ఇవ్వకపోగా పాత అప్పు కట్టమని వేధిస్తున్నారు. అప్పు కడితేనే మీకు రైతుబంధు అంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. రైతులు ఋణం రెన్యువల్ చేసిన అమౌంట్‌ను వారే అప్పు కింద ఖాతాలో జమ చేసుకొని రైతులను ఒట్టి చేతులతో పంపుతున్నారు. పైగా నోటీసులు జారీ చేస్తున్నారు. పంటకు గిట్టుబాటు ధర కలిపిస్తే బ్యాంకుల్లో ఏ ఒక్క రైతూ అప్పు చేయడు. ఒకవేళ చేసినా తిరిగి కట్టే ఆర్థిక స్తోమత వస్తుంది. కానీ ప్రభుత్వాలు గిట్టుబాటు ధర, వడ్డీ లేని రుణాలు ఇవ్వలేకపోతున్నాయి. దేశంలో తయారయ్యే ప్రతి వస్తువుకు ఉత్పత్తి చేసిన వాడే ధర నిర్ణయించుకొని గ్రామ స్థాయి నుంచి ప్రపంచ మార్కెట్ స్థాయి వరకు అత్యధిక లాభాలు పొందుతుంటే, రైతుకు మాత్రం పండించిన మూలధన సరుకుకు సొంతంగా ధరను నిర్ణయించుకునే అవకాశం లేదు. ప్రభుత్వాలు రైతులకు చేసే వాగ్దానాల్లో స్పష్టత ఉండాలి. రుణమాఫీతో పాటు, వడ్డీలను కూడా మాఫీ చేయాలి. అప్పుడే రైతు సంక్షేమంగా పని చేసినట్టు. లేకపోతే రైతు తన కుటుంబానికి సరిపోయే పంట మాత్రమే వేసుకొని పని చేసుకుంటే అప్పు చేయాల్సిన, బ్యాంకులు వేసే రెండింతల వడ్డీని కట్టాల్సిన అవసరమే రాదు. రైతు అలా చేస్తే ప్రజల ఆకలిని తీర్చేది ఎవరో ప్రభుత్వాలు ఆలోచించుకోవాలి.

– మండ్ల రవి (ఉస్మానియా యూనివర్సిటీ)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఆదివాసీలది అరణ్యరోదనేనా?

ఆదివాసీలు నివసించే దండకారణ్యంలో, ప్రభుత్వ సాయుధ బలగాలు ఈ ఏప్రిల్ 16న జరిపిన కాల్పుల్లో, 29 మంది ఆదివాసీ స్త్రీ పురుషులు చనిపోయినట్టు, పత్రికల్లో వార్త! ఆ కాల్పులకు గురైన వారిలో, 27 మంది మొహాల ఫోటోల్ని పత్రికల్లో చూపించారు! దాదాపు అందరి మొహాలూ రక్తాలతో తడిసి వున్నాయి!

తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంతవరకూ, ఎన్కౌంటర్లు అనేవి, 1969 నించీ ఇప్పటివరకూ దాదాపు '3 వేలకు పైగా' జరిగినట్టు ఒక లెక్క. ఆ ఎన్కౌంటర్లన్నీ, పోలీసులూ–నక్సలైట్లూ నిజంగా రెండు పక్షాలుగా ఎదురుపడడం వల్ల జరిగినవి కావు అనీ; నిజంగా జరిగిన ఎన్కౌంటర్లు అతి తక్కువ అనీ; హక్కుల సంఘాల నిర్ధారణ! ఇలాంటి వేలాది ఎన్కౌంటర్లలో, ఏప్రిల్ 16న జరిగినది కొత్తదీ కాదు, చివరిదీ కాదు! నిన్న గాక మొన్న కూడా ఎన్కౌంటర్లు జరిగాయి. మే 11న 12 మందినీ, 13న 11 మందినీ కాల్చి చంపారు. కాకపోతే, కొత్త విషయం ఏమిటంటే, దాదాపు 30, 40 ఏళ్ళ కిందటి వరకూ ఎన్కౌంటర్లు జరిగితే, ఇతర ప్రజల్లో కొన్ని చోట్ల అయినా నిరసన ప్రదర్శనలు జరిగేవి. ప్రస్తుతం అవి కనబడడం లేదు! మైదాన ప్రాంతాల ప్రజల్లో కనీస స్పందన కూడా లేకపోవడం, అమానుషంగా వుంది!

ఎవరైనా ఇలా అడగవచ్చు: "గిరిజనుల ప్రాణాలూ, మావోయిస్టుల ప్రాణాలూ మాత్రమేనా విలువైనవి? పోలీసులు ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలతో, ఉద్యోగ ధర్మం పాటించడం గాక ఏం చెయ్యగలరు? అటువంటి పోలీసుల్ని మావోయిస్టులు చంపడం అయితే న్యాయమా?"– అని ప్రశ్నిస్తే, దానికి జవాబు ఏమిటంటే, మావోయిస్టులు, శ్రమ దోపిడీ ప్రభుత్వాన్ని శత్రువుగా చూస్తారు గానీ, పోలీసుల్ని శత్రువులుగా చూడరు! పోలీసులు కూడా పేద శ్రామిక కుటుంబాల వారేననీ, వారికి పెద్ద చదువులూ, పెద్ద పెద్ద ఉద్యోగాలూ లేక, ప్రభుత్వం చెప్పినట్టు, విప్లవకారుల్ని అణిచివేసే ఉద్యోగాల్లోకి చేరారనీ, వారు శత్రువులు కాదనీ, మావోయిస్టులకు తెలుసు. అడవుల్లో బ్రతికే ఆదివాసీల్నీ, వారిని పోరాటాల్లోకి సమీకరించే మావోయిస్టుల్నీ చంపెయ్యమని ప్రభుత్వం ఆదేశిస్తే, విప్లవకారులు ఆత్మరక్షణ కోసం పోలీసుల్ని ఎదుర్కోక తప్పదు కదా?

గిరిజనులు అడవుల్లో నిరుపేదలుగా జీవించే శ్రామికులే. వాళ్ళు నివసించే అడవుల్ని ప్రభుత్వం పెట్టుబడిదారీ కంపెనీల పెత్తందార్లకి, గనుల తవ్వకాలకూ; అనేక రకాల పరిశ్రమల్ని స్థాపించడానికీ, అప్పజెప్పేస్తోంది! మావోయిస్టులు అడవుల బాట ఎందుకు పట్టారు? గిరిజనులను ఏకం చేసి, వారికి శ్రామిక వర్గ చైతన్యాన్ని కలగజేసి, వారి తరఫున పోరాడాలనే! అంతేగానీ, మావోయిస్టులు, తమ పొట్టకూటి కోసం ఆ మార్గాన్ని ఎంచుకున్నవారు కాదు. వారు ఒక ఆశయం కోసం వచ్చినవారు! వారి ఆలోచనల్లోనూ, చర్యల్లోనూ, ఎత్తుగడల్లోనూ, పొరపాట్లున్నా, తప్పులున్నా, గిరిజనుల కోసం పోరాడడమనేదే వారి ప్రధాన ఆశయం! అది ఎటువంటి ఆశయమో అర్థమైతే పోలీసులు, ఆ ఆదర్శవాదుల మీదా, నిర్భాగ్యులైన గిరిజనుల మీదా, కాల్పులు జరిపే ఉద్యోగాల్లో ఉండగలరా?

మావోయిస్టులు ఒక విషయమై స్వయం పరిశీలన చేసుకోవాలి. 'మైదాన ప్రాంతాలలోని శ్రామిక ప్రజలు, ఆదివాసీల మరణాల పట్లా, వారికి నాయకత్వం వహిస్తున్న వారి మరణాల పట్లా, ఎందుకు స్పందించడం లేదు?'

మావోయిస్టులు, ఒక విషయమై స్వయం పరిశీలన చేసుకోవాలి. 'మైదాన ప్రాంతాలలోని శ్రామిక ప్రజలు, ఆదివాసీల మరణాల పట్లా, వారికి నాయకత్వం వహిస్తున్న వారి మరణాల పట్లా, ఎందుకు స్పందించడం లేదు'– అని గ్రహిస్తున్నారా? ఆత్మ విమర్శగా ఏదో చెప్పుకుంటే కాదు! ఉదాహరణకి, ఉద్యమాలలోకి గతంలో వచ్చినట్టు యువకులు రాకపోవడానికి కారణాన్ని, ప్రపంచీకరణ కారణంగా, హైటెక్ ఉద్యోగాలకీ, పెద్ద జీతాలకీ, యువతీ యువకులు ఎగబడుతున్నారు– అన్నదేనా కారణం? మరి గతంలో, డాక్టర్లూ, ఇంజనీర్లూ, లాయర్లూ, టీచర్లూ వంటి వారు, విప్లవోద్యమాలలోకి చేరేవారు కాదా? గతంలో, ఎంతోమంది ప్రజలు, కార్యకర్తలుగానో, సానుభూతి పరులుగానో వుండేవారు కాదా? 'ఇప్పుడు ప్రభుత్వ నిర్బంధానికి భయపడి మైదాన ప్రాంతాల ప్రజలు నిరసనలు తెలపలేక పోతున్నారు'– అనడం సరైనదా? 'నిర్బంధ విధానాలు' అనేవి చరిత్రలో 'ప్రభుత్వాలు' అనేవి ఏర్పడినప్పటినించీ జరుగుతూనే వున్నాయి. 'రాజ్యాంగ యంత్రం అనేది, పాలకవర్గం, పాలిత వర్గాన్ని అణచడానికి ఏర్పడ్డ పనిముట్టు'– అని మార్క్సిజం చెబుతుంది! ఆ 'దోపిడీ రాజ్యాంగ యంత్రాంగం' ఇరవై నాలుగు గంటలూ, విరామం లేకుండా పాలక వర్గాలకు సేవలు చేస్తుంటుంది. ఎన్నికలు జరగనీ, దేశాధినేతలు మరణించనీ, వర్షాలు కురవనీ, ఎండలు మండనీ, మంచుముద్దలు పడనీ, నిర్బంధ యంత్రాంగం నిరంతరం పనిచేస్తూనే వుంటుంది.

'ఉద్యమకారుల ఆచూకీకీ, వారిని దెబ్బకొట్టడానికీ, అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నాయి ప్రభుత్వాలు. అందుకే ప్రజలు నిరసనలు చూపలేరు'– అనేది ఒక వాదన! 'వియత్నాం విప్లవ చరిత్ర'ని చూస్తే, అప్పటికే వున్న అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి, బాంబుల వర్షం కురిపించిన అమెరికాని వియత్నాం ఓడగొట్టలేదా?



అసలు సమస్య ఎక్కడుందీ – అంటే, 'విప్లవం అంటే కొద్ది మంది చైతన్యవంతులైన వారే, ప్రజల తరఫున చేసే పోరాటం'– అని యాంత్రికంగా అనుకోవడంలోనే వుంది. శ్రామిక ప్రజల్లోనే అనేక రకాల విభాగాల వారు వున్నారనీ, వారిని ప్రజా సంఘాల లోనో, వర్గ సంఘాల లోనో ఏకం చెయ్యాలనీ, వారి చొరవని పెంచాలేగానీ, ఆ సంఘాలను పార్టీ జేబు సంస్థలుగా నడపకూడదు– అనే, గ్రహింపు విప్లవకారుల్లో మొదటినించీ తక్కువగా ఉన్నట్టు కనపడుతుంది. 'దళ చర్యలే సాయుధ పోరాటం' అనే భావన కూడా వుంది. కమ్యూనిస్టు సిద్ధాంత అవగాహన కనీసంగా లేని యువకుల్ని కూడా 'మిలిటెన్సీ' పేరుతో, వారి వ్యక్తిగత పరాక్రమాన్నే గీటురాయిగా పార్టీలోకి తీసుకోవడాలూ, అలా చేరిన వాళ్ళలో కొందరు, పార్టీ నేతల్నే నిద్రల్లో హతమార్చే ద్రోహులుగా తయారై అదృశ్యం కావడాలూ కనపడతాయి. విప్లవ సిద్ధాంతం నేర్చుకోవడానికి మార్క్సు మూల గ్రంథం అయిన, 'పెట్టుబడి'లో సారాంశాన్ని గ్రహించి నడవడం ప్రధానం అనే దాన్ని ఎంత గ్రహించారు?

ఏ ప్రభుత్వాన్నైతే సాయుధంగా కూలదోస్తామని ప్రకటించుకున్నారో, ఆ ప్రభుత్వంతోనే చర్చలు పనికి రావు అనీ, తోటి విప్లవ గ్రూపులతో ఎంత వరకూ ఏకం కాగలరో అంతవరకూ చర్చలు జరపాలి– అనీ అంటే, 'నీకు చరిత్ర పరిజ్ఞానం లేదు' అంటారు. ఎన్నో అవగాహనా లోపాల్ని సరిచేసుకుని, సరికొత్తగా మళ్ళీ మొదటి నించీ ప్రారంభించ నక్కర లేదా? శ్రామిక ప్రజల్నీ కూడగట్టే పని గురించి ఉద్యమకారులకు దారి చూపే ఎంగెల్సు చెప్పిన మాటలు గుర్తు చేసుకుందాం.

ఎంగెల్స్: "వర్గ చైతన్యం లేని శ్రామిక జనాలకు, అతి కొద్ది మంది చైతన్యవంతులైనవారు మాత్రమే నాయకత్వం వహించి చేసే ఆకస్మిక దాడులూ; విప్లవ పోరాటాలూ; చేసే కాలం గతించింది. సామాజిక వ్యవస్థను సంపూర్ణంగా పరివర్తన చెందించడం – అనేదే ప్రశ్న అయినప్పుడు, శ్రామిక జనాలు తమంతట తాము వర్గ పోరాటంలో వుండి తీరాలి! సమస్య ఏదో, తాము దేని కోసం పోరాడుతున్నారో, అప్పటికే గ్రహించి వుండి తీరాలి! ఏమి చేయాలో, జనాలు అర్థం చేసుకోవాలీ అంటే, సుదీర్ఘమైన, నిరంతరమైన పని అవసరం."


ఇలాంటి కృషి ఇప్పటికైనా జరగకపోతే, ప్రజలు నిస్పృహలో కూరుకుపోతారు. ఆదివాసీలదే కాదు, ప్రజలందరిదీ అరణ్యరోదనగానే మిగిలిపోతుంది.

■ రంగనాయకమ్మ



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.8 కనిష్ఠం 24.4

పోలింగ్ రోజున.. తగ్గిన పొల్యూషన్ 6
కుక్క అరిచిందని భార్యాభర్తలపై దాడి.. 8
నత్తనడకన ఓఆర్ఆర్ ఫేజ్-2 పనులు
రియల్టర్లతో కుమ్మక్కు ● అక్రమ లేఅవుట్లలో పైపులైన్లు 7



ఖైరతాబాద్ వంతెన వద్ద యూనిపోల్

- నిషేధం ఉన్నా.. ఇప్పటికీ తొలగించని భారీ హోర్డింగులు
- కోర్టు కేసుల వల్లే అంటోన్న జీహెచ్ఎంసీ
- ముంబై దుర్ఘటన నేపథ్యంలో చర్చనీయాంశం
- నగరంలోనూ గతంలో పలు ఘటనలు
- నిషేధం అనంతరం నిర్వహణ పట్టని ఏజెన్సీలు

ముంబైలోని గట్కోపర్‌లో ఓ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న 100 అడుగుల బిల్‌బోర్డు (ప్రకటనల హోర్డింగ్) కూలి 14 మంది మృతి చెందారు. మరో 70మంది గాయపడ్డారు. గంటకు 96 కి.మీల వేగంతో గాలులు వీయడంతో ఈ దుర్ఘటన జరిగింది.

యూనిపోల్స్.. డేంజర్ బెల్స్!

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): ముంబై ఘటన నేపథ్యంలో నగరంలోని యూనిపోల్స్ పరిస్థితి ఏంటి? నిషేధం విధించినా.. ఇప్పటికీ పలుప్రాంతాల్లో ఖాళీగా కనిపిస్తోన్న యూనిపోల్స్ భద్రమేనా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నగరంలోని యూనిపోల్స్ నిర్మాణ స్థిరత్వం చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాల క్రితం జీహెచ్ఎంసీ అనుమతితో కొన్ని, అక్రమంగా అంతకంటే ఎక్కువ యూనిపోల్స్‌ను యాడ్ ఏజెన్సీలు ఏర్పాటు చేశాయి. వాటి నిర్మాణ స్థిరత్వం ఎలా ఉందన్నది ఎప్పటికప్పుడు నిపుణులు ధ్రువీకరించాలి. అవసరమైన మరమ్మతు చర్యలు చేపట్టాలి. యూనిపోల్ దెబ్బతిన్న పక్షంలో తొలగించాలి. 40-50 అడుగుల ఎత్తులో యూనిపోల్స్ ఉండడం.. ఏజెన్సీలు నిర్వహణ పట్టించుకోకపోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలోనే నగరంలో 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో యూనిపోల్స్‌ప్రకటనల బోర్డులను నిషేధిస్తూ ఏప్రిల్ 20, 2020లో జీఓ-68ను ప్రభుత్వం విడుదల చేసింది. నిర్దిత స్థాయి కంటే ఎక్కువ ఎత్తులో ఉన్నవి తొలగించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. కొన్నింటిని తొలగించగా.. పలు ఏజెన్సీలు కోర్టుకు వెళ్లడంతో తొలగింపు ప్రక్రియ నిలిచిపోయింది. నిషేధం అమలులోకి వచ్చిన అనంతరం ప్రకటనల ఏర్పాటుకు అవకాశం లేకపోవడంతో యూనిపోల్స్ నిర్వహణను యాడ్ ఏజెన్సీలు విస్మరించాయి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, హిమాయత్‌నగర్, కోఠి, అమీర్‌పేట, కూకట్‌పల్లి, మియాపూర్, మాదాపూర్, సికింద్రాబాద్, తార్నాక తదితర ప్రాంతాల్లో యూనిపోల్స్, భవనాలపై ప్రకటనల బోర్డులు ఇప్పటికీ ఉన్నాయి. నిర్వహణలేమితో

మిగతా 6వ పేజీలో..

ప్రభుత్వ పరిశీలనలో నూతన పాలసీ..

ప్రకటనల విభాగం ద్వారా జీహెచ్ఎంసీకి రూ.50-60 కోట్ల ఆదాయం వస్తోంది. దీనిని రూ.100 నుంచి రూ.150 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు కొత్త ప్రకటనల పాలసీని ప్రతిపాదించారు. దీనిపై కౌన్సిల్‌లోనూ తీర్మానం చేశారు. 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో యూనిపోల్స్ ప్రకటనల బోర్డుల ఏర్పాటుపై నిషేధం నేపథ్యంలో దానిని పునఃసమీక్షిస్తూ కొత్త విధివిధానాలు రూపొందించారు. పౌరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నూతన పాలసీ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు ప్రకటనల విభాగం ఉన్నతాధికారొకరు తెలిపారు. ఇందులో భాగంగా స్టాటిక్ డిజిటల్ డిస్ ప్లేల ఏర్పాటును ప్రధానంగా ప్రతిపాదించామన్నారు. నగరంలో వాతావరణ పరిస్థితులు, ఎంతవేగంగా గాలులు వీచే అవకాశముంది..? వాటిని తట్టుకునేలా నిర్మాణ స్థిరత్వం ఎలా ఉండాలి..? అన్నది నిపుణుల అభిప్రాయంతో నిర్ణయించాలని ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల్లో కోరామని అధికారి పేర్కొన్నారు. హైదరాబాద్‌తోపాటు నగరంలోని ఇతర కార్పొరేషన్లకు కలిపి ఒకే ప్రకటనల పాలసీ రూపొందించాలని సర్కారు భావిస్తోందని ఆయన చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో ఇన్నాళ్లు ఈ విషయంపై సమావేశాలు జరుగలేదని, ఇప్పుడేమైనా పురోగతి ఉంటుందేమో అని ఆశాభావం వ్యక్తం చేశారు.

గాలిదుమారానికే కుప్పకూలుతున్నాయ్..

ఔటర్‌పై ఆర్భాటంగా విద్యుత్‌స్తంభాల ఏర్పాటు

నాణ్యత ప్రమాణాలపై అనుమానాలు

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగ్‌రోడ్డుపై ముంపు పొంచి ఉంది. గాలి దుమారం వచ్చినా, భారీ వర్షం కురిసినా విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డుగా పడిపోతున్నాయి. వాహనదారులు గమనించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. హెచ్ఎండీఏ-హెచ్‌జీసీఎల్ ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం ఆర్భాటంగా ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాలు ఒక్క గాలివానకే కుప్పకూలుతున్నాయి. ఔటర్ చుట్టూ వంద కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన ఎల్ఈడీ దీపాల నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఔటర్ రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రతి 12 మీటర్లకు స్తంభం చొప్పున 136 కిలోమీటర్ల మార్గంలో 6,340 స్తంభాలు ఏర్పాటు చేసి 13,392 ఎల్ఈడీ బల్బులను అమర్చారు. 37 కిలోమీటర్లలోని సర్వీసు రోడ్లలో కూడా ఎల్ఈడీ బల్బులు ఏర్పాటుచేశారు. ఔటర్ అప్ అండ్ డౌన్ ర్యాంప్‌లు సుమారు 12 కిలోమీటర్ల మేర, పలు జాతీయ, రాష్ట్ర రహదారులు అనుసంధానమైన ప్రాంతాల్లో కూడా 5.5 కిలోమీటర్ల మేర ఎల్ఈడీ బల్బులు అమర్చారు. రెండేళ్ల క్రితం పనులు పూర్తి చేయడంతో ఔటర్ మొత్తంలో ఎల్ఈడీ వెలుగులు అందుబాటులోకి వచ్చాయి. పనులు దక్కించుకున్న సంస్థలు ఏడేళ్ల పాటు విద్యుద్దీపాల నిర్వహణ బాధ్యతను చూడాల్సి ఉంటుంది.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్యాకేజీ-1లో భాగంగా కోకాపేట నుంచి కొల్లూరు, పటాన్‌చెరు, సుల్తాన్‌పూర్ వరకు 34 కిలోమీటర్ల పరిధిలో రూ.23.735 కోట్ల వ్యయంతో

మిగతా 6వ పేజీలో..



పటాన్‌చెరు నుంచి కోకాపేట వైపు వచ్చే మార్గంలో కూలిన స్తంభం (ఫైల్)




వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి హత్య

- రూ.13వేలు తిరిగి ఇవ్వనందుకు ఒకరు..
- నిమ్స్ మేలో మరొకరు..

నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు దారుణ హత్యకు గురయ్యారు. అప్పుగా తీసుకున్న రూ.13వేలు తిరిగి ఇవ్వడం లేదన్న కోపంతో ఖిల్వత్ ప్రాంతంలో ఒకరిని కత్తితో పొడిచి హత్య చేయగా.. యూసుఫ్‌గూడ నిమ్స్‌మే ప్రాంతంలో ఓ మేకప్ ఆర్టిస్టును హతమార్చారు.

వివరాలు 8వ పేజీలో..





ప్రాక్టీస్ చేస్తున్న హెడ్

జోరుగా.. హుషారుగా..

- ఉప్పల్ స్టేడియంలో ఆటగాళ్ల ప్రాక్టీసు


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐపీఎల్‌లో ఆరో మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం ముస్తాబైంది. గురువారం సాయంత్రం 7.30 గంటలకు గుజరాత్ టైటాన్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం ఇరు జట్లు బుధవారం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ముమ్మరంగా సాధన చేశాయి. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఎస్ఆర్‌హెచ్ విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్, యువ క్రికెటర్ నితీశ్ రెడ్డి నెట్స్‌లో, మైదానంలో ఉత్సాహంగా ప్రాక్టీసు చేశారు. వీరే కాకుండా ఇరు జట్లలోని ఇతర క్రికెటర్లు హుషారుగా సాధన చేశారు.

మ్యాచ్‌కు 60 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): గురువారం జరిగే క్రికెట్ మ్యాచ్‌కు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాలకు 60 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకు మెహిదీపట్నం, ఘట్‌కేసర్, ఎన్‌జీఓస్‌కాలనీ, ఇబ్రహీంపట్నం, ల్యాబ్‌క్వార్టర్స్, కోఠి, అఫ్జల్‌గంజ్, దిల్‌సుఖ్‌నగర్, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, ఎల్‌బీనగర్‌తో పాటు మొత్తం 24 ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు కోఠి- 99592 26160, రేతిఫైల్ బస్‌స్టేషన్ -9959 226154 కమ్యూనికేషన్ సెంటర్లను సంప్రదించాలని సూచించారు.

థ్యాంక్స్‌కూ నోచుకోమా..?

- ప్రచార సమయంలో మీరే అంతా అని పొగడ్తలు
- బూత్ ఏజెంట్లకు అందని డబ్బులు.. అభ్యర్థుల తీరుపై ఆగ్రహం



సికింద్రాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): 'మీరే పార్టీకి పట్టుకొమ్మలు.. మీరే మా బలం..' డివిజన్ నేత నుంచి అగ్రనాయకుడి వరకు సందర్భం వచ్చిన ప్రతిసారి కార్యకర్తలనుద్దేశించి చేసే వ్యాఖ్యలు. మీరు లేకుంటే మేం లేము.. పార్టీ కూడా ఉండదన్నంత స్థాయిలో పొగడ్తలు కురిపించే నాయకులు.. అవసరం తీరాక మాత్రం వారిని కన్నెత్తి చూడరు. ప్రస్తుత ఎన్నికల్లోనూ అదే పరిస్థితి కనిపిస్తోంది. నామినేషన్ దాఖలు నుంచి పోలింగ్ రోజు వరకు అన్నా.. తమ్మీ అంటూ పని చేయించుకున్న కొందరు అభ్యర్థులు ఎన్నికలు ముగిశాక కనీసం ధన్యవాదాలు చెప్పలేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు, నాలుగు వారాలు ఇల్లు, కుటుంబం వదిలి

మిగతా 6వ పేజీలో..



ఆన్‌లైన్‌లో క్లాస్‌లు చెప్పి.. పెట్టుబడులు పెట్టించి..

రూ. 1.75లక్షలు కొల్లగొట్టారు..

హైదరాబాద్ సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో 30 రోజుల పాటు క్లాసులు చెప్పి.. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి.. నగరవాసి నుంచి రూ. 1.75లక్షలు కొల్లగొట్టారు సైబర్ నేరగాళ్లు. దాంతో బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.

నగరానికి చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగిని గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ గ్రూపు (ఎఫ్ఐఎస్- ఎఫ్‌టీపీఎల్)లో యాడ్ చేశారు. అందులో గ్రూపు సభ్యులందరికీ స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు, వచ్చే లాభాల గురించి తెలియజేయడంతో పాటు.. లాభాలు పొందిన వ్యక్తుల వివరాలు, పెట్టిన పెట్టుబడి, అందుకు వచ్చిన ప్రతిఫలం నమోదు చేస్తుండేవారు. ఒకరోజు గుర్తుతెలియని వ్యక్తి గ్రూపు లైన్‌లోకి వచ్చి స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే అత్యధిక లాభాలు వస్తాయని నమ్మించారు. శిక్షణ తీసుకున్న తర్వాత, అవగాహన వచ్చాకే పెట్టుబడులు పెట్టాల్సిందిగా సూచించారు. అతనితో పాటు అతని భార్యకు, సోదరికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై ఆన్‌లైన్‌లో క్లాసులు చెప్పారు. ఎఫ్ఐఎస్- ఎఫ్‌టీపీఎల్ ద్వారానే ట్రేడింగ్ చేసి రూ. 1.75లక్షలకు ఐపీఓలను కొనుగోలు చేయించారు. ఆ తర్వాత అధిక మొత్తంలో లాభాలు వచ్చినట్లు చూపించారు. కానీ వాటిని విత్‌డ్రా చేసుకునే ఆప్షన్ తీసేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఖాతాలో ఉన్న డబ్బుకు సమానంగా మరో రూ. 1.75లక్షలు డిపాజిట్ చేస్తేనే విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. దాంతో ఇదేదో మోసపూరితమైన కుట్రలా ఉందని భావించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ శివమారుతి చెప్పారు.

- మైక్రోసాఫ్ట్ సహకారంతో రంగంలోకి దిగిన ఐ4సీ
- రూ. కోట్లు కొల్లగొడుతున్న సైబర్ క్రిమినల్స్‌కు చెక్

వెయ్యికిపైగా స్కైప్ ఐడీలు బ్లాక్

- బెదిరింపు కాల్స్ వస్తే 1930కు కాల్ చేయండి : సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు



హైదరాబాద్ సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సైబర్ క్రిమినల్స్ వినియోగించిన వెయ్యికి పైగా స్కైప్ ఐడీలు, సిమ్‌కార్డులు, మొబైల్ పరికరాలు, బ్యాంకు ఖాతాలను ఇండియన్ సైబర్‌క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) బృందం, మైక్రోసాఫ్ట్ సహకారంతో బ్లాక్ చేసింది. స్కైప్ ద్వారా వీడియో కాల్స్ చేస్తూ బెదిరింపులకు పాల్పడి కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టింది. డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్టులు, నిషేధిత వస్తువులు వంటి పార్సిల్స్ మీ పేరుతో ఇతర దేశాలకు అక్రమంగా వెళ్తూ పట్టుబడ్డాయని బెదిరించే సైబర్ నేరగాళ్ల బారిన పడొద్దని హెచ్చరించింది.

ప్రత్యేక సెటప్‌తో నమ్మిస్తున్న క్రిమినల్స్..

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను, వృద్ధులను, రిటైర్డ్ ఉద్యోగులను, సంపన్నులను టార్గెట్ చేస్తున్న సైబర్ క్రిమినల్స్ వారి డేటాను సేకరించి రాత్రిపూట కాల్స్ చేస్తారు. నిషేధిత మాదక ద్రవ్యాలు, నకిలీ పాస్‌పోర్టులు, ఇతర నిషేధిత వస్తువుల పార్సిల్స్ ఇతర దేశాలకు వెళ్తున్నాయని, వాటిపై అడ్రస్ మీదే ఉందంటూ ఫోన్‌లోనే పూర్తి అడ్రస్‌ను తెలియజేసి షాక్ ఇస్తారు. క్రైమ్ బ్రాంచి ఉన్నతాధికారులు, అధికారులు మీతో స్కైప్‌లో మాట్లాతారని, ఏదైనా చెప్పుకోవాలంటే వారితో చెప్పుకోండి అంటూ బెదిరిస్తారు. స్కైప్ కాల్ యాక్సెప్ట్ చేయండి, లేదా స్కైప్ యాప్ వెంటనే డౌన్‌లోడ్ చేసుకొని లైన్‌లోకి రావాలని హుకుం జారీ చేస్తారు. స్కైప్ కాల్ లిఫ్ట్ చేయగానే అవతలి వైపు వ్యక్తులు నిజంగానే పోలీస్ యూనిఫాంలో కనిపిస్తారు. క్రైమ్ బ్యూరో కార్యాలయం మాదిరిగా ప్రత్యేక స్టూడియోలను సెటప్ చేసి ఇట్టే నమ్మిస్తారు. మిమ్మల్ని అరెస్టు చేయడానికి అరెస్టు వారెంట్ రెడీగా ఉందంటూ.. ఆన్‌లైన్‌లోనే అరెస్టు వారెంట్ కాపీ చూపిస్తారు. అది చూసిన బాధితులు నిజంగానే క్రైమ్ బ్రాంచి పోలీసులు మాట్లాడుతున్నారని, మరింత ఆందోళనకు గురవుతున్నారు. కేసు రాజీ చేసుకోవాలని భావిస్తే చెప్పిన ఖాతాలో డబ్బులు జమ చేయాలని, ఈ విషయం బయటకు చెప్తే మీకే ప్రమాదమని క్రిమినల్స్ హెచ్చరిస్తుండ డంతో అప్పటికే భయాందోళనలో ఉన్న బాధితులు కేసు నుంచి బయటపడటానికే మొగ్గు చూపుతున్నారు. వారు చెప్పిన విధంగా రూ. లక్షల్లో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసి ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇలా బాధితుల బలహీనతలను ఆసరాగా చేసుకుంటున్న సైబర్ క్రిమినల్స్ దేశవ్యాప్తంగా ఇదే తరహాలో వేల సంఖ్యలో మోసాలకు పాల్పడి రూ.కోట్లు కొల్లగొడుతున్నట్లు నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదవుతున్న ఫిర్యాదుల ద్వారా బయటపడింది. ఈ మోసాల తీవ్రతను గుర్తించిన ఐ4సీ అధికారులు రంగంలోకి దిగి మైక్రోసాఫ్ట్ సహకారంతో చర్యలు చేపట్టారు. ఇకపై ఇలాంటి సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వచ్చిన వెంటనే సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నంబర్ 1930కు, పోలీస్ డిపార్టుమెంట్ 100కు కాల్ చేసి చెప్పాలని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు.

థ్యాంక్స్‌కూ నోచుకోమా..?

(5వ పేజీ తరువాయి)

పార్టీ, అభ్యర్థి కోసం శ్రమిస్తే కనీసం థ్యాంక్స్‌కూ నోచుకోమా..? అని బాధపడుతున్నారు. పోలింగ్ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు కేంద్రాల వద్ద పడిగాపులు కాశాం. గెలిచాక నీ భవిష్యత్తు బాధ్యత నాదే.. అన్నీ చూసుకుంటా అని ప్రచార సమయంలో చెప్పిన అభ్యర్థులు.. ఇప్పుడు ఇంటికి వెళ్లినా పలకరించే పరిస్థితి లేకపోవడంపై గుర్రుగా ఉన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత అభ్యర్థులుగాని, వారి తరపు నేతలు గాని కనీసం ఫోన్ చేసి, థ్యాంక్స్ కూడా చెప్పకపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు జరిగిన ఏకైక ఉప ఎన్నికలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు పోటాపోటీగా తలపడ్డాయి. అయితే, పోలింగ్ ముగిసిన తర్వాత కొన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులుగాని, వారి ముఖ్యులుగానీ తమను పలకరించిన పాపాన పోలేదని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఫోన్ కూడా చేయడం లేదని, తమ కష్టాన్ని గుర్తించడం లేదని వాపోతున్నారు.

బూత్ ఏజంట్లకు అందని డబ్బులు..

ఓ రాజకీయ పార్టీ తరపున బూత్ ఏజంట్లుగా వ్యవహరించిన కార్యకర్తల ఆవేదన మరింత దారుణంగా ఉంది. బూత్ ఏజంట్లుగా వ్యవహరిస్తే ఇస్తామని చెప్పిన డబ్బులు సైతం తమకు పంపించలేదని వారు మండిపడుతున్నారు. పోలింగ్ ముగిసి రెండు రోజులు గడిచినప్పటికీ.. డబ్బుల సంగతి మాట్లాడడం లేదని, తమను పోలింగ్ ఏజంట్లుగా నియమించడంలో కీలక పాత్ర పోషించిన నేతలను అడిగితే కూడా ప్రయోజనం కలగడం లేదని వాపోతున్నారు. కౌంటింగ్‌కు వెళ్లమని అడిగినప్పుడు తమ తడాఖా చూపుతామని వారు పేర్కొంటున్నారు.

అన్నా.. ఎవరు గెలుస్తరే..?

- ఎక్కడ చూసినా అదే చర్చ
- సామాన్యుడి నుంచి ఉన్నతాధికారి వరకు..
- ఏ నియోజవకర్గంలో ఎవరు గెలుస్తారని ఆరా
- స్నేహితులు, బంధువులకు ఫోన్లు



హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు.., ప్రైవేట్ సంస్థలు.., నలుగురు ఎక్కడ కలిసినా ఒకటే చర్చ. అన్నా, ఎన్నికలు ఎలా జరిగాయి..? ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి..? ఏ నియోజకవర్గంలో ఎవరు గెలువబోతున్నారు..? ఏ పార్టీకి ఎన్ని స్థానాలొస్తాయి..? సాధారణ పౌరుల నుంచి ఉన్నతాధికారుల వరకు రాజకీయాలపై ఆసక్తి ఉన్న చాలామంది ఎన్నికల ఫలితాలపై ఆరా తీస్తున్నారు. ఎక్కడ ఎవరు గెలిచే అవకాశముంది..? ఫలానా అభ్యర్థి పరిస్థితి ఏంటి..? ఏ నియోజకవర్గంలో ఏ పార్టీల మధ్య పోటీ ఉందన్నది చర్చిస్తున్నారు. ఇందులో కొందరు సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుండగా.. ఇంకొందరు తమకు తోచిన అభిప్రాయం చెబుతున్నారు. స్నేహితులు, బంధువులకు ఫోన్ చేసి మీ దగ్గర ఏ పార్టీ గెలిచే అవకాశం ఉంది..? మీరెవరికి ఓటు వేశారని తెలుసుకుంటున్నారు. ప్రముఖులు పోటీ చేస్తోన్న నియోజకవర్గాలపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రధానంగా సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ స్థానాల్లో ఫలితం ఎలా ఉండబోతుందన్న దానిపై ఎక్కువ చర్చ జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో హోరాహోరీ పోరు ఉండడం.. సీనియర్ నేతలు పోటీ చేస్తుండడంతో గెలుపు ఎవరిదన్నది ప్రధానంగా చర్చిస్తున్నారు. ఇక ఏపీ ఎన్నికలు.. అక్కడి హింసాత్మక ఘటనలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఎన్నికలంటే ఇంత హింస జరుగుతుందా..? ఇదేం వైపరీత్యం అని పలువురు పేర్కొంటున్నారు. కేంద్రంలో ఏ కూటమికి అవకాశం ఉంది..? ఉత్తర భారతదేశంలో ఏ పార్టీకి సీట్లు ఎక్కువగా వస్తాయి..? ఎవరికి తగ్గుతాయి..? దక్షిణాదిన తీర్పు ఎలా ఉండబోతుందన్న దానిపై ఎవరికి వారు అభిప్రాయం వెల్లడిస్తున్నారు. మొత్తంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై చర్చ జోరుగా సాగుతోంది.

పోలింగ్ రోజున.. తగ్గిన పొల్యూషన్


- మే 11 డేటాతో పోల్చితే 13న 2/3వ వంతు తగ్గిన వాయు కాలుష్యం

మహానగరంలో పోలింగ్ రోజు (ఈ నెల 13న)న వాయు కాలుష్యం భారీగా తగ్గింది. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఏపీలో ఓట్లున్న నగరవాసులు వారి సొంతూళ్లకు వెళ్లడం, తెలంగాణ జిల్లాల నుంచి నగరానికి వలసవచ్చిన వారు పల్లెబాట పట్టడమే ఇందుకు ప్రధాన కారణం.

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓట్లేసేందుకు రెండు రోజుల ముందుగానే ప్రజలు వెళ్లడంతో నగరంలో వాహనాల రద్దీ కూడా గణనీయంగా తగ్గింది. దీంతో సాధారణ రోజులతో పోల్చితే పోలింగ్ రోజున, ఒక రోజు ముందు, ఒక రోజు తర్వాత వాయు కాలుష్యం తగ్గినట్లుగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తాజాగా విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. టీఎస్ పీఎస్‌బీ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ నెల 11న గాలిలో పార్టిక్యులేట్ మేటర్ (పీఎం)-2.5 సూక్ష్మకణాలు క్యూబిక్ మీటర్‌కు 45 మైక్రోగ్రాములు ఉండగా, పోలింగ్‌కు ముందు రోజు 22, పోలింగ్ రోజున 21, 14న 48 మైక్రోగ్రాములు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. అలాగే, పార్టిక్యులేట్ మేటర్ (పీఎం)-10 సూక్ష్మకణాలు మే 11న క్యూబిక్ మీటర్‌కు 130 మైక్రోగ్రాములు ఉండగా, మే 12న 44, మే 13న 41, మే 14న 80 మైక్రోగ్రాములు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. మరోవైపు ఇంధనం కాల్చడం వల్ల వాహనాల నుంచి వెలువడే విషపూరిత వాయువు నైట్రస్ ఆక్సైడ్ మే 11న క్యూబిక్ మీటర్‌కు 30.3 మైక్రోగ్రాములు ఉండగా, మే 12న 25.9, మే 13న 27.4, మే 14 25.7 మైక్రోగ్రాములు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు.

14 ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్లు

వాయు కాలుష్యాన్ని అంచనా వేసే నిమిత్తం టీఎస్ పీసీబీ అధికారులు నగరంలోని 14 ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సనత్‌నగర్, సెంట్రల్ యూనివర్సిటీ, జూపార్కు, నాచారం, కొంపల్లి, మలక్‌పేట్, ఇక్రిశాట్, బాచుపల్లి, కంది ఐఐటీ, కోకాపేట్, ఈసీఐఎల్, బీరంగూడ తదితర ప్రాంతాల్లోని ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ల నుంచి కాలుష్య ప్రమాణాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. ఎన్నికల తేదీకి ఒక రోజు ముందు నుంచి ఈ నెల 14 వరకు వాహనాల రద్దీ తక్కువగా ఉండడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడలేదని, దీంతో వాహనాల సగటు వేగం పెరిగి కాలుష్య కారకాల విడుదల తగ్గినట్లు అధికారులు పేర్కొన్నారు. సాధారణ రోజుల్లో నగరంలో రోజుకు పీఎం 2.5 సూక్ష్మకణాలు క్యూబిక్ మీటర్‌కు 60, పీఎం 10 సూక్ష్మకణాలు క్యూబిక్ మీటర్‌కు 100 మైక్రోగ్రాములు ఉంటాయని వెల్లడించారు.



	11-05-2024	12-05-2024	13-05-2024	14-05-2024
NOx	30.3	25.9	27.4	25.7
PM2.5	45	21	22	28
PM10	130	44	43	80

పోలింగ్‌కు ముందు, తర్వాత నగరంలో నమోదైన కాలుష్యంపై పీసీబీ గ్రాఫ్

గొప్ప విమర్శకుడు కేకేఆర్

- సంస్మరణ సభలో వక్తలు
- 'ఆధునికత - ఆధునికానంతరత' అంశంపై ప్రొఫెసర్ అడ్లూరి రఘురామరాజు స్మారకోపన్యాసం

అఫ్జల్‌గంజ్, మే 15 (ఆంధ్రజ్యోతి): "ఆధునికత అనేది పాశ్చాత్య దేశాల్లో గతం పూర్తిగా తొలగిపోయిన తర్వాత వచ్చింది. కానీ భారతదేశంలో మాత్రం గతాన్ని కాదని రాలేదు" అని తత్వశాస్త్ర ఆచార్యులు అడ్లూరి రఘురామరాజు అన్నారు. ఆధునికత కేవలం కాలవాచికం మాత్రమే కాదు, అది మానవజీవితంలో వచ్చిన మార్పులను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ప్రముఖ సాహితీ చరిత్రకారుడు, భాషావేత్త ఆచార్య కేకే రంగనాథాచార్యులు(కేకేఆర్) తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు కలిసి బుధవారం తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో కేకేఆర్ సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 'ఆధునికత - ఆధునికానంతరత' అంశంపై ప్రొఫెసర్ అడ్లూరి రఘురామరాజు స్మారకోపన్యాసం చేశారు. కేకేఆర్ గొప్ప విమర్శకుడు, గొప్ప మానవుడు అంటూ కొనియాడారు. ఆధునికత మీద కేకేఆర్ చాలా వ్యాసాల్లో చర్చించారని, ఆధునికానంతరత మీద కూడా ఒక వ్యాసం రాశారని అడ్లూరి తెలిపారు. పుట్టుకలోనే మరణం ఉన్న సిద్ధాంతంగా ఆధునికానంతరతను కేకేఆర్ అభివర్ణించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆధునికత వచ్చిందనగానే సంప్రదాయానికి చోటులేదు అన్న పరిస్థితి దేశంలో సరైనది కాదని, ఇక్కడ ఆధునికతతో పాటు సంప్రదాయం కొనసాగుతుండడం చూస్తున్నామని అన్నారు. ఆధునికానంతరత మనకు సాహిత్యంలోలేదని, సాహిత్య విమర్శలో ఉందని పేర్కొన్నారు. ఆధునికత, ఆధునికానంతరత మీద దేశంలో తగినంత అధ్యయనం జరగలేదని, దీన్ని సూక్ష్మంగా పరిశీలించాల్సిన అవసరం ఉందంటూ అడ్లూరి పేర్కొన్నారు. ఎమెస్కో ఎడిటర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు మోత్కూరి నరహరి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు తదితరులు కేకేఆర్‌తో తమకున్న అనుబంధంతో పాటు ఆయన జీవితం-వ్యక్తిత్వం, విమర్శకత్వం, సాహిత్య సేవ వంటి పలు విషయాలను గుర్తుచేసుకొన్నారు. అనంతరం 'కేకేఆర్ సాహితీ వ్యక్తిత్వం' ప్రసంగాల సంపుటిని ఆయన మనుమడు స్వభావ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు నిఖిలేశ్వర్, నాళేశ్వరం శంకరం, రాపోలు సుదర్శన్ తదితరులతో పాటు కేకేఆర్ సతీమణి ఊర్మిళాదేవి, కుమారుడు సుమన్ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రఘురామరాజు

మే 17 నుంచి లులు మాల్‌లో లులు ఫ్యాషన్ వీక్

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): స్ప్రింగ్ సమ్మర్ ఫ్యాషన్‌లు ఎలా ఉండబోతున్నాయో తెలుసుకోవడంతో పాటు అంతర్జాతీయంగా ఫ్యాషన్ ధోరణులను ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తూ కూకట్‌పల్లిలోని లులు మాల్ ఓ ఫ్యాషన్ వీక్‌ను నిర్వహించబోతుంది. దేశవ్యాప్తంగా ఐదు నగరాల్లో నిర్వహించే ప్రతిష్టాత్మక ఫ్యాషన్ వీక్ తొలిసారిగా హైదరాబాద్‌కు రాబోతుందని, ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు మాల్‌లో ఈ ఫ్యాషన్ వీక్ చేయబోతున్నామంటున్నారు లులు మాల్ ప్రతినిధులు. ఈ ఫ్యాషన్ వీక్ విశేషాలను మాల్ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఫ్యాషన్ వీక్ కొరియోగ్రాఫర్ షామ్ ఖాన్, ఫ్యాషన్ షో మేనేజర్ మహ్మద్ నవీద్, బైయింగ్ కో-ఆర్డినేటర్ విస్మయ విజయన్, మర్చండైజ్ కో-ఆర్డినేటర్ రష్మి తదితరులు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శైలి, సృజనాత్మకత, ఆవిష్కరణల సమ్మేళనంగా ఈ ఫ్యాషన్ వీక్‌ను నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా ఈ షోను తాము చేయబోతున్నామని తెలిపారు. స్త్రీ, పురుషులు, కిడ్స్ ఫ్యాషన్‌లో 30కు పైగా అంతర్జాతీయ బ్రాండ్లు పాల్గొంటున్నాయని, దాదాపు 20 మందికి పైగా తెలుగు, హిందీ సినీ, టీవీ, రియాల్టీ షోల సెలబ్రిటీలు ఈ కలెక్షన్స్‌తో షో స్టాపర్లుగా ర్యాంప్‌పై నడవనున్నారని తెలిపారు. కేవలం అప్పెరల్స్ మాత్రమే కాకుండా యాక్ససరీలు, ఫుట్‌వేర్ తదితర బ్రాండ్లు కూడా తమ కలెక్షన్స్‌ను ప్రదర్శించనున్నాయని, మే 17 నుంచి ప్రతి రోజూ సాయంత్రం 5 గంటలకు ఈ షోలు జరగనున్నాయని తెలిపారు.



మాట్లాడుతున్న లులు మాల్ ప్రతినిధులు

యూనిపోల్స్.. డేంజర్‌బెల్స్

(5వ పేజీ తరువాయి)

వాటిలో మెజార్టీ ప్రమాదకరంగా మారాయి. 2017-18లో నగరంలో గంటకు 80-90 కి.మీల వేగంతో గాలులు వీచాయి. వందల సంఖ్యలో చెట్లు, విద్యుత్ స్తంభాలు కుప్పకూలాయి. పలు ప్రాంతాల్లో హోర్డింగ్‌లు నేలకొరిగాయి. పలు ఘటనల్లో పౌరులు మృతి చెందగా.. కొన్ని ప్రమాదాల్లో వాహనాలు ధ్వంసమయ్యాయి. నగరంలో గతంలో 2,680 అధికారిక యూనిపోల్స్ ఉండగా.. దాదాపు 3 వేలకుపైగా అక్రమంగా ఉన్నాయని అంచనా. ఇందులో 50 శాతం వరకు ఇప్పటికీ తొలగించలేదని జీహెచ్ఎంసీ వర్గాలు చెబుతున్నాయి.



మాసబ్‌ట్యాంక్ వద్ద యూనిపోల్

గాలిదుమారానికే కుప్పకూలుతున్నాయ్..

(5వ పేజీ తరువాయి)

ఓ సంస్థ పనులు చేపట్టింది. వారం క్రితం వచ్చిన గాలి దుమారానికి పటాన్‌చెరు నుంచి కోకాపేట వైపు వచ్చే మార్గంలో విద్యుత్ స్తంభం కూలి రోడ్డుపై పడింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. విషయం పెట్రోలింగ్ సిబ్బంది దృష్టికి వెళ్లడంతో కిందపడిన విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. ఔటర్‌లో మరో ప్రాంతంలో కూడా వర్షం వచ్చినప్పుడు విద్యుత్ స్తంభం కూలి రోడ్డుకు అడ్డంగా పడిందని సిబ్బంది తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డులో సెంట్రల్ మీడియన్‌లో వచ్చే విద్యుత్ స్తంభాన్ని బిగించేందుకు మొదటగా కాంక్రీట్‌తో దిమ్మె ఏర్పాటు చేస్తారు. దానిపై అల్యూమినియంతో కూడిన విద్యుత్ స్తంభాన్ని బిగిస్తారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో డివైడర్ వెంట ఇవే విద్యుత్ దీపాలున్నాయి. నగరంలో అనేకమార్లు భారీ వర్షాలు, పెద్దఎత్తున గాలిదుమారాలు వచ్చాయి. అయినా, సెంట్రల్ మీడియన్‌లోని విద్యుత్ స్తంభాలు కూలలేదు. కానీ, ఔటర్‌పై గల సెంట్రల్ మీడియన్ విద్యుత్ స్తంభాలు కూలుతుండడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో విద్యుత్ స్తంభాల ఏర్పాటులో నాణ్యత ప్రమాణాలు పాటించలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్యాకేజీ-2లో సరెగూడెం, మేడ్చల్, శామీర్‌పేట వరకు 33 కిలోమీటర్ల మేర, ప్యాకేజీ-3లో కీసర నుంచి ఘట్‌కేసర్, పెద్దఅంబర్‌పేట వరకు 34 కిలోమీటర్లు, ప్యాకేజీ-4లో బొంగుళూర్ నుంచి తుక్కుగూడ, పెద్దగోల్కొండ వరకు 35 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల పటిష్టతను పరీక్షించాలని, మున్ముందు గ్రేటర్‌పై ఎల్‌నినో ప్రభావముంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో హెచ్ఎండీఏ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


మొదటి రోజు సదస్సుకు హాజరైన శాస్త్రవేత్తలు, రైతులు

'సమతుల్య వ్యవసాయంలో సాంకేతికత'పై

రైతులకు వారం రోజుల శిక్షణ

రాజేంద్రనగర్, మే15(ఆంధ్రజ్యోతి): 'సమతుల్య వ్యవసాయంలో సాంకేతికత' అంశంపై ఉద్యాన రైతులకు వారం రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రారంభమైనది. ఈ శిక్షణ కార్యక్రమానికి రాజేంద్రనగర్‌లోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం సహ సంచాలకులు డాక్టర్ ఎం.మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులలో సమతుల్య వ్యవసాయ ప్రాధాన్యతలు సంతరించుకున్నదని అన్నారు. ఉద్యానశాఖ అధికారులు ఎ.ప్రేంసింగ్, శేఖర్ ఉద్యానపంటలైన కూరగాయలు, పూలతోటల పెంపకంలో అధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పంటలకు ఉన్న ఎగుమతి అవకాశాలను రైతులకు వివరించారు. నేషనల్ కమిటీ ఆన్ ప్రెసిషన్ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చర్ శిక్షణ కార్యక్రమానికి సహకారం అందించింది. వివిధ జిల్లాలకు చెందిన యువరైతులు శిక్షణలో పాల్గొన్నారు. సమావేశంలో డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి యూనిఫాం అందజేస్తున్న డిప్యూటీ రీజినల్ మేనేజర్ జగన్

సంస్థకు అదనపు ఆదాయం సమకూరేలా

ఆర్టీసీ సిబ్బంది కృషి చేయాలి

చాంద్రాయణగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తూ సంస్థకు ఆదాయం సమకూరేలా ఆర్టీసీ సిబ్బంది కృషి చేయాలని హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ జి.జగన్ ఉద్యోగులకు సూచించారు. బుధవారం ఫలక్‌నుమా ఆర్టీసీ డిపోను సందర్శించిన ఆయన ఉద్యోగులతో సమావేశమయ్యారు. అనంతరం విధినిర్వహణలో అంకితభావంతో కృషి చేసిన డ్రైవర్, కండక్టర్, మెకానిక్, ట్రాఫిక్ సిబ్బందికి బహుమతులు, కొత్త యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికుల పట్ల స్నేహపూర్వకంగా నడుచుకుంటూ రోజూ లక్ష రూపాయల అదనపు ఆదాయం సమకూర్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


సమ్మర్ క్యాంపులో చిన్నారులతో డిప్యూటీ క్యూరేటర్ నాగమణి

జూపార్కులో విద్యార్థులకు సమ్మర్ క్యాంపు

మదీన, మే 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ జూలాజికల్ పార్కులో విద్యార్థులకు రెండో విడత సమ్మర్ క్యాంపు బుధవారం బయోస్కోప్ హాల్‌లో నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. జూ పార్కు డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి విద్యార్థులకు జూ ఏర్పాటు ఆవశ్యకత, జంతువుల సంరక్షణ, పునరుత్పత్తి కోసం జూ సిబ్బంది చేస్తున్న కృషిని వివరించారు. జంతువుల అలవాట్లు, వాటి జీవన విధానం, ఆహారం తీసుకునే తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జూపార్కులోని సఫారీ పార్కు, పక్షుల ఎన్‌క్లోజర్, చీకటి జంతువులు ఉండే ప్రదేశం, కోతులు, పెద్ద పులుల ఎన్‌క్లోజర్‌ల వద్దకు విద్యార్థులను తీసుకెళ్ళి వాటి గురించి అవగాహన కల్పించారు. పాములు ఎన్నిరకాలు, విషపూరితమైనవి ఏవీ, పర్యావరణంలో వాటి పాత్రను వివరించారు. పాము కాటు వేసిన వెంటనే ఏం చేయాలి అనే విషయాలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థలకు డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ బి.లక్ష్మణ్, పౌర సంబంధాల అధికారి హనీఫుల్లా, ఈఓ దీపక్ తరుణ్ పాల్గొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

● మజ్లిస్ నాయకుడు ఒమర్ బామ్



పహాడీషరీఫ్ మే 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, మజ్లిస్ నేత ఒమర్‌బామ్ అన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కులాల కుంపట్లతో బీఆర్ఎస్, మత్య విద్వేషాలతో బీజేపీ ఎంపీ ఎన్నికలలో లబ్ధి పొందాలని చూసినా, ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకే ఓటు వేశారని అన్నారు. ప్రజాస్వామ్యం లో కీలకమైన ఓటును ప్రలోభాలకు గురికాకుండా చూసే బాధ్యతను ఎన్నికల కమిషన్, ప్రభుత్వయంత్రాంగం సమర్థవంతంగా నిర్వహించిందన్నారు. చేవెళ్ల ఓటర్లు.. ప్రజలకు అందుబాటులో ఉండే నిస్వార్థ సేవకుడు రంజిత్‌రెడ్డికే తిరిగి పట్టం కట్టనున్నారని అన్నారు. వరుసగా పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణకు ఒరగ బెట్టిందేమీ లేదని విమర్శించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు: మిత్ర కృష్ణ



అఫ్జల్‌గంజ్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరి ధన్యావాదాలు అని కార్వాన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ అయిదాల కృష్ణ మిత్ర అన్నారు. గురువారం ఆయన కార్వాన్‌లో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో మిత్ర కృష్ణ మాట్లాడుతూ 'ఓటు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, పవిత్రమైన ఓటును దుర్వినియోగం చేయకుండా దేశభవిష్యత్తును కాక్షించి మంచి నాయకుడిని ఎన్నుకోవడం కోసం ఓటు వేసిన ప్రతి ఒక్కరికి' ఆయన ధన్యవాదాలు తెలిపారు.

మేకలమండిలో మురుగు పరుగు

● నెల రోజుల నుంచి ఇళ్ల ఎదుటు పారుతున్న డ్రైనేజీ వ్యర్థాలు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని జలమండలి అధికారులు


బస్తీలో పారుతున్న మురుగునీరు

చాంద్రాయణగుట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి): గౌలిపురా డివిజన్‌లోని మేకలమండిలో ఇళ్ల ఎదుట మురుగు పరుగులు పెడుతుంది. నెల రోజుల నుంచి ఇళ్ల ఎదుట డ్రైనేజీ వ్యర్థాలు పారుతుండడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. బస్తీలోని ప్రధానరహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు సాగించలేని దుర్భరస్థితి నెలకొంది. దీనికితోడు పందుల సంచారంతో ఆ ప్రాంతంలో మరింత దుర్గంధంగా మారింది. నెలరోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లి మురుగునీరు పారుతున్నా పట్టించుకునే నాథుడే లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు మండిపడుతున్నారు. మురుగునీటితో దోమలు, ఈగలు వృద్ధి చెంది తాము అనారోగ్యాల బారినపడుతున్నామని వాపోతున్నారు. తాగునీరు కూడా కలుషితమవుతున్నాయని అంటున్నారు.

జలమండలి అధికారుల నిర్లక్ష్యం

జలమండలి అధికారుల నిర్లక్ష్యం వలన మురుగునీటిలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెల రోజుల నుంచి ఇళ్ల ఎదుట మురుగు నీరు ప్రవహిస్తున్నదని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. అధికారులే సమస్యలను పట్టించుకోకపోతే ఎలా అని వాపోతున్నారు.

ఇంటి నిర్మాణంతోనే సమస్య

మేకలమండి ప్రాంతంలో ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణం చేస్తున్న సమయంలో డ్రైనేజీ పైపులైన్, మ్యాన్‌హోల్ ధ్వంసమయ్యాయి. దాంతో మురుగునీటి ప్రవాహం ఆగిపోయి మేకలమండి నుంచి గౌలిపురా, లలితాబాగ్ రహదారి వరకు ఇళ్ల ఎదటు పారుతోంది.

మురుగు సమస్యను పరిష్కరించాలి



గౌలిపురా డివిజన్‌లోని మేకలమండిలో మురుగు సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలి. నిత్యం మురుగునీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా వారు స్పందించి సమస్యను పరిష్కరించాలి. లేకపోతే స్థానికులతో కలిసి జలమండలి కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతాం.

\- ఆలే జితేంద్ర, మాజీ కార్పొరేటర్

జనావాసాల మధ్య పందుల సంచారం

● చిన్నపిల్లలు, మేకలపై దాడి

● వ్యాధులు ప్రభలుతాయోనని స్థానికుల ఆందోళన


శ్రీరామ్ కాలనీలో ఇళ్ల మధ్య సంచరిస్తున్న పందులు

పహాడిషరీఫ్ మే 15(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య పందులు గుంపులు గుంపులుగా సంచరిస్తుండంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల ముందు ఆడుకుంటున్న చిన్న పిల్లలు, మేకలపై దాడి చేస్తున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. కాలనీలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో పందులు తిష్ట వేస్తున్నాయని, దాంతో ఎక్కడ వ్యాధులు ప్రభలుతాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఇది జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీ వాసులు దుస్థితి. కాలనీలో సంచరిస్తున్న పందులను ఇతర ప్రాంతాలకు తరలించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' మున్సిపల్ అధికారులను వివరణ కోరగా, పందులు పెంచే వారికి నోటీసులు ఇచ్చామని జనావాసాల మధ్య పందులు సంచరిస్తే పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తామని వాటి యజమానులకు జరిమానా విధిస్తామమని తెలిపారు.

ఈ పీఆర్సీలో 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి: బహుజన టీచర్స్ అసోసియేషన్


రెండో పీఆర్సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పంజాగుట్ట, మే 15(ఆంధ్రజ్యోతి): ఈ పీఆర్సీలో 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ)విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం బీఆర్కేఆర్ భవన్‌లో రెండో పీఆర్సీ కమిషన్ చైర్మన్ ఎన్.శివశంకర్, సభ్యులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కల్వదర్శి చైతన్య, గౌరవ అధ్యక్షుడు వి.బాలవీర్ మాట్లాడుతూ పీఆర్సీలో 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని పీఆర్సీ కమిషన్ చైర్మన్, సభ్యులను కోరామన్నారు. లాంగ్వేజ్ పండితులకు, ఎస్జీటీలు ఉన్నత తరగతుల బోధనకై అదనపు అలవెన్స్‌ను కనీసం రూ.1200 ఇవ్వాలని కోరారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నందున వారికి మంచి అలవెన్స్ ఇవ్వాలని, జీఐఎస్ స్లాబ్లను ఏ-గ్రూపు రూ.1200, బీ-గ్రూప్ రూ.900, సీ-గ్రూపు రూ.600, డీ-గ్రూప్ రూ. 300 ఇవ్వాలని, సంపాదిత సెలవులను సంవత్సరానికి 10 రోజులకు తగ్గకుండా పెంచాలని అన్నారు. ఉపాధ్యాయుల కర్మకాండలకు కనీసం ఐదు రోజులు సెలవులు ఇస్తూ ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీని రూ. 22 లక్షలకు పెంచాలన్నారు. తమ విజ్ఞప్తి పట్ల కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, పీఆర్సీ నివేదిక సంఘం ఇన్‌చార్జి ఎం.విజయ్ కుమార్, తదితరులు వారి వెంట ఉన్నారు.

కస్తూర్బ అకౌంటెంట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి


సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలిసిన కేజీబీవీ అకౌంటెంట్ ఉద్యోగులు

ఖైరతాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): కస్తూర్బ విద్యాలయాల్లో పనిచేస్తున్న అకౌంటెంట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. బుధవారం ప్రోగ్రెస్సివ్ కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ, ప్రధాన కార్యదర్శి పి.అరుణ్‌కుమార్ నేతృత్వంలో ఉద్యోగులు సైఫాబాద్‌లోని కార్యాలయంలో సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలిశారు. అకౌంటెంట్లకు, నాన్ టీచింగ్ సిబ్బందికి నైట్ డ్యూటీలు, హాలిడే డ్యూటీలు చేయించాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. అకౌంటెంట్లకు, సీఆర్‌టీ ఉద్యోగులకు గతంలో జీతాల పెంపుదలలో తక్కువ వ్యత్యాసం ఉండేదని, అది ప్రస్తుతం రూ.10 వేలకు పెరిగిందని, అకౌంటెంట్లకూ వేతనాలు పెంచాలని కోరారు. అకౌంటెంట్ల పని వేళలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండేలా చూడాలని కోరారు. పీడీని కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు ప్రవీణ, చంద్రకళ, వసంత, సరిత తదితరులు ఉన్నారు.

డాక్టర్ అబ్దుల్ రెహమాన్‌కు పీహెచ్‌డీ


డాక్టర్ అబ్దుల్ రెహమాన్

ఎర్రగడ్డ, మే 15 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖ అదనపు డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్‌కు పీహెచ్‌డీ డిగ్రీ లభించింది. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్‌కు పీహెచ్‌డీ పట్టా అందజేసింది. అనలిటికల్ స్టడీ ఆఫ్ అనిమల్స్ మెన్‌షండ్ ఇన్ ది హోలీ ఖురాన్ ఇన్ ద లైట్ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను యూనివర్సిటీ ఈ గౌరవ పీహెచ్‌డీ అందజేసింది. ఉస్మానియా వర్సిటీ అరబీ భాషా విభాగపు అధిపతి ప్రొఫెసర్ మహాసబిన్ అత్తర్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఖురాన్‌లో పేర్కొన్న వెటర్నరీ సైన్స్ ప్రాముఖ్యత, ప్రయోజనాలు, ఉద్దేశాన్ని వివరిస్తూ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ ఒక పరిశోధన పత్రాన్ని ప్రచురించారు. ఇటువంటి అంశంపై భారత దేశంలోని ఇది మొట్టమొదటి ప్రచురణగా ప్రసిద్ధిగాంచింది. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ... తాను పొందిన ఈ పీహెచ్‌డీతో మరిన్ని విజయాలు సాధించడానికి స్ఫూర్తి కలిగిందన్నారు.

నృత్య కళాకారిణికి మహాబలి పురస్కారం

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ నృత్యకళాకారిణి స్నేహరామ్‌చందర్‌కు సాంస్కృతిక, సేవారంగాలకు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక మహాబలి పురస్కారం లభించింది. ఇండోనేషియాలో బాలి విశ్వవిద్యాలయంలో సంగమం గ్లోబల్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్), బాలి విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన నృత్యోత్సవంలో స్నేహ రామ్‌చందర్ ఈ పురస్కారాన్ని బాలి నగరానికి చెందిన రాజు డా. అరివేదకర్ణ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహక సంస్థల ప్రతినిధులు నవీన్, డా. ఎస్ పంచనాథమ్ తదితరులు పాల్గొన్నారు. స్నేహరామ్ చందర్ భారతదేశంలో లెప్రా సొసైటీకి రాయబారిగా ఉండి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

మూడేళ్లయినా పూర్తికాని నాలా పనులు

● రాకపోకలకు ఇబ్బందులు

● బారీకేడ్లు తొలగించాలంటున్న వాహనదారులు


షోయబ్ హోటల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బారీకేడ్లు

చార్మినార్ మే 15 (ఆంధ్రజ్యోతి): నత్తనడకన నాలా పనులు జరుగుతుండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దక్షిణ మండలం జోనల్ కమిషనర్ కార్యాలయం సమీపంలో సన్నీగార్డెన్ ఫంక్షన్‌హాల్ వద్ద చేపట్టిన నాలా పనులు మూడేళ్లయినా పూర్తి కాలేదు. దాంతో నాలా పనులు నత్తనడకన జరుగుతున్నాయని వేగంగా పూర్తి చేయాలని పలు కాలనీ వాసులు కోరుతున్నారు. నాలా పనుల కోసం జీహెచ్ఎంసీ అధికారుల, ట్రాఫిక్ పోలీసులు, హఫీజ్ బాబానగర్ షోయబ్ హోటల్ చౌరస్తా వద్ద బారీకేడ్లు ఏర్పాటు చేశారు. దాంతో హఫీజ్ బాబా నగర్, గుల్షన్ ఇక్బాల్ కాలనీ, ఫూల్‌బాగ్, నసీబ్ నగర్ కాలనీలకు చెందిన ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షోయబ్ హోటల్ చౌరస్తా వద్ద ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన ట్రాఫిక్ పోలీసులు బారీకేడ్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. దాంతో ఇతర ప్రాంతాల నుంచి కాలనీలకు వచ్చే ప్రజలతోపాటు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ వేగంగా పనులు పూర్తి చేయడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని, లేకుంటే షోయబ్ హోటల్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన బారీకేడ్లను తొలగించాలని వారు కోరుతున్నారు. అధికారులు ట్రాఫిక్ పోలీసులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని నాలా పనులు త్వరగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌పై వత్తిడి తెలవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): గగన్‌పహడ్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకు తమిళనాడు హోటల్, డైమండ్ వేబ్రిడ్జి, బుద్వేల్ రైల్వేస్టేషన్, పరివార్ దాబా, ఆరాంఘర్‌లోని రూరల్ ఎలక్ట్రిఫికేషన్ సెంటర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. సాతంరాయి 11కేవీ పరిధిలో.. ఉదయం 8గంటల నుంచి 8:30 గంటల వరకు పాశంబండ, రాజీవ్‌గృహకల్ప, సుచీర్ ఇండియా, పాశంబండ ఏజీఎల్, మంజీర కండక్టర్ ప్రాంతాలో కరెంటు సరఫరా ఉండదన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం


మృతిచెందిన మహిళ

అఫ్జల్‌గంజ్, మే 15 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మహిళ ఎంజీబీఎస్ బస్టాండ్ సమీపంలో లభ్యమైంది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఎంజీబీఎస్ బస్టాండ్ సమీపంలో ఓ మహిళ అపస్మారస్థితిలో ఉందని స్థానికులు బుధవారం సమాచారం అఫ్జల్‌గంజ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉంది. మృతిచెందిన మహిళ వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండొచ్చని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హతమార్చిన కేసులో..

భర్తకు జీవిత ఖైదు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, మే 15(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించి హతమార్చిన కేసులో భర్తకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తు అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై. జయప్రసాద్ బుధవారం తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వొద్యారపు రవికుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం మల్లయ్యగూడెంకు చెందిన బెక్కా సందీప్‌కు సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గొల్తాండకు చెందిన రాణితో వివాహం జరిగింది. వివాహం అనంతరం కొంతకాలం వారి సంసారం సంతోషం గా సాగింది. తర్వాత సందీప్ అదనపు కట్నం కోసం భార్య రాణిని వేధించసాగాడు. దీంతో రాణి తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో నచ్చచెప్పారు. సందీప్ రాణీలు తమ సంసారాన్ని సాహెబ్‌నగర్‌కు మార్చారు. వారికి ఇద్దరు సంతానం కలిగారు. అయినప్పటికీ సందీప్‌లో మార్పు రాలేదు. 2018 ఫిబ్రవరి 28న రాత్రి సందీప్.. భార్య రాణితో గొడవపడి రోకలిబండతో తలపై మోదగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాణి తల్లి అజ్మీరా మస్రు కూతురి ఇంటికి వచ్చింది. రక్తం మడుగులో పడి ఉన్న రాణి మృతదేహాన్ని చూసి బోరున విలపిస్తూ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి జయప్రసాద్ నిందితుడికి జీవితఖైదుతోపాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పార్శిల్ చోరీకి యత్నం

దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగింత

యూసుఫ్‌గూడ, మే 15(ఆంధ్రజ్యోతి): పార్శిల్ చోరి చేసేందుకు యత్నించిన దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం సాయికుమార్ అమెజాన్‌లో డెలివరీ బాయ్. ఈ నెల 14న మధురానగర్‌లో పార్శిల్ డెలివరీ ఇచ్చాడు. తన వాహనం వద్దకు వస్తుండగా మహ్మద్ ఇర్ఫాన్ అనే వ్యక్తి రూ. 5000 విలువ చేసే పార్శిల్ దొంగతనానికి యత్నించాడు. సాయికుమార్ అతడిని పట్టుకొని మధురానగర్ పీఎస్‌లో అప్పగించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నత్తనడకన ఓఆర్ఆర్ ఫేజ్-2 పనులు

● రియల్టర్లతో కుమ్మక్కు ● అక్రమ లేఅవుట్లలో పైపులైన్లు


శివారులోని ఓ ప్రాంతంలో నిలిచిన పైపులైన్ పనులు

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు వాటర్‌బోర్డు చేపట్టిన ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలకు భిన్నంగా, వాటర్‌బోర్డు నిర్ణయాలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారు. రియల్టర్లతో కుమ్మక్కై శివారు ప్రాంతాల్లోని అక్రమ లేఅవుట్లలో కూడా పైపులైన్లు వేస్తున్నారు. గత ప్రభుత్వం ఔటర్ పరిధిలోని ప్రాంతాలకు తాగునీటిని అందించే బాధ్యతలను వాటర్‌బోర్డుకు అప్పగించింది. ఓఆర్ఆర్ ఫేజ్-1 ప్రాజెక్టులో భాగంగా రూ.756 కోట్లతో కొంతమేరకు పనులు పూర్తయ్యాయి. ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా రూ.1200 కోట్లతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి అందించే పనులను 2022లో ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తగా 73 సర్వీసు రిజర్వాయర్లు (138 మిలియన్ లీటర్ల సామర్థ్యం), 2988 కిలోమీటర్ల మేర నూతన పైపులైన్ నిర్మించాల్సి ఉంటుంది. ప్యాకేజ్-1లో రూ.613.14 కోట్లతో 1571 కిలోమీటర్ల మేర కొత్తగా పైపులైన్ వేయడంతో పాటు 65.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన 34 రిజర్వాయర్ల నిర్మాణం చేయాలని, ప్యాకేజ్-2లో రూ.586.86 కోట్లతో 1094 కిలోమీటర్ల మేర పైపులైన్ విస్తరణ, 36 రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారు. గతేడాది డిసెంబర్ వరకు పనులు పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్ణయించగా ఆరు నెలలు గడుస్తున్నా కనీసం 70 శాతం కూడా పూర్తవలేదు. పూర్తిస్థాయిలో సర్వీసు రిజర్వాయర్లు అందుబాటులోకి రాలేదు. ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో అధికారులు సైతం స్పష్టతనివ్వడం లేదు.

ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో 73 రిజర్వాయర్లకు 35 మాత్రమే పూర్తిస్థాయిలో నిర్మాణం చేసినట్లు తెలిసింది. మిగతా 38 రిజర్వాయర్ల పనులు సాగుతున్నాయి. 90 శాతం పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నా ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. మొత్తం 2988 కిలోమీటర్ల పైపులైన్‌కు గానూ 2032 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయింది. 956 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. తాగునీటి సరఫరా పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పనులు పూర్తి చేయడానికి నిర్మాణ ఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ లేఅవుట్లలో పైపులైన్లు

ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా శివారులోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 24 గ్రామ పంచాయతీల్లో 2988 కిలోమీటర్ల పైపులైన్ వేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 2150 కిలోమీటర్ల మేర పైపులైన్ మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 800కు పైగా కిలోమీటర్ల పైపులైన్ వేయాల్సి ఉంది. ఇప్పటివరకు నిర్మాణం జరిగిన పైపులైన్ పనుల్లో భారీగా డొల్లతనం ఉన్నట్లు తెలిసింది. నివాసాలు కలిగిన ప్రాంతాల్లోనే పైపులైన్లు వేసి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అందుకు భిన్నంగా ప్రాజెక్టు విభాగంలోని కొందరు అధికారులు, ఏజెన్సీలు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ లేఅవుట్‌లో ఇళ్లు లేకపోయినా పైపులైన్లు వేసినట్లు తెలిసింది. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ ప్రాంతంలో లేఅవుట్ యజమానులకు మేలు చేసేలా పైపులైన్లు వేశారు.

ఘట్‌కేసర్, కీసర, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో రియల్టర్లతో కొందరు అధికారులు కుమ్మక్కై ఇష్టానుసారంగా పైపులైన్లు వేసినట్లు తెలిసింద. ఇటీవల ఏసీబీకి చిక్కకుండా తృటిలో తప్పించుకున్న వాటర్‌బోర్డులోని ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్టు సమాచారం. వాటర్‌బోర్డు ఎండీ మారడం, కొత్తగా మరో ఎండీ రావడంతో ఇదే అదనుగా భావించి ఎన్నికల సమయంలోనే ఈ తతంగాన్ని సాగించినట్లు తెలిసింది. కొత్తగా వచ్చిన ఎండీ ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టును పరిశీలన చేసేలోపు అక్రమాలు జరిగినట్టు బోర్డులో గుసగుసలు వినిపిస్తున్నాయి.

జూన్ రెండోవారంలో పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలు

● జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): గత జనవరిలో జేఎన్‌టీయూ విడుదల చేసిన పీహెచ్‌డీ నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రవేశపరీక్షలను జూన్ రెండోవారంలో నిర్వహిస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పరిశోధనకు అవకాశమేదీ..! శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పీహెచ్‌డీ ప్రవేశాల నిమిత్తం అడ్మిషన్ విభాగానికి అందిన దరఖాస్తుల స్క్రూటినీ పూర్తికాపోవడంపై సంబంధిత విభాగం డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్లను రిజిస్ట్రార్ వివరణ కోరినట్లు చెప్పారు. మరో రెండ్రోజుల్లో స్క్రూటినీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. దరఖాస్తుల పరిశీలన పూర్తికాగానే అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామని, జూన్ రెండోవారంలోగా ప్రవేశ పరీక్ష నిర్వహించి, మూడో వారంలో ఇంటర్వ్యూలు చేపడతామన్నారు. మొత్తంగా జూన్ నెలాఖరు కల్లా పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ కొలిక్కి వచ్చే అవకాశం ఉండడంతో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

షింగల్స్ వైరస్‌కు త్వరలో టీకా

● జీఎస్‌కే ఇండియా మెడికల్ ఎఫైర్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రశ్మీహెడ్గే

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): షింగల్స్ అనేది వరిసెల్లా జోస్టర్ వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుందని, షింగల్స్ వైరస్‌కు త్వరలో టీకా అందుబాటులోకి వస్తుందని జీఎస్‌కే ఇండియా మెడికల్ ఎఫైర్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రశ్మీ హెడ్గే తెలిపారు. జీఎస్‌కే గత 11 ఏళ్లుగా వ్యాక్సిన్ రూపొందించేందుకు పరిశోధనలు నిర్వహించింది. ఈ పరిశోధన ఫలితాలు యూరోపియన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ మైక్రోబయాలజీ అండ్ ఇన్ఫెక్షన్ డిసీజెస్‌లో ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం డాక్టర్ రశ్మీహెడ్గే మాట్లాడుతూ ఈ పరిశోధనల్లో 50 ఏళ్ల పైబడిన వారికి వరుసగా ప్రతి ఏడాది ఒకటి చొప్పున 11 డోసుల రికాంబినెంట్ జోస్టర్ వ్యాక్సిన్‌ను అందించగా, వారిలో రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు షింగల్స్ వచ్చే అవకాశాలు 79.7 శాతం తగ్గాయని పరిశోధనల్లో వెల్లడయిందని తెలిపారు. ఇతర సైడ్ ఎఫెక్ట్‌లు కూడా రాలేదని ఆమె వివరించారు. తమ పరిశోధనల ద్వారా షింగల్స్‌కు టీకాతో పాటు ఇతర వైరస్ ద్వారా వ్యాప్తించే వ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు తగిన అవకాశం లభించిందన్నారు. ప్రపంచంలో ప్రతి ముగ్గురిలో ఒకరు షింగల్స్ బారిన పడుతున్నారని ఆమె తెలిపారు.



టాపర్ విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు.

విద్యార్థులు విద్యపై పట్టు సాధించాలి

● జాహ్నవి విద్యాసంస్థల చైర్మన్ పరమేశ్వర్

● ఘనంగా జాహ్నవి కళాశాల వార్షికోత్సవం

హిమాయత్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదల, ఏకాగ్రతతో విద్యపై పట్టుసాధించాలని జాహ్నవి విద్యాసంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్ సూచించారు. జాహ్నవి జూనియర్, డిగ్రీ, పీజీ కాలేజ్ సికింద్రాబాద్, ప్యారడైజ్ బ్రాంచిల వార్షికోత్సవాన్ని బుధవారం నారాయణగూడ షాలిమార్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితం మళ్లీ మళ్లీ రాదని.. దాన్ని ఆ దశలోనే పూర్తిగా ఆస్వాదించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకునేలా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా క్రీడా, సాంస్కృతిక రంగాలు, విద్యలో రాణించిన కళాశాల టాపర్ విద్యార్థులకు జ్ఞాపికలను, సర్టిఫికెట్లు అందజేసి ఘనంగా సత్కరించి అభినందించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యాషన్‌షో ఆహూతులను అలరించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ లక్ష్మి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నివాస ప్రాంతాల్లో ఉన్న బార్‌పై చర్యలు తీసుకోండి'

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): నివాస గృహాల్లో నిర్వహిస్తున్న బార్లపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. రోడ్ నంబర్ 3 బంజారాహిల్స్ యూనియన్ బ్యాంకు కాలనీలోని నివాస గృహాల మధ్య రెస్టో బార్ అండ్ లాంజ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అనుమతిలేకుండా నిర్మాణాలు చేపట్టి ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొంటూ స్థానికులు కొండా చంద్రశేఖర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాము అందజేసిన రిప్రజెంటేషన్‌పై జీహెచ్ఎంసీ, ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పిటిషనర్ ఇచ్చిన దరఖాస్తును మూడు వారాల్లో పరిష్కరించి చర్యలు తీసుకోవాలని జస్టిస్ టీ వినోద్‌కుమార్ ధర్మాసనం మున్సిపల్, జీహెచ్ఎంసీ, ఎక్సైజ్‌శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ జూన్ నెలకు వాయిదా వేసింది.

21న చెరువుల సంరక్షణపై జాతీయ సదస్సు

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో చెరువులు కనుమరుగవుతున్నాయి. ఒక్క జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోనే సుమారు 3,500 చెరువులు ఉన్నాయి. వీటిలో చాలా వరకు రూపురేఖలు కోల్పోయాయి. ఇక నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో సుమారు 800లకు పైగా చెరువులు ఉన్నాయి. వీటికి పునరుజ్జీవం తీసుకువచ్చేందుకు పురపాలక శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందు కోసం పురపాలక శాఖ సంచాలకులు దివ్య దేవరాజన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న చెరువుల సంరక్షణపై హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందు కోసం దేశవ్యాప్తంగా చెరువుల సంరక్షణకు పాటిస్తున్న ఉత్తమ విధానాలను సేకరించారు. అలాగే చెరువులను కాపాడుకునేందుకు అందుబాటులో ఉండే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపైనా అధికారులు దృష్టిసారించారు. ఈ సదస్సులో చెరువుల సంరక్షణకు తీసుకున్న ఉత్తమ విధానాలు, ఆధునిక సాంకేతికత అనే అంశాలపైనే ప్రధానంగా చర్చించనున్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులతో పాటు, దేశవ్యాప్తంగా చెరువుల సంరక్షణకు పాటుపడుతున్న పలు ఎన్జీవోలను, సాంకేతిక నిపుణులను ఆహ్వానిస్తున్నారు. అమృత్ 2.0 కింద వచ్చే నిధుల ద్వారా చెరువులకు పూర్వవైభవాన్ని తీసుకురావాలని, మంచి నీటి వనరులను కాపాడాలని పురపాలక శాఖ అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి హత్య

మదీన, మే 15 (ఆంధ్రజ్యోతి): హుసేనీఆలం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖాజిపురా ప్రాంతానికి చెందిన మసూద్(28) చార్మినార్ వద్ద సన్‌గ్లాస్‌లు విక్రయిస్తుంటాడు. ఖిల్వత్ ముర్గీచౌక్ ప్రాంతానికి చెందిన మీర్జాఅలీ, షాహిద్ స్నేహితులు. అవసరం నిమిత్తం మసూద్ ఇద్దరి దగ్గర కలిపి రూ.13వేలు అప్పుగా తీసుకున్నాడు. రోజులు గడిచినా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో మసూద్‌పై మీర్జాఅలీ, షాహిద్ కోపం పెంచుకున్నారు. డబ్బుల విషయం మాట్లాడదామని మంగళవారం అర్ధరాత్రి మసూద్‌ను ఖిల్వత్ సమీపంలోని పాత పెన్షన్ ఆఫీస్ ఖాళీ ప్రదేశానికి తీసుకెళ్లారు. అక్కడ ముగ్గురి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో కోపోద్రిక్తులైన మీర్జాఅలీ, షాహిద్ తమవెంట తెచ్చుకున్న కత్తితో మసూద్‌పై దాడి చేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మసూద్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, హుసేనీఆలం ఇన్‌స్పెక్టర్ సురేందర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్న హుసేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్ మే మైదానంలో మేకప్ ఆర్టిస్టు..

యూసుఫ్‌గూడ, మే 15 (ఆంధ్రజ్యోతి): సినిమా, టీవీ రంగంలో మేకప్ ఆర్టిస్టుగా పనిచేస్తున్న ఓ యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన చెన్నయ్య ముదిరాజ్(28) అలియాస్ తరుణ్ తేజ్ వెంకటగిరిలో నివాసం ఉంటున్నాడు. సినిమా, టీవీ సీరియల్స్‌లో మేకప్ ఆర్టిస్టుగా పనిచేస్తున్నాడు. చెన్నయ్య మంగళవారం రాత్రి బోరబండ పీఎస్ పరిధిలోని నిమ్స్ మే మైదానంలో హత్యకు గురయ్యాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ వెంకటరమణ క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

శివారు సర్కిళ్లలో డిస్కంకు కాసుల గలగల

ఎండలతో రికార్డుస్థాయి విద్యుత్ వినియోగం

● రెండు నెలల్లో రూ. 329 కోట్లు పెరిగిన బిల్లుల ఆదాయం

● ఒక్క నెల రూ.148.23 కోట్లతో టాప్‌లో సైబర్‌సిటీ

● రెండో స్థానంలో రూ. 139.20 కోట్లతో మేడ్చల్

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు రూపంలో శివారు సర్కిళ్లు డిస్కంకు కాసులు కురిపిస్తున్నాయి. పెరుగుతున్న కొత్తవిద్యుత్ కనెక్షన్లు, నమోదవుతున్న విద్యుత్ డిమాండ్ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్)కు భారీ ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో గ్రేటర్‌జోన్ వినియోగదారులు మార్చి, ఏప్రిల్ నెలల్లో రికార్డుస్థాయిలో విద్యుత్ వినియోగించడంతో సాధారణం కంటే రూ.329 కోట్లు విద్యుత్ బిల్లుల ఆదాయం పెరిగింది.

ఎండలతో ఏసీలు, కూలర్ల వినియోగం భారీగా పెరిగి గృహాల్లో విద్యుత్ మీటర్లు గిర్రున తిరిగాయి. ఫిబ్రవరి కంటే మార్చి నెలలో రూ. 217 కోట్ల విలువైన విద్యుత్‌ను అధికంగా వాడిన గ్రేటర్‌వాసులు, మార్చి కంటే ఏప్రిల్ నెలలో మరో రూ. 112 కోట్ల విలువైన విద్యుత్‌ను అధికంగా వినియోగించారు. గ్రేటర్‌జోన్ 9 సర్కిళ్ల పరిధిలో 61 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా రోజువారీ విద్యుత్ డిమాండ్ 85-90 మిలియన్ యూనిట్లుగా నమోదయ్యింది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడాది వేసవిలో విద్యుత్ వినియోగం రికార్డుస్థాయిలో పెరిగిందని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో అంచనాకు మించి విద్యుత్ డిమాండ్ పెరగడంతో గ్రేటర్‌జోన్ వ్యాప్తంగా సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల(పీటీఆర్) సామర్థ్యం పెంచడంతో పాటు వందలసంఖ్యలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

గ్రేటర్‌జోన్ 9 సర్కిళ్లలో రెండు నెలల్లో వచ్చిన విద్యుత్ బిల్లులు (రూ.కోట్లలో)

సర్కిల్	ఫిబ్రవరిలో బిల్లులు	మార్చి	ఏప్రిల్
సైబర్‌సిటీ	100.28	132.31	148.23
మేడ్చల్	96.93	125.93	139.20
హబ్సిగూడ	79.31	107.47	123.87
హైదరాబాద్‌సెంట్రల్	76.83	104.86	123.64
బంజారాహిల్స్	74.66	99.49	112.30
హైదరాబాద్ సౌత్	66.16	88.35	93.59
సరూర్‌నగర్	65.76	87.49	106.87
సికింద్రాబాద్	62.55	82.58	91.73
రాజేంద్రనగర్	64.74	76.04	77.49



గృహ/కమర్షియల్ విద్యుత్ డిమాండ్‌తో..

గ్రేటర్ జోన్ 9 సర్కిళ్లలో విద్యుత్‌శాఖ ఫిబ్రవరిలో రూ.687.22 కోట్ల విద్యుత్ బిల్లులు జారీచేస్తే మార్చిలో రూ.903.81 కోట్లు, ఏప్రిల్ నెలలో రూ. 1016.92 కోట్ల బిల్లులు జారీచేసింది. ఏప్రిల్ నెలలో అత్యధికంగా సైబర్ సిటీ సర్కిల్‌లో రూ.148.23 కోట్లు, మేడ్చల్ సర్కిల్‌లో రూ. 139.20 కోట్ల విద్యుత్‌ను వినియోగదారులు వినియోగించారు. ఫిబ్రవరిలో గృహ/కమర్షియల్ విద్యుత్ డిమాండ్‌తో సైబర్‌సిటీ సర్కిల్‌లో బిల్లులతో వచ్చిన ఆదాయం రూ. 100 కోట్లు అయితే, మార్చిలో రూ. 132 కోట్లు, ఏప్రిల్‌లో రూ. 148.23 కోట్లకు పెరిగాయి. రెండు నెలల్లో ఒక్క సైబర్ సిటీ సర్కిల్ పరిధిలో అత్యధికంగా రూ. 48 కోట్లకు పెరిగాయి. సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలో కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గంలో ఐటీ కంపెనీలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు పెద్దసంఖ్యలో ఉండటంతో విద్యుత్ డిమాండ్, బిల్లులు అదే స్థాయిలో వసూలవుతున్నాయి. మేడ్చల్ సర్కిల్‌లో ఫిబ్రవరి నెల విద్యుత్ బిల్లులు రూ. 96 కోట్లయితే మార్చిలో రూ.125 కోట్లు, ఏప్రిల్‌లో 139 కోట్లకు పెరిగింది. హబ్సిగూడ సర్కిల్‌లో ఫిబ్రవరిలో రూ.79, మార్చిలో రూ. 107, ఏప్రిల్‌లో రూ. 123 కోట్లకు పెరిగింది. డిస్కంలో మొత్తం 20 సర్కిళ్లు ఉండగా గ్రేటర్‌జోన్ నుంచి వచ్చే బిల్లుల ఆదాయం 60 శాతం వరకు ఉంటుంది.

సర్కిళ్ల వారీగా విద్యుత్ కనెక్షన్లు

● బంజారాహిల్స్ - 4,01,999 ● సికింద్రాబాద్ - 5,34,844 ● మేడ్చల్ - 8,47,835 ● హబ్సిగూడ - 8,98,623 ● హైదరాబాద్ సెంట్రల్ - 6,22,561 ● సైబర్‌సిటీ - 6,63,612 ● సరూర్‌నగర్ - 7,36,200 ● హైదరాబాద్ సౌత్ - 6,79,334 ● రాజేంద్రనగర్ - 6,06,259

గ్రేటర్‌లో 9 సర్కిళ్లలో మూడు నెలల్లో మొత్తం విద్యుత్ బిల్లుల ఆదాయం

● ఫిబ్రవరి - రూ. 687.22 కోట్లు ● మార్చి - 903.81 కోట్లు ● ఏప్రిల్ 1016.92 కోట్లు

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా నిమ్స్‌లో సేవలు

● సాంకేతికతకు పెద్దపీట వేసిన డైరెక్టర్

● స్కిల్ ల్యాబ్ ఏర్పాటు, రోబోటిక్ సర్జరీలతో ముందుకు..

● వేగంగా రోగ నిర్ధారణ, ఆరోగ్యశ్రీ ద్వారా ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు



సనత్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): పేదల ఆస్పత్రిగా పేరుగాంచిన నిమ్స్ వైద్య సేవల్లో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలందిస్తోంది. నిమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బీరప్ప సాంకేతికతకు పెద్దపీట వేయడంతో రోగులకు వేగంగా నాణ్యమైన సేవలందుతున్నాయి. సంక్లిష్టమైన సర్జరీలు నిర్వహించేందుకు అవసరమైన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చారు. గడిచిన కొంతకాలంగా ఆస్పత్రిలో సేవల విస్తరణ, కొత్త బ్లాకుల నిర్మాణం, అధునాతన ల్యాబ్‌లు, రోబోటిక్ సర్జరీలు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స కూడా నిర్వహిస్తున్నారు. కార్డియో, న్యూరో విభాగాల్లో సరికొత్త యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. నిమ్స్‌లో చికిత్స పొందేవారిలో 90శాతం మంది రోగులు ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డులకు సంబంధించిన వారే ఉంటున్నారు.

వైద్యానికి సాంకేతికత దన్ను..

రోజు రోజుకు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న నిమ్స్ రోగులకు మెరుగైన సేవలను అందిస్తోంది. కార్డియో థొరాసిక్ విభాగంలో గంట రమణయ్య కన్‌స్ట్రక్షన్స్ సంస్థ అందించిన నిధులు రూ.2 కోట్లతో ఐసీయూ విభాగాన్ని ఆధునికీకరించారు. డీఎస్ఎ ల్యాబ్‌ను ఆధునికీకరించి, వేగంగా రోగ నిర్ధారణ పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. వైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి నిమ్స్‌లో రూ. 5 కోట్లతో స్కిల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా తెలంగాణలోని 9 కేంద్రాల్లో అత్యవసర చికిత్సలపై అవగాహన, శిక్షణ అందిస్తున్నారు. డయాలసిస్ రోగులకు వైద్యం అందించేందుకు ఆధునిక డయాలసిస్ యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా రోజుకు దాదాపు 400 మంది, నెలకు 10 వేల మందికి డయాలసిస్ చికిత్సను అందిస్తున్నారు.

నిపుణులైన వైద్యులు..

నిమ్స్ ఆస్పత్రిలో ఆర్థో, కార్డియో, నెఫ్రాలజీ, ఆంకాలజీ తదితర విభాగాల్లో నిపుణులైన వైద్యులు సేవలను అందిస్తున్నారు. వారిలో వేలాది సర్జరీలు చేసిన నిమ్స్ డైరెక్టర్‌తో పాటు పలువురు సీనియర్ వైద్యులు కూడా ఉన్నారు. నిమ్స్‌లో ల్యాబ్, ఎక్స్‌రే, స్కానింగ్ తదితర సేవలందించే సిబ్బందితోపాటు అనుభవమున్న నర్సులు పనిచేస్తున్నారు. వైద్యుల పనితీరుతో నిమ్స్‌కు రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరు వచ్చింది. ఆస్పత్రి పరిసరాల్లో శబ్ద, వాయు కాలుష్యాన్ని నివారించేందుకు బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తెస్తున్నారు. వాటిని రోగితోపాటు సహాయకులను ఓపీ, ఇతర బ్లాక్‌ల వద్దకు చేరుస్తున్నారు.



నగరంలోని ట్యాంక్‌బండ్ వద్ద బుధవారం గగనతలంలో గద్ద, విమానం ఒకదానికి ఒకటి పోటీపడ్డట్టుగా విహరిస్తూ 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి..

మీరాలం చెరువులోకి మురుగు రావొద్దు

● మురుగు పైపులైన్లను ఎస్టీపీలోకి మళ్లించాలి

● వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే15 (ఆంధ్రజ్యోతి): మీరాలం చెరువులోకి మురుగునీరు రాకుండా చెరువు చుట్టూ ఉన్న పైపులైన్లను అనుసంధానం చేసి కొత్తగా నిర్మిస్తున్న ఎస్టీపీలోకి మళ్లించాలని వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సమీప కాలనీల నుంచి చెరువులోకి మురుగు చేరే పాయింట్లను గుర్తించిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ, నీటిపారుదల శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ మళ్లింపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో అత్తాపూర్, మీరాలంలో నిర్మిస్తున్న ఎస్టీపీలతో పాటు హసన్‌నగర్‌లో ఉన్న ఐ అండ్ డీలను బుధవారం ఎండీ సందర్శించారు. ముందుగా అత్తాపూర్ ఎస్టీపీకి వెళ్లిన ఆయన నిర్మాణ పనులు పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఇటీవల పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మీరాలం ఎస్టీపీని సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఈడీ డా.ఎం.సత్యనారాయణ, డైరెక్టర్ సుదర్శన్, జీఎం, ఎస్టీపీల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



మీరాలం చెరువును పరిశీలిస్తున్న వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి

పోలింగ్‌పై పోస్టుమార్టం!

» గెలుపోటములపై పార్టీలు బేరీజు

» అంతర్మథనంలో అభ్యర్థులు

» కూడికలు తీసివేతల్లో కార్యకర్తలు

» ఏ వర్గం.. ఎవరికి అండగా నిలిచిందని ఆరా

» ప్రాంతాల వారీగా బలాలు, ప్రతికూలతల పరిశీలన

మేడ్చల్, మే 15(ఆంధ్రజ్యోతి): ఎవరు గెలుస్తారు?.. విజయావకాశాలున్నాయా?.. ఏ వర్గం ఓట్లు ఎవరికి అనుకూలం..? ఇదే ఇప్పుడు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జరుగుతున్న ప్రధాన చర్చ. పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు అంచనాల్లో మునిగి తేలుతున్నారు. పార్లమెంటు పరిధిలోని ఆయా నియోజకవర్గాల వారీగా పోలైన ఓటింగ్ శాతం ఆధారంగా లెక్కలేస్తున్నారు. గెలుపోటముల విషయంలో బేరీజు వేసుకుంటున్నారు. ఓవైపు పైకి గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నా... లోలోపల మాత్రం జూన్ 4న వెలువడే ఫలితాలపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం మొదలుకుని పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్ల తీరును బట్టి ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పడుతాయనే అంచనాలతో లెక్క లేస్తున్నారు. కూడికలు తీసివేతలతో గెలుపు అంతరాన్ని నిర్ణయిస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో వచ్చిన ఎగ్జిట్ పోల్స్ కొంత మందిలో ఆశలు నింపగా మరికొందరిని నిరాశ పరిచాయి.

ఎవరి లెక్కలు వారివే..

జిల్లాలోని మల్కాజిగిరి పార్లమెంటులోని ఏడు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల నాయకులు తమకే విజయావకాశాలున్నాయని చెప్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్లను పరిగణలోకి తీసుకుంటూనే ఈ సారి గ్రామాలు, డివిజన్లలో ఎవరికి ఓట్లు పెరిగాయా.. తగ్గాయా అని విశ్లేషించుకుంటున్నారు. గ్రామాల్లో ఎక్కడా ఇద్దరు కలిసినా.. ఏ నాయకుడిని పలకరించినా ఎవరు గెలుస్తారనే దానిపైనే చర్చ జరుగుతోంది.



ఫోన్లలో సన్నిహితులు, ఇతర కార్యకర్తలను పలకరిస్తూ గెలుపు ఓటముల గురించే ఆరా తీయడం వినిపిస్తోంది. ఏ వర్గం వారు తమకు అనుకూలంగా ఓటు వేసే అవకాశముందని తెలుసుకుంటూనే ఎవరు ప్రతికూలంగా వ్యవహరించారనే విషయాలపై అనుచరులతో ముఖ్య నాయకులు చర్చిస్తున్నారు. ఫలితాల తీరుపై అంచనాలను రూపొందిస్తున్నారు.

త్రిముఖ పోటీ

మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొన్న విషయం విదితమే. ఎవరు ఎవరి విజయావకాశాల్ని దెబ్బతిస్తారనే చర్చ ఊపందుకుంది. ముఖ్యంగా మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు విజయం తమదంటే తమదేనని నాయకులకు భరోసా ఇస్తున్నారు. కార్యకర్తల్లోనూ ధైర్యాన్ని నింపే విధంగా ముఖ్య నాయకులు మాట్లాడుతున్నారు. జూన్ 4వ తేదీ ఫలితాల దాకా వేచి చూద్దామని చెబుతూనే నాయకుల్లో ఆశావాహ దృక్పథాన్ని పెంచుతున్నారు.

ఎక్కడెక్కడ తారుమారు

పోలింగ్ శాతం అనుకున్నంతగా పెరగకపోవడంతో పాటు తగ్గిన పోలింగ్ సరళి ఎవరిని ఇబ్బంది పెడుతుందనే విషయమై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లాలో ఒక్క మేడ్చల్ నియోజకవర్గంలోనే గత ఎన్నికల్లో కంటే కాస్త మెరుగైన ఓటింగ్ పడింది. మిగతా నియోజకవర్గాల్లో పోలింగ్ తగ్గింది. దీంతో అన్ని పార్టీలు ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా నమోదైన ఓట్ల ఆధారంగా లెక్కలేస్తున్నాయి. ఓటింగ్ శాతాన్ని బట్టి తమ అభ్యర్థికి పడే అవకాశమున్న ఓట్లు... ప్రత్యర్థులకు లభించే మద్దతుపై అవగాహనకు వస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీలకు వచ్చిన ఓట్లతో పోలిస్తే ఈసారి మనకు ఎక్కడ బలం పెరిగింది? ఎక్కడ తగ్గిందనే విషయమై అంచనా వేసుకుంటున్నారు. మొత్తంగా ఎవరికి వారుగా విజయావకాశాలపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నప్పటికీ ఈవీఎం బ్యాలెట్‌లో నిక్షిప్తమైన ఓట్లు మాత్రం అసలు గుట్టును జూన్ 4న తేల్చనున్నాయి. దీంతో తుది తీర్పు వెల్లడయ్యే సమయం కోసం అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మృతి

కూకట్‌పల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగుచూసింది. ఎస్సై ప్రేమ్‌సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.... కూకట్‌పల్లి జాతీయరహదారిలోని మూసాపేట చౌరస్తా సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి(55) మృతిచెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనాస్థలానికి పోలీసులు వచ్చి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలియలేదని, అనారోగ్యంతో చనిపోయి ఉంటాడని పోలీసులు తెలిపారు. అదేవిధంగా ఖైతలాపూర్ సమీపంలో సుమారు 45ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందడంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఇద్దరి మృతిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హబీబ్‌నగర్‌లో దొంగల బీభత్సం

● రెండు ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీ

● 15.5 తులాల బంగారం, 5.70లక్షల నగదు అపహరణ

హైదరాబాద్ సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. రెండు వేర్వేరు ఇళ్లలోకి చొరబడిన దొంగలు తాళాలు పగులగొట్టి 15.5 తులాల బంగారం, 5.70లక్షల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హబీబ్‌నగర్ పరిధిలో రెక్కీ చేసిన దొంగలు తాళం వేసిన ఇళ్లను గుర్తించారు. అలా రెండు ఇళ్లను గుర్తించి చోరీకి పథకం వేశారు. చాకచక్యంగా ఇంట్లోకి చేరుకొని తాళాలు పగలగొట్టారు. ఒక ఇంట్లో 12 తులాల బంగారం, రూ. 3లక్షల నగదు, మరో ఇంట్లో 3.5 తులాల బంగారం, 2.70లక్షల నగదు ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఇంటి యజమానులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న హబీబ్‌నగర్ పోలీసులు క్లూస్‌టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి టెక్నికల్ ఆధారాలు సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామని హబీబ్‌నగర్ పోలీసులు తెలిపారు.

కుక్క మొరిగిందని భార్యాభర్తలపై దాడి

యూసుఫ్‌గూడ, మే 15 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్క మొరిగిందని తన తమ్ముడిని, మరదలును, కుక్కను హత్య చేయబోయారంటూ ఓ వ్యక్తి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెహ్మత్‌నగర్‌లో నివాసం ఉండే ఎస్.శ్రీనాథ్ అతని భార్య స్వప్న ఈనెల 8న ఉదయం పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి తన పెంపుడు కుక్కతో ఇంటి నుంచి బయలుదేరారు. అదే సమయంలో ఇంటి పక్కన ఉన్న ధనంజయ్ తన కుక్కతో రోడ్డుపై ఉన్నాడు. ఆ సమయంలో శ్రీనాథ్ కుక్క వారిని చూసి మొరిగింది. దీంతో శ్రీనాథ్, స్వప్నను ధనంజయ్ దుర్భాషలాడాడు. ఈ విషయంపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తిరిగి ఈ నెల 14న సాయంత్రం శ్రీనాథ్ కుక్కతో బయటకు రాగా ధనుంజయ్‌తో పాటు మరో నలుగురు వ్యక్తులు వచ్చి శ్రీనాథ్‌ను, అతడి భార్యను, మేనల్లుడు, మేనకోడలును, కుక్కను చంపుతామని బెదిరిస్తూ కర్రలు, రాడ్‌లతో తీవ్రంగా కొట్టారు. దీంతో శ్రీనాథ్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా మిగిలిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీనాథ్ సోదరుడు ఎస్.మధు మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఎల్.మధుతో పాటు మరో నలుగురిపై హత్యయత్నం కేసు పెట్టాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల ఫలితాలపై జోరుగా బెట్టింగులు

» గుట్టుగా పందేలు కాస్తున్న నాయకులు

యాచారం, మే 15 : సార్వత్రిక ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు గుట్టుగా పందేలు కాస్తున్నారు. తమ పార్టీనే విజయం వరిస్తుందని బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గట్టి ధీమాతో ఉన్నారు. తమదంటే తమదే విజయం అని, మెజార్టీ కోసమే చూస్తున్నామని చెబుతున్నారు. యాచారం మండలంలోని బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జోరుగా బెట్టింగులు కాసేందుకు సిద్ధమయ్యారు. మండలంలో బీఆర్ఎస్‌కు చెందిన వారు బీజేపీకి క్రాస్ ఓటింగ్ చేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు బాహాటంగానే బీజేపీకి ప్రచారం చేశారని సమాచారం. చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, చింతపట్ల, మాల్, కొత్తపల్లి, యాచారం, నజ్దిక్‌సింగారం, నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు పోలింగ్ రోజున కేంద్రాల సమీపంలో పెద్దగా కనిపించలేదు. భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్‌నే విజయం వరిస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమాతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థికి బీసీలు ఓటు వేయలేదనే ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ మూడో స్థానంతో సరిపెట్టుకుంటుందని పలువురు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

కౌన్సెలింగ్

ఎప్పుడు నడవాలంటే..

నా పేరు భవాని. నాకు 35 ఏళ్లు. నాకు వ్యాయామం పట్ల.. ముఖ్యంగా నడక పట్ల చాలా ఆసక్తి ఉంది. ఏ సమయంలో నేను నడిస్తే మంచిది? దీని వల్ల నాకు ఎలాంటి ఫలితాలు లభిస్తాయి?

ఉదయాన్నే లేచి నడిస్తే మంచిదా? లేక సాయంత్రాలు మంచిదా? అనే ప్రశ్నపై చాలా కాలంగా చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ఆరోగ్య నిపుణులలో ఏకాభిప్రాయం లేదు. శరీర తత్వం, జీవన శైలి, ఆహారపు అలవాట్ల ఆధారంగా ఎప్పుడు నడవాలి అనే విషయాన్ని నిర్ణయించుకోవాలి. అయితే నడక వల్ల శారీరకంగా కానీ మానసికంగా కానీ ఒత్తిడి పెరగకూడదు. ఆరోగ్య నిపుణుల అధ్యయనాల ప్రకారం చూస్తే- సాయంత్రాలు నడిస్తే- శరీరం ఎక్కువగా అలసిపోతుంది. అంతే కాకుండా పట్టణాలలో వాయుకాలుష్యం ఉదయం కన్నా సాయంత్రాలు తక్కువ ఉంటుంది. అందువల్ల పట్టణాలలో ఉన్నవారు ఉదయాన్నే లేచి నడిస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. అయితే కొందరు నిపుణులు మాత్రం- నడకను మన జీవితంలో విడదీయరాని భాగంగా మార్చుకోవాలని సలహా ఇస్తున్నారు. సమయం చిక్కినప్పుడు అటూ ఇటూ నడుస్తూ ఉండటం వల్ల కేలరీలు కరుగుతూ ఉంటాయి.

మందులు వేసుకొనేవారు..

సాధారణంగా మనకు ఉదయం బీపీ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల బీపీ మందులు వేసుకొనేవారు ఉదయం ఎక్కువగా నడవకూడదు. అంతే కాకుండా చాలా మంది ఉదయాన్నే ఐదు గంటలకే లేచి నడక ప్రారంభిస్తారు. దీని వల్ల శరీరం అలసిపోతుంది కానీ ఉదయ సూర్యరశ్మి నుంచి వచ్చే డి విటమిన్ లభించదు. ఇదే విధంగా సూర్యుడు అస్తమించటం ప్రారంభించిన తర్వాత నడిస్తే మంచిది. దీని వల్ల సూర్య రశ్మి నేరుగా శరీరంపై పడదు.



ఎవరు ఎంత నడవచ్చు

మహిళలు	అడుగులు
30-40 ఏళ్లు	12 వేలు
40-50 ఏళ్లు	11 వేలు
50-60 ఏళ్లు	10 వేలు
60 ఏళ్లు దాటితే	8 వేలు

పురుషులు	అడుగులు
18-50 ఏళ్ల వరకు	12 వేలు
50 ఏళ్లు దాటిన వారు	11 వేలు



ఎంత నడవాలి?

రోజుకు ఐదు వేల అడుగులు(సుమారు 3.5 కిలోమీటర్లు) వేస్తే జీవనశైలి వచ్చే జబ్బులు రావు. పది వేల అడుగులు (సుమారు ఏడు కిలోమీటర్లు) వేయగలిగితే బీపీ, మధుమేహం వంటి జబ్బులు దరిచేరవు. ఇక పిల్లల విషయానికి వస్తే వారు రోజుకు గంట నుంచి గంటన్నర సేపు ఆడితే ఎక్కువగా ప్రయోజనం ఉంటుంది.

పరుగా? నడకా?

పరుగులో రెండు రకాలు ఉంటాయి. ఒక మాదిరి వేగంతో నడిస్తే దానిని జాగింగ్ అంటారు. నిపుణుల లెక్కల ప్రకారం- గంటకు ఆరు కిలోమీటర్ల లక్ష్యాన్ని చేరగలిగితే దానిని జాగింగ్ అంటారు. అంత కన్నా ఎక్కువ వేగంగా నడిస్తే అది పరుగు కేటగిరిలోకి చేరుతుంది. చెడు కొలస్ట్రాల్ ఎక్కువ ఉన్నవారు, ఆస్మా ఉన్నవారు జాగింగ్ చేస్తే మంచిది. దీని వల్ల శరీరంలో రక్తప్రసారం పెరుగుతుంది. ఎండోమార్ఫిన్స్ ఉత్పత్తి వేగవంతమవుతుంది. వీటి వల్ల మనసు తేలికపడుతుంది. ఆనందకరమైన ఆలోచనలు వస్తాయి. అయితే బరువు తగ్గాలనుకొనేవారు జాగింగ్ చేస్తే మంచిది. పది వేల అడుగులు జాగింగ్ చేస్తే 500 నుంచి 700 కేలరీలు కరుగుతాయి. పది వేల అడుగులు నడిస్తే 350 నుంచి 500 కేలరీలు కరుగుతాయి

ఆయన కుంచె నుంచి జాలువారిన ప్రతి చిత్రం అపురూపమే. పురాణేతిహాసాల పాత్రలకు, చారిత్రక పురుషులకు, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలకు కాన్వాసుపై రూపమిచ్చిన కళాస్రష్ట. చిత్రకళలో తెలుగునేల ఖ్యాతిని ఖండాంతరాలకు విస్తరింపజేసిన ప్రఖ్యాత చిత్రకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండపల్లి శేషగిరి రావు శతజయంతి సంవత్సరం ముగిసింది. ఈ సందర్భంగా శేషగిరిరావు జీవన రేఖల గురించి ఆయన కోడలు కొండపల్లి నీహారిణి 'నవ్య'తో సంభాషించారు...





మామయ్య... కుంచెతో చరిత్ర రాశారు

"మా నాన్న పెండ్యాల రాఘవరావు సామ్యవాద భావజాలానికి నిబద్ధుడు. మా మామయ్య కొండపల్లి శేషగిరిరావు నిత్యం భగవన్నామ స్మరణతో చిత్రకళకు అంకితమైన మహనీయుడు. దృక్పథాలు వేరైనా, సాటి మనుషుల పట్ల ప్రేమగా మెలగడం వారి నైజం. నాన్న నాస్తికుడైనా, మామయ్య ఆస్తికుడైనా... ఇతరుల అభిప్రాయాలను, విశ్వాసాలను గౌరవించడంలో మాత్రం ఇద్దరిదీ ఒకటే పంథా. అదే వారిని మొదట స్నేహితులను, ఆ తరువాత వియ్యంకులను చేసింది. శేషగిరిరావుగారిది ఆదర్శవివాహం. మా నాన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బంధు, మిత్రుల ఇళ్లకు వెళ్లి... అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రచారం చేసేవారు. ఒకసారి నర్సంపేట వెళ్లినప్పుడు... తొమ్మిదేళ్లకే వితంతువు అయిన కమలా దేవి అనే బాలికను చూసి చలించిపోయారు. ఆ అమ్మాయికి తన స్నేహితుడైన కొండపల్లి శేషగిరిరావుతో వివాహం జరిపించాడు. 1945లో వితంతు వివాహం చేయడమంటే మాటలా! అది ఆనాడు ఒక పెద్ద సంచలనం. ఒకవైపు కుటుంబం, మరోవైపు సమాజం నుంచి వచ్చిన ఒత్తిళ్లను ఎదిరించి నిలవడం సాధారణ విషయం కాదు. సంఘ సంస్కరణ భావాల పునాదిగా ఒక్కటైన కమలాదేవి, శేషగిరిరావు దంపతుల ఇంటికి తర్వాత నేను మూడో కోడలుగా వెళ్లాను. ఆదర్శ వివాహంతో ఒక్కటైన మా అత్త, మామ చివరివరకు అన్యోన్యంగా జీవించారు.

నా చదువు కోసం కొట్లాడారు..

మామయ్యకు మహిళలంటే ఎనలేని గౌరవం. పెళ్లి అయ్యాక భార్యను చదువుకోమని ప్రోత్సహించారు. అలా మా అత్తమ్మతో పాటు పల్లా దుర్గయ్య గారి భార్య, బిరుదు రాజు రామరాజుగారి భార్య కలిసి ఆంధ్ర సారస్వత పరిషత్‌లో హిందీ ప్రాథమిక వరకు చదివారు. మా అత్తమామలకు ఆరుగురు మగపిల్లలు, ఒక అమ్మాయి. మా ఆరుగురు కోడళ్లనూ కూతురుతో సమానంగా చూశారు. కాకతీయ యూనివర్సిటీలో బీఏ రెండవ సంవత్సరం పూర్తయిన వెంటనే నాకు పెళ్లి అయింది. మరుసటి ఏడాది హైదరాబాద్‌లో చదువు కొనసాగిద్దామని మైగ్రేషన్ సర్టిఫికెట్ అడిగితే ఇవ్వడం కుదరదన్నారు. ఆ సంగతి తెలిసి మామయ్య ఉద్యోగానికి సెలవు పెట్టి, కాకతీయ యూనివర్సిటీకి వెళ్లి, కొట్లాడి మరీ ఆ సర్టిఫికెట్ తీసుకొచ్చారు. ఆయనే స్వయంగా నన్ను రెడ్డి ఉమెన్స్ కాలేజీలో చేర్పించారు. డిగ్రీ చివరి సంవత్సరం ఫలితాల్లో సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నా నెంబరు మొదట పేపర్లో కనిపించలేదు. ఆ సమయంలో నేను కాన్పు కోసం చిన్నపెండ్యాలలోని మా పుట్టింట్లో ఉన్నాను. "జీవితంలో ఆటుపోట్లు సహజం. ఈ సమయం పోతే తిరిగిరాదన్నది అవాస్తవం. మళ్లీ మనం సమయాన్ని చేజిక్కించుకోవచ్చు. పరీక్షలో ఫెయిల్ అయినంత మాత్రాన అధైర్యపడకు. ముందు మరెన్నో అవకాశాలు ఉంటాయి" అని నాకు ధైర్యం చెబుతూ మామయ్య ఉత్తరం రాశారు. ఇది ఆయన మంచితనానికి నిదర్శనం. నన్ను సొంతబిడ్డలా ఆదరించిన మామయ్య జీవిత చరిత్రను 2009లో 'చిత్రకళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరి రావు' పేరుతో రాశాను. అది చదివి ఆయన చాలా సంతోషించారు.

శాంతినికేతన్‌లో చదువు...

సంప్రదాయ కుటుంబంలో పుట్టిన మామయ్య కడు పేదరికాన్ని అనుభవించారు. ఆయన తల్లి రామచూడమ్మ... బంధువుల ఇళ్లల్లో వంటచేసి తన కొడుకును చదివించారు. మామయ్యకు ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. అయినా, పరమత సహనానికి ప్రతీక ఆయన జీవితం. చిన్నతనంలో మజరుద్దీన్ మాస్టారి ప్రోత్సాహంతో 1937లో ముంబాయిలో డ్రాయింగ్ హయ్యర్‌గ్రేడ్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించారు. నిజాం రాజ్యంలోని 'స్కూల్ ఆఫ్ ఆర్ట్' (ఇప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం)లో చదివేందుకు మొదట అవకాశం లభించలేదు. అప్పుడు మా నాన్నతో పాటు మందుముల నర్సింగరావు, వట్టికోట ఆళ్వారు స్వామి ఆయనను నిజాం రాష్ట్ర పాలనాధికారి మెహదీనవాజ్ జంగ్ దగ్గరికి తీసుకెళ్లారట. అతను మా మామయ్యను స్వయంగా 'స్కూల్ ఆఫ్ ఆర్ట్'కు కారులో తీసుకువెళ్లి మరీ చేర్పించారట. రవీంద్రనాథ్ ఠాగూర్‌లాంటి ప్రఖ్యాత వ్యక్తులు విడిది చేసిన మెహదీ నవాజ్ జంగ్ ఇంట్లో కొన్నాళ్ళు శేషగిరిరావు గారికి ఆశ్రయం ఇచ్చారు. నవాబు గారి భార్య తనను సొంత తల్లిలా ఆదరించారని మామయ్య చెబుతుండేవారు. ఐదేళ్ల కోర్సు పూర్తయిన తర్వాత మెహదీ సాబ్ సూచనతో 1947లో శాంతినికేతన్‌లో చేరారు. అక్కడ నందలాల్‌బోసుగారి లాంటి మహనీయుల శిష్యరికం ఆయన గొప్ప చిత్రకారుడిగా రూపొందడానికి తొలి అడుగు అయింది. ఏడాది తర్వాత తిరిగి హైదరాబాద్ వస్తుండగా రైల్లో మామయ్యమీద రజాకార్ల మూక దాడిచేయబోతే... అందులోని మీర్జా అనే కుర్రాడు గుర్తుపట్టి వదిలేయమన్నారట. అలా మామయ్యది భిన్న దృక్పథాలు, విభిన్న విశ్వాసాలతో కలగలిసిన జీవితం.

ఆ కుంచె నుంచి కొన్ని వేల చిత్రాలు...

కొండపల్లి శేషగిరిరావుగారు కొన్ని వేల చిత్రాలు గీశారు. కాకతీయ రాజు గణపతి దేవుడు, రాణీ రుద్రమ, పల్నాటి బ్రహ్మనాయుడు లాంటి చారిత్రక వ్యక్తులు, శకుంతల, వరూధిని, దమయంతి లాంటి ఇతిహాస వ్యక్తుల చిత్రాలు, పోతన వంటి ప్రాచీన కవుల రూపాలు మా మామయ్య కుంచె నుంచి జాలువారాయి. హైదరాబాద్ నగర చుట్టుపక్కల ఇవాళ కానరాని అత్యంత అద్భుతమైన రాళ్ళ గుట్టలను యాభై ఏళ్ళ కిందటే 'సేవ్ రాక్' పేరుతో కాన్వాస్ మీద ఆయన బంధించారు. 'కాకి పడగలు' పట చిత్రాలను వెలుగులోకి తెచ్చారు. భారత స్వాతంత్ర్యోద్యమ, నిజాం వ్యతిరేక పోరాట ఘటనలకు దృశ్యరూపమిచ్చారు. రామాయణ, భాగవత, మహాభారత ఘట్టాలను చిత్రీకరించారు. తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు తల్లికి రూపమిచ్చారు. వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయంలో ప్రదర్శనకు ఉంచిన టంగుటూరి ప్రకాశం పంతులు నిలువెత్తు తైలవర్ణ చిత్రం శేషగిరిరావు గారు గీసిందే. రామప్ప దేవాలయంలోని శిల్పకళా వైభవాన్ని కాన్వాసు మీద గీసిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. ఇలా ఒకటా, రెండా... మామయ్య గీసిన ప్రతి చిత్రం చారిత్రకమైనదే. ఆయన తన కుంచెతో చరిత్ర రాశారు. ఎన్నో అంశాలను రంగుల్లో నిక్షిప్తం చేశారు.

చిత్రకళకే జీవితం అంకితం

మామయ్య చిత్రకళ పట్ల నిబద్ధత, సమాజంపట్ల బాధ్యత కలిగిన గొప్ప చిత్రకారుడు. తను చదివిన కళాశాలలోనే 1952లో అధ్యాపకుడిగా చేరారు. ముప్పై ఏళ్లకుపైగా బోధనారంగంలో సేవలందించి, లక్ష్మాగౌడ్, బి. నరసింగరావు, వైకుంఠం, సూర్యప్రకాశ్, సురభి వాణీదేవి లాంటి ప్రియ శిష్యులను సంపాదించుకొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం... చనిపోవడానికి అంటే 2012కు నాలుగేళ్ల ముందు వరకు పూర్తిగా చిత్రలేఖనానికే అంకితమయ్యారు. కాగితం కనిపిస్తే బొమ్మ గీసేవారు. అంతగా ఆర్ట్‌లో నిమగ్నమయ్యారు. అలాంటి గొప్ప చిత్రకారుడి సేవలను గుర్తించి... చరిత్రలో ఆయనకు ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వకపోవడం బాధాకరం. మామయ్య పేరుతోనూ అవార్డు నెలకొల్పుతామని తొమ్మిదేళ్ళ కిందట ఒక మంత్రి ప్రకటించారు. ఇంతవరకు అది కార్యరూపం దాల్చలేదు. శతజయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించలేదు. తెలంగాణకే కాదు తెలుగు చిత్రకళకు వన్నెతెచ్చిన కొండపల్లి శేషగిరిరావు గారి కళాసేవకు తగిన గుర్తింపు దక్కాలన్నదే మా అభిలాష."

• సాంత్వన్

ఫొటోలు - రాజ్‌కుమార్



గోదాదేవి

జపాన్ చిత్రకారిణి అభిమానం...

ప్రసిద్ధ జపాన్ చిత్రకారిణి ఫుకా ఆకినో ఒకసారి భారతదేశ సందర్శనకు వచ్చారు. ఆమె నాగార్జున కొండను చూడాలనుకున్నప్పుడు "అయితే హైదరాబాద్‌లోని కొండపల్లి శేషగిరిరావుగారిని కూడా కలుసుకోండి" అని కోల్‌కతాలోని మిత్రులు సూచించారట. అలా ఆమె మా ఇంటికి వచ్చారు. మామయ్యగారు గీసిన వర్ణచిత్రాలు, రేఖాచిత్రాలన్నింటినీ చూసి... తన్మయత్వంతో భారతీయుల పద్ధతిలో మామయ్యకు తలవంచి నమస్కరించారు. బురదలో పొర్లాడుతున్న పందుల చిత్రంతో పాటు నల్లపిల్లి పెయింటింగ్‌ను పేరున్న ఒక కన్నడ చిత్రకారుడు అడిగి మరీ తీసుకున్నారు. 'చనిపోయిన అవ్వకన్నును పొడుస్తున్న కాకి బొమ్మ' లాంటి కొన్ని చిత్రాల ద్వారా ఆయన మానవ స్వభావాన్ని కూడా ఎత్తిచూపారు. శిల్పకళ మీద లోతైన అధ్యయనంతో రాసిన వ్యాసాలను 'చిత్రశిల్ప కళారామణీయకము' పేరుతో పుస్తకంగా ప్రచురించారు. ఊరూరా తిరిగి, వాకిళ్లలో మహిళలు వేసే రకరకాల ముగ్గులను సేకరించారు. ముగ్గుల చరిత్రను, వాటి విశేషాలను 'రూపరుచి' పేరుతో రాశారు. దీన్ని త్వరలోనే పుస్తకంగా తీసుకొస్తాం.

ఆ గుర్తింపు ఇచ్చేది లేదన్నారు

కొండపల్లి శేషగిరిరావు గారు, స్వాతంత్ర్య సమరయోధుడు హీరాలాల్ మోరియా కలిసి వార్ధా వెళ్లి... మహాత్మాగాంధీని కలిశారు. "ఈ దేశ యువతగా స్వాతంత్ర్యోద్యమంలో మీరు భాగం కావాలి" అంటూ బాపూజీ వారికి ఉపదేశించారు. ఆ స్ఫూర్తితో ప్రతినిరసన కార్యక్రమంలోనూ మామయ్య పాల్గొన్నారు. ఒక దశలో ఆయన చిన్నమ్మ కుమారుడు చకిలం యాదగిరిరావు ఆచూకీ చెప్పమని పోలీసులు నిర్బంధించి మరీ హింసించినా, మామయ్య నోరు మెదపలేదు. నిజాం దాష్టీకాలను ఎండగడుతూ కార్టూన్లు గీశారు. అయితే, ప్రస్తుతం రెండు మాత్రమే మిగిలాయి. ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులను గుర్తిస్తున్న క్రమంలో... కొండపల్లి శేషగిరిరావు గారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నట్టు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు రెండూ సర్టిఫికేట్లు ఇచ్చాయి. ఇరుపార్టీలు ఎలా ఇస్తాయంటూ ప్రభుత్వ అధికారులు మొదట మామయ్య పేరును గుర్తింపు జాబితా నుంచి పక్కనపెట్టారు. "కళాకారులకు సామాజిక ప్రయోజనాలే ముఖ్యం కానీ రాజకీయ పార్టీలతో సంబంధం ఉండదు" అని దీటుగా బదులిచ్చారు మామయ్య. తర్వాత ప్రభుత్వం ఆయనను స్వాతంత్ర్య సమరయోధుడిగా గుర్తించింది.



వరూధినీ ప్రవరాఖ్య

మదారి

శకుంతల

కేన్స్ ఎర్ర తివాచీ పరిచింది

ఒళ్లంతా తెల్ల మచ్చలు... బయటకు వెళితే వింత చూపులు... బాల్యం ఆటపాటలతో కాకుండా... అవహేళనలు అవమానాలతో గడిచింది. బాధను దిగమింగుకుని... ఆ హేళనలనే స్ఫూర్తిగా మలుచుకుని... ఆత్మవిశ్వాసంతో నిలబడింది. కంటెంట్ క్రియేటర్‌గా లక్షల మందికి చేరువై... ఎందరికో ప్రేరణగా మారింది. ఇప్పుడు ప్రతిష్టాత్మక 'కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్' రెడ్ కార్పెట్‌పై మెరిసే తొలి విటిలిగో భారతీయురాలిగా చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతున్న ఆస్థా షా జర్నీ ఇది...

'నేను నేనులా ఉంటా'... ఇది ఆస్థా షా చెప్పే మాట. ఎవరికో భయపడి, ఇంకెవరో ఏదో అనుకొంటారని ఒళ్లంతా కప్పుకొని తిరగడం తనవల్ల కాదంటుంది ఈ ముంబయి భామ. అయితే ఇప్పుడు పరిస్థితులు ఒకప్పటిలా కాదని... ఫ్యాషన్ పరిశ్రమ తనలాంటివారికి కూడా ర్యాంప్‌పై నడిచే అవకాశాలు కల్పిస్తోందని అంటుంది. అందుకు తననే ఒక ఉదాహరణగా చెబుతోంది 26 ఏళ్ల ఆస్థా. ఇంట్లో దేనికీ లోటు లేకపోయినా... ఆమె జీవితం పూల పాన్పు కాదు. అడుగు బయట పెడితే చాలు... చులకన చేసే మాటలు... ఉచిత సలహాలు. వినీ వినీ విసుగెత్తిపోయింది. రోదనలతో నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపింది. అమ్మానాన్నల అండతో తిరిగి మనిషి అయింది.

డిజిటల్ కంటెంట్ క్రియేటర్ అయిన ఆస్థా షా పేరు రెండేళ్ల కిందట బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. విటిలిగో (తెల్ల మచ్చలు)తో తాను చేస్తున్న పోరాటం... భావోద్వేగాలతో నిండిన తన నిత్య జీవితాన్ని నెటిజనులతో ఆమె పంచుకుంది. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో లక్షల మందిని కదిలించింది.

మందులతో ఫలితం లేక...

ఆస్థానా తనకున్న దీర్ఘకాలిక చర్మ వ్యాధికి ఊహ తెలియకముందు నుంచీ చికిత్స తీసుకొంటోంది. కానీ ఏదీ ఫలితం ఇవ్వలేదు. 'అల్లోపతి, హోమియోపతి, నేచురోపతి... అన్ని రకాల మందులూ వాడాను. గుళ్లు, గోపురాలు తిరిగాను. గ్రామాలకు వెళ్లి బాబాలను కలిశాను. ఏదీ పని చేయలేదు. నా ఒంటిపై తెల్ల మచ్చలు పెరుగుతున్నాయే కానీ ఏ మాత్రం తగ్గుముఖం పట్టలేదు. దీంతో ఆరేళ్ల తరువాత మందులు వాడడం మానేశాను. విటిలిగో అనేది పెరగవచ్చు... లేదా తగ్గవచ్చు. అది శరీర తత్వం మీద ఆధారపడి ఉంటుంది. దానికి మందు లేదు. వైద్యం తీసుకున్నన్ని రోజులూ నరకం చూశాను. చాక్లెట్లు, పుల్లని పదార్థాలు, శీతల పానీయాలు... ఏవీ తినలేకపోయాను. ఎండలో తిరగలేకపోయాను. నా బాల్యాన్ని పూర్తిగా కోల్పోయాను. ఎప్పుడైతే మందులు ఆపేశానో... ఇక అప్పటి నుంచి నా జీవితాన్ని నేను జీవించడం మొదలుపెట్టాను' అంటూ చిన్ననాటి రోజులు గుర్తు చేసుకుంది ఆస్థా షా.

ఆమే నాకు స్ఫూర్తి...

"నేను రోడ్డు మీదకు వెళితే కొంతమంది నా ముఖంకేసి వింతగా చూస్తారు. ఒళ్లంతా కప్పుకోమని మరికొందరు సలహాలిస్తారు. అందుకని గడప దాటకుండా ఇంట్లోనే బందీగా ఉండలేముగా! ఆ వింత చూపులు, ఉచిత సలహాలే నాకు ప్రేరణగా మలుచుకున్నా. అలాంటి ఘటనలు ఎదురైన ప్రతిసారీ మరింత కసితో నా లక్ష్యం వైపు పరుగులు పెట్టడం అలవాటు చేసుకున్నా. నాలో ఇంతటి స్ఫూర్తిని, ధైర్యాన్ని నింపింది ఎవరో కాదు... కెనడియన్ మోడల్ విన్నీ హార్లో. 'విక్టోరియాస్ సీక్రెట్ ఫ్యాషన్ షో-2016'లో క్యాట్‌వాక్ చేసిన మొట్టమొదటి విటిలిగో మోడల్‌గా విన్నీ చరిత్ర సృష్టించింది. అది చూపించి మా నాన్నకు చెప్పాను... 'విన్నీలా నేను కూడా ఏదోఒక రోజు ర్యాంప్‌పై నడుస్తా'నని. విన్నీతో పోలిస్తే నా పరిస్థితి భిన్నమైనది. ఇప్పుడు మచ్చలు నా ఒళ్లంతా వ్యాపించేశాయి. కానీ విన్నీ ఏనాడూ తన మచ్చలను దాచే ప్రయత్నం చేయలేదు. ఆమె ఆమెలా జీవించడానికే ఇష్టపడుతుంది. ఆ అంశమే నన్ను బాగా ఆకట్టుకుంది. నా మీద నాకు ప్రేమ కలిగించింది" అంటుంది ఆస్థా.

కలలో కూడా ఊహించనిది...

కెనడియన్ ఫ్యాషన్ మోడల్ అయిన విన్నీ షా 2018లో 'కేన్స్' రెడ్ కార్పెట్ మీద నడిచింది. అప్పట్లో అదొక సంచలనం. ఎందుకంటే అక్కడ మెరిసిన తొలి విటిలిగో సెలబ్రిటీ విన్నీ. అదే బాటలో ఆస్థా షా నడుస్తోంది. ఈ నెల 19న 'కేన్స్' ఎర్ర తివాచీపై ఆమె హొయలు ఒలికించేందుకు సిద్ధమవుతోంది. తద్వారా ఆ వేదికపై క్యాట్‌వాక్ చేసిన తొలి విటిలిగో భారతీయురాలిగా చరిత్ర సృష్టించనుంది. ఈ అవకాశం తనకు రావడంపట్ల ఆస్థా ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అదే సమయంలో ఒకింత గర్వంగానూ భావిస్తోంది. "ఇది నిజమేనా! ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. కలలో కూడా ఊహించనిది. ఆ ఉత్సవానికి ఏ డ్రెస్ వేసుకోవాలో నిర్ణయించుకోలేకపోతున్నా. అయితే నాకు సాయం చేయడానికి చాలామంది డిజైనర్లు ముందుకు వస్తున్నారు. 'కేన్స్'లో విన్నీలా నేను కూడా పూర్తి ఆత్మవిశ్వాసంతో కనిపించాలని కోరుకొంటున్నా. ఏదిఏమైనా నాకు వచ్చిన అద్భుత అవకాశం ఇది. నాలాంటి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనుకొంటున్నా. రెడ్ కార్పెట్ మీదకు వెళ్లగానే 'విన్నీ... నీవల్లే ఇవాళ నేను ఇక్కడ ఉన్నాను' అని బిగ్గరగా అరిచి చెప్పాలని ఉంది. 'డాల్మేషన్ డాగ్‌లా ఉన్నావని' నన్ను హేళన చేసినవారికి 'ఇది నేను సాధించిన విజయం. మనిషి ఆకారాన్ని, లోపాలను కాదు... అతడిలోని ప్రతిభను గుర్తించండి' అనే సందేశం ఇవ్వాలనుకొంటున్నా. 'కేన్స్'కు పయనమవుతున్న వేళ ఇలా నాలో ఎన్నో ఆలోచనలు, అంతర్మథనాలు" అంటూ తన అంతరంగాన్ని పంచుకుంది ఆస్థా షా.



వాళ్లే నా బలం

'కేన్స్' రెడ్ కార్పెట్ మీద కనిపించనున్న ఆస్థా షాకు సామాజిక మాధ్యమాల్లో లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె తరచూ రీల్స్ పోస్ట్ చేస్తుంటుంది. కొన్ని బడా బ్రాండ్లకు ప్రచారకర్తగా కూడా వ్యవహరిస్తోంది. 'సామాజిక మాధ్యమాల్లోకి వచ్చాకే నేనేంటో అందరికీ తెలిసింది. చాలామంది నాలోని లోపాన్ని కాకుండా... కంటెంట్ క్రియేటర్‌గా నాలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. మొట్టమొదటి వీడియో పోస్ట్ చేశాక... 'ఈ సమాజంలో ఎలా నెట్టుకొస్తున్నావ'ని కొందరు అడిగారు. నా కథ విని ఎందరో చలించారు. అలాంటి మాటలు నాలో ఉత్తేజాన్ని కలిగిస్తాయి' అంటున్న ఆస్థా షా ఇప్పుడు ఎంతోమందికి ప్రేరణ అయ్యారు.


ఏది నిజమైన ఐస్‌క్రీమ్?



వేసవిలో ఐస్‌క్రీమ్‌లకు మంచి డిమాండ్ ఉంటుంది. రాత్రి బయటకు వెళ్లి ఐస్‌క్రీమ్‌లు తినే వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. అయితే చాలా సందర్భాలలో ఐస్‌క్రీమ్‌లుగా విక్రయించే ఫ్రోజెన్ డిజర్ట్‌లలో పాలే ఉండవు. వీటిని పామ్ ఆయిల్, చక్కెర, మిల్క్ పౌడర్‌లతో తయారుచేస్తారు. అందువల్ల నిజమైన ఐస్‌క్రీమ్‌ని ఎలా గుర్తించాలో తెలుసుకుందాం.

- ఐస్‌క్రీమ్ ప్యాక్ మీద నీళ్లు, మిల్క్ సాలిడ్స్, పామ్ ఆయిల్, లిక్విడ్ గ్లూకోజ్, సోయా ప్రొటీన్ మొదలైనవి ఉంటే అది పాలతో తయారుచేసిన ఐస్‌క్రీమ్ కాదు. అందుకే వీటిని ఫ్రోజెన్ డిజర్ట్‌గా పిలుస్తారు. దీనిలో ఉండే పామ్ ఆయిల్ వల్ల శరీరంలో చెడు కొలస్ట్రాల్ పెరుగుతుంది. రక్తనాళాలు పూడుకుపోతాయి. లిక్విడ్ గ్లూకోజ్ వల్ల శరీరంలో షుగర్ స్థాయిలు విపరీతంగా పెరుగుతాయి. అంతే కాకుండా దీనిలో టెట్రాజైన్ అనే కృత్రిమ కలరింగ్ ఏజెంట్‌ను ఉపయోగిస్తారు. దీని వల్ల కొందరికి ఎలర్జీలు వస్తాయి. మరి కొందరికి రకరకాల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి.
- అసలైన ఐస్‌క్రీమ్- ఫ్రోజెన్ డిజర్ట్‌ల మాదిరిగా మృదువుగా ఉండదు. దీనిలో పాలు, పంచదార, ఇతర సహజసిద్ధమైన డ్రైఫ్రూట్స్‌ను ఉపయోగిస్తారు. అయితే వీటిలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల తక్కువ కేలరీలు కావాలనుకొనేవారు ఫ్రోజెన్ డిజర్ట్‌లను తినటం మంచిది. మధుమేహం, బీపీ వంటి సమస్యలు ఉన్నవారు ఐస్‌క్రీమ్‌లు, ఫ్రోజెన్ డిజర్ట్‌లను తినకపోవటం మంచిది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 16 మే 2024
cinema@andhrajyothy.com



వినోదానికి తెర

• నెలాఖరు దాకా సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూత

పరీక్షల సీజన్,. ఇండియన్ ప్రీమియర్ లీగ్, సార్వత్రిక ఎన్నికలు.. ఇలా అన్నీ ఒకేసారి రావడంతో థియేటర్లకు వెళ్లే జనమే కరువయ్యారు. మినిమం ఆక్యుపెన్సీ కూడా లేకపోవడంతో నష్టాలను తట్టుకోలేక కొన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లు దాదాపు రెండు వారాల పాటు మూతపడనున్నాయి. పెద్ద సినిమాలేవీ ఇప్పట్లో లేకపోవడం, చిన్న సినిమాలను చూసేందుకు ప్రేక్షకుడు ఆసక్తి చూపకపోవడం వల్ల రోజురోజుకీ థియేటర్లలో ఆక్యుపెన్సీ తగ్గిపోతోంది. ఈ కారణంగానే ఈనెల 17 నుంచి నెలాఖరు వరకూ థియేటర్లను స్వచ్ఛందంగా మూసేయ్యాలని కొంతమంది థియేటర్ యజమానులు నిర్ణయించుకున్నారు. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్‌కు, ఈ నిర్ణయానికీ ఎలాంటి సంబంధం లేదని, ఇప్పట్లో పెద్ద సినిమాల విడుదల లేకపోవడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ఓ ఎగ్జిబిటర్ వెల్లడించారు. రోజువారీ ఖర్చులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితుల్లో నష్టాలను తగ్గించుకోవడానికి థియేటర్ రన్ తాత్కాలికంగా ఆపడం తప్ప వేరే మార్గం కనిపించడం లేదని ఆయన వాపోయారు. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం బాధాకరమే అయినా తప్పడం లేదని మరికొంత మంది థియేటర్ యజమానులు చెప్పారు.

కారణాలు ఏమిటి?

కొత్తవారితో తీసే చిత్రాలను, లో బడ్జెట్ సినిమాలను చూడడానికి ప్రేక్షకులు ఆసక్తి చూపించకపోవడంతో సింగిల్ స్క్రీన్ థియేటర్లకు కష్టాలు మొదలయ్యాయని చెప్పాలి. తగినంత మంది ప్రేక్షకులు లేకపోవడం వల్ల షో నే కాన్సిల్ చేయడం ఈ మధ్య కాలంలో ఎక్కువైంది. ఇప్పటికే ఓటీటీల దెబ్బకు విలవిలలాడుతున్న సింగిల్ స్క్రీన్ థియేటర్లను ఈ పరిణామాలు మరింత నష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. వారం వారం పెద్ద సంఖ్యలో చిన్న సినిమాలు విడుదలవుతున్నా ప్రేక్షకులను ఆకట్టుకొనే అంశాలు వాటిల్లో ఉండకపోవడం వల్ల నిర్మాతలతో పాటు తాము కూడా నష్టపోవాల్సి వస్తోందని థియేటర్ యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్రాంతి సీజన్ తర్వాత విడుదలైన ఒకటి రెండు సినిమాలు తప్ప మిగిలినవేవీ ఆడక పోవడంతో పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. పెద్ద హీరోలు రెండు మూడేళ్లకు ఓ సినిమా చేయడం ఆక్యుపెన్సీ తగ్గడానికి ప్రధాన కారణమనీ, అభిమానుల కోసమన్నా టాప్ స్టార్స్ సంవత్సరానికి కనీసం ఒక్క సినిమా చేయాలని ఈ సందర్భంగా థియేటర్ యజమానులు అభ్యర్థిస్తున్నారు.

నష్టాలు వస్తున్నా మొండిగా నడుపుతున్నాం

అయితే తాము థియేటర్లను మూత వేయడం లేదని ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. నాలుగు షోలకు బదులుగా ఐదు షోలు వేయబోతున్నామని చెప్పారు. కొన్ని థియేటర్ల యజమానులు మాత్రమే ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చన్నారు.

జంట నగరాల్లో, ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఇలా థియేటర్లు మూత వేస్తున్న వారు ఎవరూ లేరన్నారు. నగర శివార్లు, తాలూకాలలో కొన్ని చోట్ల ఇలా చేస్తుండవచ్చన్నారు. సినిమాలు లేవని థియేటర్ మూత వేస్తే అది థియేటర్ రన్‌పై నెగిటివ్ ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు, అందుకే మూతేయడం ఇష్టం లేక, కష్టమైనా నడుపుతున్నాం అని సంధ్య థియేటర్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. వీరి బాటలోనే మరి కొంతమంది థియేటర్ల యజమానులు కూడా తమ నిర్ణయాన్ని మార్చుకొని ప్రదర్శనలను కొనసాగించనున్నట్లు తెలిపారు. పెద్ద సినిమాలు రిలీజ్ అవ్వకపోయినా ప్రస్తుతానికి చిన్న సినిమాలనే ప్రదర్శిస్తామని చెబుతున్నారు.

> **సింగిల్ స్క్రీన్స్‌లోనే కాదు.. మల్టీప్లెక్స్‌లో కూడా**
>
> ప్రేక్షకులు లేక షోలు రద్దు చేయడం, థియేటర్లు మూసెయ్యడం తెలుగు రాష్ట్రాల్లో చాలాకాలంగా జరుగుతున్నదే. థియేటర్‌ను క్లోజ్ చేయడం కంటే నడిపిస్తేనే ఎక్కువ నష్టం వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో థియేటర్ నిర్వహణ గుదిబండగా మారింది. థియేటర్ రన్ చేయడానికి రోజుకి రూ 12 వేలు ఖర్చవుతుంటే, ఆదాయం మాత్రం నాలుగైదు వేలకి మించి రావడం లేదు. సినిమా వేస్తే రూ. 7 వేలు నష్టం. అలా కాకుండా థియేటర్ మూసేస్తే రూ. 4 వేలు నష్టం. ఇది బాదాకరం అయినా థియేటర్లను మూసెయ్యక తప్పడం లేదు. సింగిల్ థియేటర్ల పరిస్థితి ఇలా ఉంటే మల్టీప్లెక్స్‌కు కూడా ఈ కష్టాలు తప్పడం లేదు. అక్కడ గతంలో వారానికి 80 షోలు ఉండేవి. ఇప్పుడు 20 షోలు వేయడం గగనమవుతోంది. ఇక సింగిల్ స్క్రీన్లలో ఇంతకుముందు వారానికి 28 షోలు వేసే వాళ్లం. కానీ ఇప్పుడు 15 మాత్రమే ఉంటున్నాయి. విద్యుత్, జీతాలు, యూఎఫ్‌వో ఛార్జీలు, జీఎస్టీ అన్నీ కలిపి ఎగ్జిబిటర్లకు తడిసి మోపెడవుతోంది.
>
> **కనీసం పదిమంది ఉండడం లేదు**
>
> కనీసం పదిమంది అయినా వస్తేనే షో వేస్తున్నాం. ఇటీవలే విడుదలైన ఒక సినిమాకు మూడు షోలు అలాగే వేశాం. నాలుగో షోకు అంతమంది జనం లేకపోవడంతో రద్దు చేశాం. మల్టీప్లెక్స్‌ల్లో కూడా ఇదే జరుగుతోంది. థియేటర్ దగ్గరకొచ్చాక షో బంద్ అనడంతో కొన్నిసార్లు ప్రేక్షకులతో గొడవలు అవుతున్నాయి. తెలంగాణలోనే కాదు ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొన్ని థియేటర్లను రెండు వారాల కిందే మూసేశారు.. మళ్లీ పూర్తి స్థాయిలో ఎప్పుడు తెరుచుకుంటాయి అనేది ఇప్పుడు చెప్పలేం. రెండు తెలుగు రాష్ట్రాల్లో మల్టీప్లెక్స్‌లతో కలిపి 1900 స్క్రీన్లు ఉన్నాయి. దాదాపు అన్నింటిలోనూ ఇదే పరిస్థితి. మిడ్‌రేంజ్ సినిమాలకు కూడా నిర్మాతలు షేర్ గ్యారంటీలు, అడ్వాన్స్‌లు అడుగుతున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య మేం రిస్క్ చేయాలని అనుకోవడం లేదు. నిర్మాతలు ముందుకు వచ్చి తగిన సహకారం అందిస్తే సినిమాలు ప్రదర్శిస్తాం.
>
> **-విజయేందర్ రెడ్డి**, తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్.



గుడి కోసం ఎన్టీఆర్ విరాళం

చిన్న సాయం చేసి ఆ విషయం ఊరంతా చాటుకుంటున్న రోజులివి. కానీ ఓ మంచి పని కోసం లక్షల రూపాయల విరాళం ఇచ్చి కూడా ఆ విషయం ఎక్కడా ఎవరికీ చెప్పకుండా మౌనంగా వహించి తన ప్రత్యేకత మరోసారి చాటుకున్నారు జూనియర్ ఎన్టీఆర్. విషయం ఏమిటంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గన్న పేటలో ఉన్న వీరభద్రస్వామి దేవాలయానికి ఎన్టీఆర్ రూ. 12.50 లక్షల విరాళం ఇచ్చారు. ఇది ఎప్పుడు ఇచ్చారో కూడా ఎవరికీ తెలీదు. చిన్న ఊరు, చిన్న గుడి కావడంతో ఈ విషయం బయటకు కూడా రాలేదు. అయితే ఇటీవల ఎవరో ఆ గుడికి వెళ్లి అక్కడున్న శిలా ఫలకం మీద జూనియర్ ఎన్టీఆర్ పేరు చూసి ఆ విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అందరికీ తెలిసింది. ఎన్టీఆర్ మంచి మనసుకి ఫిదా అయిన నెటిజన్లు ఆయనకు అభినందనలు తెలుపుతూ కామెంట్స్ పెడుతున్నారు.



డబుల్ డోస్... దిమాకీ కిరికిరి

రామ్ పోతినేని, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. హీరో పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ 'దిమాకీ కిరి కిరి' పేరుతో టీజర్ విడుదల చేశారు. ఇందులో రామ్ ఇస్మార్ట్ నెస్, కావ్యా థాపర్ పరిచయం, సంజయ్‌దత్ పవర్‌ఫుల్ ఎంట్రీ అలరించాయి. అద్భుత శివలింగం, క్లైమాక్స్ ఫైట్ .. భారీ జనసమూహం కూడా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో కూడా స్పిర్చువల్ టచ్ ఉంటుందని హింట్ ఇచ్చారు దర్శకుడు పూరి. హైదరాబాద్ యాసలో రామ్ చెప్పే డైలాగులు, మాస్ యాక్షన్ ప్యాక్డ్ అవతార్ అలరించాయి. డబుల్ ఎనర్జీ, డబుల్ ఫన్‌తో ఈ సినిమా ఉంటుందని టీజర్ చూడగానే అర్థమవుతుంది.

తెలుగు, తమిళ, కన్నడ, మలయాల, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయడానికి నిర్మాతలు పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ సన్నాహాలు చేస్తున్నారు.


సైకో థ్రిల్లర్స్‌లో ట్రెండ్ సెట్ చేస్తుంది



'మంత్ర, మంగళ' లాంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో దర్శకుడిగా మంచి విజయాలను అందుకున్నారు ఓషో తులసిరామ్. ఈసారి ఆయన సైకో థ్రిల్లర్ చిత్రం 'దక్షిణ'తో ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. కల్ట్ కాన్సెప్ట్స్ మూవీ బేనర్‌పై అశోక్ షిండే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కబాలి' ఫేమ్ సాయిధన్సిక ఇందులో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా యూనిట్ బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ మధ్య కాలంలో నన్ను భయపెట్టిన ట్రైలర్ ఇదే. 'దక్షిణ' చిత్రంతో తులసిరామ్ గారు టాలీవుడ్‌కి మరో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్‌ను ఇవ్వబోతున్నారు' అని ప్రశంసించారు. నిర్మాత మాట్లాడుతూ "దక్షిణ' సినిమా ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ థ్రిల్‌ను ఇస్తుంది. తర్వాతేం జరుగుతుందో అనే ఉత్కంఠను ప్రేక్షకులు అనుభవిస్తారు, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు.

విలన్‌కు విలన్‌గా

తనదైన విలనిజంతో వెండితెరపై విజృంభిస్తున్నారు సైఫ్ అలీఖాన్. పలు పాన్ ఇండియా చిత్రాల్లో విలన్‌పాత్రలకు దర్శకులకు ఆయన తొలి ప్రాధాన్యంగా మారారు. అయితే ఇప్పుడాయన తన పంథా మార్చి మరోసారి కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ మలయాళ దర్శకుడు ప్రియదర్శన్‌తో ఆయన ఓ చిత్రం చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ థ్రిల్లర్ చిత్రంలో సైఫ్ అంధుడిపాత్రలో కనిపించనున్నారు. జులైలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసిన ప్రియదర్శన్ నటీనటుల ఎంపికపై దృష్టి సారించారట. 'యానిమల్'లో విలన్‌గా ఆకట్టుకున్న బాబీడియోల్‌ను ఈ సినిమాలో ప్రతి నాయక పాత్రకు సంప్రదించగా, ఆయన అంగీకరించారని బాలీవుడ్ టాక్. కథ, పాత్ర బాగా నచ్చడంతో కష్టమైనా డేట్లు అడ్జస్ట్ చేసేందుకు బాబీడియోల్ సిద్ధమయ్యారట. ఏకబిగిన సాగే 40 రోజుల షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేయాలనే ఆలోచనతో ప్రియదర్శన్ ఉన్నారట.





భార్యాభర్తల ఈగోల గోల

రాహుల్ విజయ్, శివానీ జంటగా నటించిన 'విద్య వాసుల అహం' వెబ్ సిరీస్ ఈ నెల 17న ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది. మణికాంత్ గెల్లి దర్శకత్వంలో మహేశ్ దత్తా, లక్ష్మీ నవ్య నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ .. కొత్తగా పెళ్లయిన విద్య, వాసు అహంకారాన్ని వీడి తమ కాపురాన్ని ఎలా చక్కదిద్దుకున్నారనే ఇతివృత్తంతో సిరీస్‌ను రూపొందించినట్లు చెప్పారు. ఇది కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అనీ, ఇందులోని నాలుగు పాటలను నాలుగు రకాలుగా సంగీత దర్శకుడు కల్యాణీ మాలిక్ కంపోజ్ చేశారని తెలిపారు. హీరోయిన్ శివానీని కూడా ఆయనే రికమెండ్ చేశారని మణికాంత్ గెల్లి చెప్పారు.



హీరో రాహుల్ మాట్లాడుతూ 'ఇదొక క్యూట్ ఈగోస్ ఫన్ ఫిల్మ్. హాయిగా ఫ్యామిలీతో కలసి చూస్తూ ఎంజాయ్ చెయ్యవచ్చు' అన్నారు.

'ఈ టీమ్‌తో నాకు రెండేళ్ల నుంచి అనుబంధం ఉంది. దర్శకుడు మణికాంత్ కథ చెప్పగానే హీరో ఎవరని అడిగాను. రాహుల్ విజయ్ అని చెప్పగానే హ్యాపీగా ఫీల్ అయ్యాను. ఈ ప్రాజెక్ట్ ఒప్పుకొన్న వారం రోజులకి 'కోట బొమ్మాళి' చిత్రం ఓకే అయింది. అలా రెండేళ్లుగా రాహుల్‌తోనే వర్క్ చేస్తున్నాను. ఏ మాత్రం ఈగో లేని వ్యక్తి' అని శివానీ చెప్పారు.



యాక్షన్‌కు పూజా సన్నద్ధం

ప్రస్తుతం బాలీవుడ్‌లో కథానాయికగా తన అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు పూజాహెగ్డే. ఆమె హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'సన్కీ'. సునీల్‌శెట్టి తనయుడు అహాన్‌శెట్టి కథానాయకుడిగా నటిస్తున్నారు. అద్నాన్ ఏ షేక్, యాసిర్ ఝా దర్శకత్వం వహిస్తున్నారు. సాజిద్ నడియాడ్ వాలా నిర్మాత. వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 15న 'సన్కీ' విడుదలవుతోంది.



జూన్ తొలివారంలో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. క్రికెట్, ప్రేమ లాంటి అంశాల చుట్టూ అల్లుకున్న కథలో పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా నిలవనున్నాయని చిత్రబృందం ప్రకటించింది. ఇంటర్నేషనల్ స్టంట్ డిజైనర్ కేచ ఖంఫక్డీ ఆధ్వర్యంలో పోరాట ఘట్టాలు తెరకెక్కనున్నాయి. అందుకే 'సన్కీ' కోసం అహాన్‌శెట్టి, పూజాహెగ్డే ఇద్దరూ చెమటోడ్చుతున్నారు. ప్రస్తుతం అహాన్ క్రికెట్ ప్రాక్టీస్‌లో పాల్గొంటున్నారు. అలాగే శరీరాన్ని పాత్రకు తగ్గ ఆకృతికి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు. ఇక పూజాహెగ్డే అయితే ఈ సినిమాలో తన పాత్ర కోసం చాలా కష్టపడుతున్నారు. ఈ సినిమాతో ఎలాగైనా హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నారు పూజా. పతాక సన్నివేశాల్లో హీరో హీరోయిన్ల మధ్య వచ్చే ఎమోషనల్ సీన్లు ఈ సినిమాకు హైలెట్‌గా ఉంటాయట. అందుకే నటనకు సంబంధించి ఇప్పటికే ఒక రౌండ్ వర్క్‌షాప్ కూడా ఆమె పూర్తి చేశారని తెలుస్తోంది. అలాగే జిమ్‌లోనూ తీవ్రమైన శిక్షణ తీసుకుంటున్నారు.



ఫెడ్‌కప్‌లో నీరజ్‌కు స్వర్ణం

భువనేశ్వర్: టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, మరో రెండు నెలల్లో జరగనున్న పారిస్ ఒలింపిక్స్‌కు ముందు సొంతగడ్డపై పసిడి పతకం సాధించి, సత్తా చాటాడు. బుధవారం జరిగిన ఫెడరేషన్ కప్‌లో 26 ఏళ్ల నీరజ్ జావెలిన్‌ను 82.27 మీటర్ల దూరం విసిరి, ప్రథమ స్థానంలో నిలిచాడు. తొలి మూడు రౌండ్లు పూర్తయ్యేసరికి ద్వితీయ స్థానంలో నిలిచిన నీరజ్, నాలుగో రౌండ్‌లో పుంజుకుని ప్రథమ స్థానానికి చేరుకున్నాడు. 2021 తర్వాత నీరజ్ పాల్గొన్న తొలి దేశవాళీ పోటీ ఇదే కావడం విశేషం. ఇదే విభాగంలో డీపీ మను రెండో స్థానంలో నిలిచి, రజతం నెగ్గాడు. ఆసియా క్రీడల కాంస్యపతక విజేత, సంగారెడ్డి జిల్లాకు చెందిన అగసర నందిని హెప్టాథ్లాన్‌లో స్వర్ణంతో మెరిసింది. నందిని మొత్తంగా 5,460 పాయింట్లు సాధించి, అగ్రస్థానంలో నిలిచింది. ఇక, 100 మీటర్ల స్ప్రింట్‌లో హైదరాబాద్ అమ్మాయి నిత్య నాలుగో స్థానంలో నిలిచి కొద్దిలో కాంస్య పతకం కోల్పోయింది. పురుషుల 100 మీటర్ల స్ప్రింట్‌లో నెల్లూరు అథ్లెట్ శ్రీనివాస్ ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

హెప్టాథ్లాన్‌లో తెలుగమ్మాయి నందినికి పసిడి


నందిని



ప్రణయ్‌కు మీరాబ షాక్

'థాయ్‌లాండ్'లో సాత్విక్ జోడీ బోణీ

బ్యాంకాక్: స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్‌కు థాయ్‌లాండ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. భారత్‌కే చెందిన యువ ఆటగాడు మీరాబ లువాంగ్ మైస్నమ్ ఆరంభ రౌండ్లో సహచరుడు ప్రణయ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించాడు. మణిపూర్‌కు చెందిన 21 ఏళ్ల మీరాబ 21-18, 21-19తో ఐదోసీడ్ ప్రణయ్‌ను కంగుతినిపించి రెండోరౌండ్ చేరాడు. ఇక, పురుషుల డబుల్స్‌లో టాప్‌సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. సాత్విక్ జంట 21-13, 21-13తో మలేసియా ద్వయం నూర్ మ్మద్-తాన్ వీ కియోంగ్‌ను వరుసగేముల్లో ఓడించి రెండోరౌండ్లో ప్రవేశించింది. మహిళల సింగిల్స్ మొదటి రౌండ్లో అస్మిత చాలిహా 19-21, 21-15, 21-14తో ఎస్తర్ (ఇండోనేసియా)పై నెగ్గింది. మిగతా భారత షట్లర్లలో ఆకర్షి కశ్యప్, మాళవికా బన్సోడ్, ఉన్నతి హుడా, సామియా, కిరణ్ జార్జ్, సతీశ్ కుమార్ ప్రత్యర్థుల చేతిలో ఓడి ఆదిలోనే వెనుదిరిగారు.

నేటి మ్యాచ్

రాత్రి 7.30 గం.
వేదిక: హైదరాబాద్
హైదరాబాద్ X గుజరాత్

టార్గెట్..ప్లేఆఫ్స్ బెర్త్

టైటాన్స్‌తో సన్‌రైజర్స్ ఢీ నేడు

హైదరాబాద్: బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతుండగా, బౌలర్లు మెరుగ్గా రాణిస్తుండడంతో ఈ సీజన్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్ ముంగిట నిలిచింది. గురువారం ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లో ఆ జట్టు గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. గుజరాత్‌తో గాక మరో మ్యాచ్ మిగిలున్నా.. టైటాన్స్‌పై గెలిస్తే సన్‌రైజర్స్‌కు ప్లేఆఫ్ బెర్త్ ఖాయమవుతుంది. 12 మ్యాచ్‌ల్లో 14 పాయింట్లు సాధించిన ఆ జట్టు గరిష్ఠంగా 18 పాయింట్లు పొందే చాన్సుంది. అలాగే రన్ రేట్ (+0.406) కూడా ఎంతో మెరుగ్గా ఉంది. ఓపెనర్లు ఇచ్చిన శుభారంభాన్ని నితీశ్, క్లాసెన్, సమద్ కొనసాగిస్తే రైజర్స్‌కు తిరుగుండబోదు. మరోవైపు 13 మ్యాచ్‌ల ద్వారా కేవలం 11 పాయింట్లతోనే ఉన్న గుజరాత్..ఇప్పటికే నాకౌట్ రేస్‌నుంచి అవుటైంది. కనీసం చివరి పోరులో గెలిచి లీగ్‌ను గౌరవప్రదంగా ముగించాలని భావిస్తోంది. అయితే ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతున్న సన్‌రైజర్స్‌ను అందునా..వారి సొంత గ్రౌండ్‌లో అడ్డుకోవడం గుజరాత్‌కు అయ్యేపనేనా?

సచిన్ టెండూల్కర్ సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

ముంబై: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు సెక్యూరిటీ గార్డుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర రిజర్వ్ పోలీసు విభాగం (ఎస్‌ఆర్‌పీఎఫ్)కు చెందిన జవాను ఆత్మహత్య చేసుకోవడం సంచలనంగా మారింది. 39 ఏళ్ల ప్రకాశ్ కాప్డే అనే గార్డు తన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకొని చనిపోయాడని పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం సెలవుపై తన స్వస్థలమైన మహారాష్ట్రలోని జామ్నర్‌కు వెళ్లిన ప్రకాశ్ అక్కడే బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. వ్యక్తిగత కారణాల రీత్యానే ఆ జవాను ఆత్మహత్యకు పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు.

సెమీస్‌లో అభిషేక్

ఎలోర్డా కప్ బాక్సింగ్

అస్టానా (కజకిస్థాన్): భారత బాక్సర్ అభిషేక్ యాదవ్ (67 కిలోలు) ఎలోర్డా కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ బౌట్‌లో 5-0తో స్థానిక బాక్సర్ రఖాత్ సీజమ్‌ను చిత్తు చేశాడు. ఇక, మంగళవారం రాత్రి జరిగిన బౌట్లలో నెగ్గిన మనీష (60 కి), మోనిక (81+ కి) సెమీఫైనల్స్‌లో ప్రవేశించారు. నిఖత్ జరీన్ (52 కి) సెమీఫైనల్ గురువారం జరగనుంది.

రాయల్స్ నాలుగోసారీ

పంజాబ్ చేతిలో ఓటమి ▫ కర్రాన్ హాఫ్ సెంచరీ

గువాహటి: ప్లేఆఫ్స్‌కు చేరినా..రాజస్థాన్ రాయల్స్ మాత్రం ఓటమి బాటను వీడలేదు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు ఐదు వికెట్లతో పంజాబ్ కింగ్స్ చేతిలో పరాజయం చవిచూసింది. రాయల్స్‌కిది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 144/9కే పరిమితమైంది. రియాన్ పరాగ్ (48), అశ్విన్ (28) మాత్రమే రాణించారు. కర్రాన్, హర్షల్, రాహుల్ చాహర్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో పంజాబ్ 18.5 ఓవర్లలో 145/5 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ సామ్ కర్రాన్ (63 నాటౌట్) కడదాకా నిలిచి జట్టును విజయ తీరాలకు చేర్చాడు. రొసో (22), జితేశ్ శర్మ (22) సత్తా చాటారు. అవేశ్, చాహల్ రెండేసి వికెట్లు తీశారు. కర్రాన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అయితే పంజాబ్ ఇప్పటికే నాకౌట్ రేసు నుంచి అవుటైన సంగతి తెలిసిందే. ఈ పరాజయంతో ప్లేఆఫ్స్‌లో టాప్-2లో నిలవడం రాజస్థాన్‌కు కష్టమే.

కర్రాన్ కెప్టెన్ ఇన్నింగ్స్: క్లిష్టమైన పిచ్‌పై 145 పరుగుల కష్టమైన ఛేదనలో పంజాబ్ కూడా మొదటి ఓవర్లోనే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ చేజార్చుకుంది. కానీ బెయిర్‌స్టో, రొసో చక్కగా ఆడుతూ రెండో వికెట్‌కు 30 పరుగులు జత చేసి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టే బాధ్యత చేపట్టారు. ఈ దశలో తన తొలి ఓవర్ చేపట్టిన అవేశ్ మూడు బంతుల్లో హార్డ్ హిట్టర్లు రొసో, శశాంక్ (0) అవుట్ చేసి రాజస్థాన్‌లో హుషారు తెచ్చాడు. పవర్ ప్లేలో పంజాబ్ 39/3తో నిలవగా 8వ ఓవర్లో కీలకమైన బెయిర్ స్టో (14)ను అవుట్ చేసిన చాహల్.. పంజాబ్‌ను దెబ్బ తీశాడు. కింగ్స్ ఇన్నింగ్స్ చప్పగా సాగుతున్న దశలో అశ్విన్ బౌలింగ్‌లో జితేష్ 6, చాహల్ బౌలింగ్ కర్రాన్ 4 కొట్టి ఒకింత ఊపు తెచ్చారు. 63 పరుగులు జత చేసి ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీలో జితేష్‌ను పెవిలియన్ చేర్చిన చాహల్ రాజస్థాన్‌కు కీలక బ్రేక్ ఇచ్చాడు. ఇక..మూడు ఓవర్లలో 25 రన్స్ కావాల్సిన వేళ సందీప్ వేసిన 18వ ఓవర్లో కర్రాన్ సిక్సర్ దంచడంతో మొత్తం 10 పరుగులొచ్చాయి. 19వ ఓవర్లోనూ అవేశ్ బౌలింగ్ మరో భారీ సిక్సర్ బాదిన కర్రాన్..అశుతోష్ శర్మ (17 నాటౌట్) జతగా పంజాబ్ విజయాన్ని ఖాయం చేశాడు.

పంజాబ్ బౌలర్లు భళా: టాస్ గెలిచి రాజస్థాన్ బ్యాటింగ్ ఎంచుకోగా..తొలి ఓవర్లోనే జైస్వాల్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన కర్రాన్ ప్రత్యర్థికి ఝలకిచ్చాడు. అయితే శాంసన్-కొహ్లెర్ కుదురుకొని ఇన్నింగ్స్‌ను నడిపించారు. సంజూ తన సహజ శైలిలో ఆడుతూ అర్ష్‌దీప్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు దంచగా, కొహ్లెర్ మాత్రం భారీ షాట్లు ఆడలేకపోయాడు. మరోవైపు ఎలిస్, హర్షల్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పవర్ ప్లేను 38/1తో రాయల్స్ ముగించింది. కానీ ఏడో ఓవర్లో శాంసన్ (18)ను ఎలిస్ క్యాచవుట్ చేయడంతో 36 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తదుపరి ఓవర్లో కొహ్లెర్‌ను స్పిన్నర్ రాహుల్ చాహర్ పెవిలియన్ చేర్చాడు. దాంతో పరాగ్, అశ్విన్ ఆచితూచి ఆడడంతో రాజస్థాన్ స్కోరుబోర్డు మందగించింది. అయితే చాహర్ వేసిన 12వ ఓవర్లో బ్యాట్ ఝుళిపించిన అశ్విన్ 6,4,4 కొట్టి 17 పరుగులు రాబట్టాడు. ఈ దశలో పంజాబ్ బౌలర్లు మరోసారి విజృంభించారు. అశ్విన్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేసి 50 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యాన్ని విడదీశాడు. ఇక జురెల్ (0)ను కర్రాన్, పావెల్ (4)ను చాహర్ వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చడంతో 102/6తో రాజస్థాన్ తీవ్ర ఇక్కట్లలో పడింది. తన చివరి రెండు ఓవర్లలో ఫెరీరా (7), పరాగ్‌లను హర్షల్ అవుట్ చేయగా బౌల్ట్ (12) రనౌట్ కావడంతో ఆర్‌ఆర్ స్కోరు కనీసం 150కి కూడా చేరలేదు.


సామ్ కర్రాన్ (63 నాటౌట్)



2 ఐపీఎల్‌లో 500 రన్స్‌కుపైగా చేసిన రెండో అన్‌క్యాప్డ్ క్రికెటర్ రియాన్ పరాగ్. షాన్ మార్ష్ 2008లో తొలి ఆటగాడిగా నిలిచాడు.

స్కోరుబోర్డు

రాజస్థాన్: జైస్వాల్ (బి) కర్రాన్ 4, కోహ్లెర్ (సి) జితేశ్ (బి) చాహర్ 18, శాంసన్ (సి) చాహర్ (బి) ఎలిస్ 18, పరాగ్ (ఎల్బీ) హర్షల్ 48, అశ్విన్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 28, జురెల్ (సి) హర్‌ప్రీత్ (బి) కర్రాన్ 0, పొవెల్ (సి అండ్ బి) చాహర్ 4, ఫెరీరా (సి) రొసో (బి) హర్షల్ 7, బౌల్ట్ (రనౌట్) 12, అవేశ్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 20 ఓవర్లలో 144/9; వికెట్ల పతనం:** 1-4, 2-40, 3-42, 4-92, 5-97, 6-102, 7-125, 8-138, 9-144; **బౌలింగ్:** కర్రాన్ 3-0-24-2, అర్ష్‌దీప్ 4-0-31-1, ఎలిస్ 4-0-24-1, హర్షల్ 4-0-28-2, రాహుల్ చాహర్ 4-0-26-2, హర్‌ప్రీత్ బ్రార్ 1-0-10-0.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్ (సి) చాహల్ (బి) బౌల్ట్ 6, బెయిర్‌స్టో (సి) పరాగ్ (బి) చాహల్ 14, రొసో (సి) జైస్వాల్ (బి) అవేశ్ 22, శశాంక్ (ఎల్బీ) అవేశ్ 0, కర్రాన్ (నాటౌట్) 63, జితేశ్ (సి) పరాగ్ (బి) చాహల్ 22, అశుతోష్ (నాటౌట్) 17, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 18.5 ఓవర్లలో 145/5; వికెట్ల పతనం:** 1-6, 2-36, 3-36, 4-48, 5-111; **బౌలింగ్:** బౌల్ట్ 3-0-27-1, సందీప్ 4-0-28-0, అవేశ్ 3.5-0-28-2, అశ్విన్ 4-0-31-0, చాహల్ 4-0-31-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్థాన్	13	8	5	0	16	0.273
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.787
గుజరాత్	13	5	7	1	11	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	13	4	9	0	8	-0.271

నేపాల్ క్రికెటర్ లామిచానె నిర్దోషి

హైకోర్టు తీర్పు ▫ వరల్డ్‌కప్‌నకు ఎంపికయ్యే చాన్స్

ఖాట్మండు: అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపాల్ స్టార్ క్రికెటర్ సందీప్ లామిచానెను హైకోర్టు నిర్దోషిగా ప్రకటించింది. రెండేళ్ల క్రితం 17 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ నమోదైన కేసులో లామిచానెకు జిల్లా కోర్టు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, కింది కోర్టు తీర్పును లామిచానె హైకోర్టులో సవాల్ చేశాడు. దీనిపై విచారణ తర్వాత లామిచానె ఎలాంటి తప్పూ చేయలేదని హైకోర్టు తీర్పు వెలువరించిందని నేపాల్ క్రికెట్ బోర్డు తెలిపింది. దీంతో 23 ఏళ్ల లామిచానె.. త్వరలో జరిగే టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనే నేపాల్ జట్టుకు అందుబాటులో ఉండనున్నాడు.

ఐఎల్‌టీ20లో రాయుడు

దుబాయ్: టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఇంటర్నేషనల్ లీగ్ టీ20 (ఐఎల్‌టీ20) మూడో సీజన్‌లో ఆడనున్నాడు. వచ్చే ఏడాది జనవరి 11 నుంచి ఫిబ్రవరి 9 వరకు యూఏఈలో ఈ టోర్నీ జరగనుంది. మొత్తం 34 మ్యాచ్‌లు జరిగే ఈ టోర్నీలో ఆరు జట్లు పోటీపడతాయి.

బిజినెస్

ఎఫ్‌డీలపై ఎస్‌బీఐ వడ్డీ పెంపు

ముంబై: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై (ఎఫ్‌డీ) ఎస్‌బీఐ వడ్డీరేట్లు పెంచింది. ఎఫ్‌డీల కాల పరిమితిని బట్టి ఈ పెంపు 0.25 శాతం నుంచి 0.75 శాతం వరకు ఉంటుంది. రూ.2 కోట్ల లోపు ఉండే డిపాజిట్లకు ఈ రేట్లు వర్తిస్తాయి ఈ నిర్ణయం ప్రకారం వడ్డీరేట్లు ఈ విధంగా ఉంటాయి.

కాలపరిమితి	ప్రస్తుత రేటు%	కొత్త రేటు%
45 రోజులు	3.5	4.00
46-179 రోజులు	5.5	6.00
180-210 రోజులు	6.00	6.50
211-1 ఏడాది	6.25	6.75
1-2 సంవత్సరాలు	6.80	7.30
2-3 సంవత్సరాలు	7.00	7.50
3-5 సంవత్సరాలు	6.75	7.25
5-10 సంవత్సరాలు	6.50	7.5

బ్రైట్‌కామ్‌కు భారీ షాక్!

వచ్చేనెల 14 నుంచి షేర్ల ట్రేడింగ్ నిలిపివేత ● సర్క్యులర్ జారీ చేసిన స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు

వరుసగా రెండు త్రైమాసికాల ఆర్థిక ఫలితాలు ప్రకటించనందువల్లే..



ముంబై: హైదరాబాద్‌కు చెందిన డిజిటల్ మార్కెటింగ్ సొల్యూషన్స్ కంపెనీ బ్రైట్‌కామ్ గ్రూప్‌నకు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు భారీ షాకిచ్చాయి. వచ్చేనెల 14 నుంచి కంపెనీ షేర్ల ట్రేడింగ్‌ను నిలిపివేస్తున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రకటించాయి. వరుసగా రెండు త్రైమాసికాల (2023 జులై- సెప్టెంబరు, అక్టోబరు-డిసెంబరు) ఆర్థిక ఫలితాలను ప్రకటించడంలో కంపెనీ విఫలమైన కారణంగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 2023 జులై 11న జారీ చేసిన మాస్టర్ సర్క్యులర్‌లోని 33వ నిబంధనకు అనుగుణంగా కంపెనీపై చర్యలు చేపట్టినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు తమ సర్క్యులర్‌లో వెల్లడించాయి. నియంత్రణ మండలి నిబంధనలను పాటించేవరకు బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్ల ట్రేడింగ్‌పై సస్పెన్షన్ కొనసాగుతుందని స్పష్టం చేశాయి. షేర్ల ట్రేడింగ్ నిలిపివేసిన 15 రోజుల తర్వాత, ఆరు నెలల వరకు ప్రతివారంలో మొదటిరోజున ఈ షేర్లలో ట్రేడింగ్‌కు అనుమతించడం జరుగుతుందని తెలిపాయి. బీఎస్ఈలో బ్రైటాకామ్ గ్రూప్ షేరు బుధవారం 4.96 శాతం క్షీణించి రూ.12.27 వద్దకు పడిపోయింది. సోమవారం నాడు షేరు ఏడాది కనిష్ఠ స్థాయి రూ.12.19 వద్దకు పతనమైంది.

5.7 లక్షల మంది రిటైల్ ఇన్వెస్టర్లు ఇరుక్కు పోయినట్లేనా..?

ఈ సస్పెన్షన్ కాలంలో కంపెనీ ప్రమోటర్ వాటా షేర్లను స్తంభింపజేయడంతోపాటు డీమ్యాట్ ఖాతాలోని ఇతర సెక్యూరిటీలను సైతం స్తంభింపజేయడం జరుగుతుందని బీఎస్ఈ తెలిపింది. ప్రస్తుతం బ్రైట్‌కామ్ గ్రూప్‌లో ప్రమోటర్‌కు వాటా 18.38 శాతంగా ఉండగా.. మిగతా 81.62 శాతం వాటా పబ్లిక్ వాటాదారుల చేతుల్లో ఉంది. పబ్లిక్ షేర్‌హోల్డర్లలో 5.7 లక్షల మంది రిటైల్ మదుపరులే. వీరి చేతుల్లో కంపెనీకి చెందిన 37.89 శాతం వాటాకు సమానమైన షేర్లున్నాయి. షేర్ల ట్రేడింగ్ నిలిపివేత ఆదేశాల నేపథ్యంలో మున్ముందు సెషన్లలో ఈ కంపెనీ షేరు మరింత క్షీణించే ప్రమాదం ఉంది. దాంతో బ్రైట్‌కామ్ గ్రూప్ షేర్లు కలిగి ఉన్న చిన్న మదుపరులు భారీగా నష్టపోయే అవకాశాలున్నాయి.

కంపెనీకి దెబ్బ మీద దెబ్బ

లిస్టింగ్ నిబంధనల అతిక్రమణ, ఇన్వెస్టర్లకు బహిర్గతం చేయాల్సిన సమాచారాన్ని దాచిపెట్టడం, నిబంధనల ఉల్లంఘన వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రైట్‌కామ్ గ్రూప్ రెండేళ్లకు పైగా కాలం నుంచే సెబీ నిఘాలో ఉంది. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు ఈ కంపెనీ వ్యయాలను తక్కువ చేసి, లాభాలను పెంచి చూపినట్లు సెబీ గుర్తించింది. కంపెనీ పెద్ద మోసానికి పాల్పడిందని, ఐదేళ్లలో కంపెనీ తన పద్దుల్లో రూ.1,280 కోట్ల విలువైన లావాదేవీలను కప్పిపుచ్చిందని నియంత్రణ మండలి వెల్లడించింది. బ్రైట్‌కామ్ గ్రూప్ ఛైర్మన్, ఎండీ సురేశ్ కుమార్ రెడ్డి ఏ కంపెనీలోనూ డైరెక్టర్ పదవి చేపట్టకుండా ఈ ఫిబ్రవరిలో సెబీ నిషేధం విధించింది. అంతేకాదు, సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి కంపెనీని నిషేధించింది.

మూడు రోజుల లాభాలకు బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం నీరసించింది. సెన్సెక్స్ 117.58 పాయింట్ల నష్టంతో 72,987.03 వద్ద, నిఫ్టీ 17.30 పాయింట్ల నష్టంతో 22,200.55 వద్ద ముగిశాయి. దీంతో సెన్సెక్స్ మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడినట్టయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై నెలకొన్న సందిగ్ధం, ఎఫ్‌పీఐల అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. సెన్సెక్స్ హెవీ వెయిట్ స్టాక్స్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్ సహా పలు కౌంటర్లలో అమ్మకాలు మార్కెట్‌ను నష్టాల్లోకి నెట్టాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,150 ▲	91,000 ▲
ముంబై	72,930 ▲	66,810 ▲	84,505 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	618	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	142	గోదావరి	152
వరంగల్	142	విజయవాడ	152
కరీంనగర్	142	గుంటూరు	152
మహబూబ్‌నగర్	142	ఒంగోలు	152
కర్నూలు	142	చిత్తూరు	154
విశాఖపట్నం	144		

టెలికాం చార్జీలు పెరగాల్సిందే..

ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్



న్యూఢిల్లీ: ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లోనే టెలికాం చార్జీలు చాలా తక్కువని భారతీ ఎయిర్‌టెల్ ఎండీ గోపాల్ విఠల్ అన్నారు. టెల్కోల రిటర్నుల నిష్పత్తి మెరుగుపడాలంటే చార్జీలను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. "టెలికాం పరిశ్రమకు ప్రస్తుతం అవసరమైన రిటర్నులు చార్జీల సవరణపైనే ఆధారపడి ఉన్నాయి. టెల్కోలకిదే ఇప్పుడు ప్రధాన సమస్య. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే మన దగ్గర టెలికాం చార్జీలు అత్యంత కనిష్ఠ స్థాయిలో ఉన్నాయి. కంపెనీల రిటర్నుల నిష్పత్తి మెరుగుపడాలంటే చార్జీలను సవరించాల్సిందే. కంపెనీలకు ఆదాయం ఏ సాంకేతికత ద్వారా సమకూరింది అనేది సమస్య కాదు" అని ఎయిర్‌టెల్ మార్చి త్రైమాసిక ఎర్నింగ్స్ కాల్‌లో విఠల్ పేర్కొన్నారు. ప్రస్తుతం 5జీ సేవల ద్వారా లభించే ఆదాయం పరిమితమే అయినప్పటికీ, మొత్తం వ్యాపారంపై ఎంత మేర రిటర్ను లభిస్తున్నదనేదే కంపెనీ చూస్తుందన్నారు. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఎయిర్‌టెల్‌కు ఒక్కో వినియోగదారు నుంచి లభించే సగటు ఆదాయం (ఆర్పు) రూ.209కి పెరిగింది. కాగా, ఆర్థిక కష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా(వీఐ) మూలధన నిధులను సమీకరించగలిగినందుకు సంతోషిస్తున్నాని విఠల్ అన్నారు. భారత టెలికాం మార్కెట్ మూడు ప్రైవేట్ కంపెనీలతో మెరుగైన సేవలందించగలదన్నారు.

గోల్డ్ లోన్లపై జర జాగ్రత్త

ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ ఆదేశం

ముంబై: ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్లపై ఆర్‌బీఐ దృష్టి పెట్టింది. ఈ కంపెనీలు రుణాలు మంజూరు చేసేటపుడు లోన్ టు వాల్యూ రేషియో, వేలం పద్ధతి, నగదు పంపిణీ విషయాల్లో తూచా తప్పకుండా నిబంధనలు పాటించాలని కోరింది. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీ ఈ నిబంధనలు తుంగలో తొక్కిందని తేలడంతో ఆర్‌బీఐ ఈ విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఆదాయ పన్ను చట్టం ప్రకారం ఏ లావాదేవీల్లోనూ రూ.20,000కు మించి నగదు ఇవ్వరాదు. కానీ కొన్ని ఎన్‌బీఎఫ్‌సీలు పసిడి రుణాలు ఇచ్చేటపుడు మొత్తం రుణంలో 40 నుంచి 50 శాతం నగదు రూపంలో ఇస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఖాతాదారుల ఆభరణాల వేలం నిబంధనల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని కోరింది.

నాలుగు నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు

ఏప్రిల్ ఎగుమతుల్లో స్వల్ప వృద్ధి



న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం ఏప్రిల్ నెలలో స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. అంతర్జాతీయ ఆర్థిక అస్థిరతల నడుమన ఎగుమతులు కేవలం ఒక శాతం పెరిగి 3499 కోట్ల డాలర్లుగా (రూ.2.97 లక్షల కోట్లు) నమోదయ్యాయి. అయితే వాణిజ్య లోటు మాత్రం నాలుగు నెలల గరిష్ఠ స్థాయి 1910 కోట్ల డాలర్లకు (రూ.1.62 లక్షల కోట్లు) చేరింది. గత ఏడాది ఏప్రిల్‌లో వాణిజ్య లోటు 1444 కోట్ల డాలర్లుగా (రూ.1.23 లక్షల కోట్లు) ఉంది. గత ఏడాది డిసెంబరులో నమోదైన గరిష్ఠ స్థాయి 1980 కోట్ల డాలర్ల (రూ.1.68 లక్షల కోట్లు) తర్వాత వాణిజ్య లోటు ఈ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్ ఎగుమతుల్లో ఆరోగ్యవంతమైన వృద్ధి చోటు చేసుకుంది. ఏప్రిల్‌లో దిగుమతులు కూడా 10.25 శాతం పెరిగి 5409 కోట్ల డాలర్లుగా (రూ.4.60 లక్షల కోట్లు) నమోదయ్యాయి. బంగారం దిగుమతులు గణనీయంగా పెరగడం ఇందుకు దోహదపడింది.

ఎన్‌సీసీ టర్నోవర్ 31 శాతం వృద్ధి

ఒక్కో షేరుపై రూ.2.20 డివిడెండ్

హైదరాబాద్: ఇన్‌ఫ్రా రంగంలోని ఎన్‌సీసీ లిమిటెడ్ ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన నాలుగో త్రైమాసికంలో మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ కాలానికి కంపెనీ అనుబంధ కంపెనీలతో కలిసి (కన్సాలిడేటెడ్) రూ.6,530.05 కోట్ల టర్నోవర్‌పై రూ.239.16 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ టర్నోవర్ 31 శాతం పెరిగింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ కన్సాలిడేటెట్ టర్నోవర్ రూ.15,701 కోట్ల నుంచి రూ.20,970.91 కోట్లకు, నికర లాభం రూ.609.20 కోట్ల నుంచి రూ.710.69 కోట్లకు చేరాయి. ఆర్థిక ఫలితాలు బాగుండడంతో రూ.2 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై వాటాదారులకు రూ.2.20 (110 శాతం) చొప్పున డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ కొత్తగా రూ.27,283 కోట్ల విలువైన ఆర్డర్లు సంపాదించింది. దీంతో ప్రస్తుతం కంపెనీ చేతిలో ఉన్న ఆర్డర్ల విలువ రూ.57,536 కోట్లకు చేరింది.

గ్రాన్యూల్స్ లాభం రూ.130 కోట్లు

ఒక్కో షేరుపై రూ.1.5 డివిడెండ్

హైదరాబాద్: స్థానిక ఫార్మా కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా మార్చి త్రైమాసికంలో రూ.130 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది ఎనిమిది శాతం ఎక్కువ. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం మాత్రం రూ.1,195 కోట్ల నుంచి రూ.1,176 కోట్లకు పడిపోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ నికర లాభం 22 శాతం తగ్గి రూ.405 కోట్లకు, టర్నోవర్ రూ.4,512 కోట్ల నుంచి రూ.4,506 కోట్లకు పడిపోయాయి. అయినా రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై రూ.1.5 (150 శాతం) తుది డివిడెండ్ చెల్లించాలని డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

1:5గా ఆంధ్రా పేపర్స్ షేర్ల విభజన

హైదరాబాద్ : ఆంధ్రా పేపర్స్ తన షేర్లను 1:5గా విభజించాలని నిర్ణయించింది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. దీంతో రూ.10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరు రూ.2 ముఖ విలువ ఉండే ఐదు షేర్లుగా మారుతుంది. ఈ షేర్ల విభజన పూర్తయ్యేందుకు నాలుగు నెలలు పడుతుందని కంపెనీ అంచనా. ఈ విభజనతో స్టాక్ మార్కెట్‌లో కంపెనీ షేర్ల లభ్యత (లిక్విడిటీ) బాగా పెరిగి షేర్లు రిటైల్ ఇన్వెస్టర్లకు కూడా అందుబాటులోకి వస్తాయని అంచనా.



ఆళ్లగడ్డలో నిఖిల్‌ను కారుతో ఢీకొట్టిన సీసీ ఫుటేజీ దృశ్యం

కారుతో ఢీకొట్టి... వేటకొడవలితో నరికి..

- అఖిలప్రియ ప్రైవేటు బాడీగార్డుపై హత్యాయత్నం
- ఆమె నివాసం బయట అర్ధరాత్రి దాడి
- నరకడంతో తలకు లోతయిన గాయం

ఆళ్లగడ్డ, మే 15: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అఖిలప్రియ ప్రైవేటు బాడీగార్డు పై హత్యాయత్నం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఎవరో పిలిచినట్టు అనిపించి అఖిలప్రియ ఇంట్లోంచి ఆమె బాడీగార్డు నిఖిల్ బయటకు వచ్చారు. అప్పటికే అక్కడ మాటు వేసిన గుర్తుతెలియని వ్యక్తులు కారుతో నిఖిల్‌ను ఢీకొట్టారు. కారు గుద్దిన వేగానికి నిఖిల్ ఎగిరి అవతల పడ్డారు. కారును ఆపి కిందకు దిగిన ముగ్గురు ఆగంతకులు వేటకొడవళ్లతో దాడి చేశారు. ఆ దాడి నుంచి తప్పించుకుని అఖిలప్రియ ఇంటి వైపు నిఖిల్ పరుగుతీశారు. ఆ ఇంటి దగ్గరలో నిఖిల్‌ను చుట్టుముట్టి ఆయన తలపై వేటకొడవలితో నరికారు. అయినా.. ఆ గాయంతోనే నిఖిల్ ఇంట్లోకి వెళ్లిపోయారు. అలా తన ప్రాణాలు కాపాడుకున్నారు. అనంతరం దుండగులు అదే కారులో పారిపోయారు. తీవ్రంగా గాయపడిన నిఖిల్‌ను తొలుత ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. కాగా, ఈ దాడిపై టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో ఏవీ సుబ్బారెడ్డి, డ్రైవరు, మరో ముగ్గురి పేర్లు ఆయన ప్రస్తావించారు. గతేడాది నంద్యాలలో జరిగిన యువగళం పాదయాత్ర సందర్భంగా మాజీ మంత్రి అఖిలప్రియపై ఏవీ సుబ్బారెడ్డి దురుసుగా ప్రవర్తించారు. ఈ క్రమంలో సుబ్బారెడ్డిపై నిఖిల్ చేయి చేసుకున్నారు. ఈ సంఘటనను మనసులో పెట్టుకున్న సుబ్బారెడ్డి, తన అనుచరులతో నిఖిల్‌పై హత్యాయత్నం చేయించారని భావిస్తున్నారు.

భార్యాబిడ్డలను వేధిస్తూ... ఏజెంట్‌కు వీడియోకాల్

- బూత్ వదిలి వెళ్లాలని బెదిరింపు
- పిన్నెల్లి గ్రామంలో పోలింగ్‌రోజు రెచ్చిపోయిన వైసీపీ

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజు పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో జరిగిన వైసీపీ అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం కళ్లకుంట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సొంత గ్రామం. ఆ గ్రామంలో గత నాలుగు ఎన్నికల్లో టీడీపీ తరఫున పోలింగ్ ఏజెంట్ లేడు. ఈ ఎన్నికల్లో కూడా ఏకపక్షంగా ఎన్నికలు జరిపించాలని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుకున్నారు టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి... వైసీపీ నేత ఆలోచనకు గండికొడుతూ అక్కడ ఏజెంట్‌గా దళితవర్గానికి చెందిన నోముల మాణిక్యాన్ని కూర్చోబెట్టారు. పోలింగ్ మొదలైన తర్వాత వైసీపీ నాయకులు మాణిక్యాన్ని బయటికి వెళ్లాలని సూచించారు. తాను బయటకు వెళ్లనని మాణిక్యం అక్కడే కూర్చున్నారు. దీంతో వైసీపీ నేతలు రెచ్చిపోయారు. గ్రామంలోకి వెళ్లి మాణిక్యం ఇంటిని చుట్టుముట్టారు. ఆయన భార్యా పిల్లలను తీవ్రంగా కొడుతూ వీడియో కాల్ చేశారు. భార్యాపిల్లలను హింసిస్తూ పోలింగ్ బూత్ నుంచి బయటకు రాకపోతే చంపేస్తామని ఆ వీడియో కాల్‌లో మాణిక్యాన్ని బెదిరించారు. అయినా మాణిక్యం పోలింగ్ బూత్ నుంచి బయటకు రాలేదు. మధ్యాహ్నం తర్వాత ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్వయంగా పోలింగ్ బూత్‌లోకి వెళ్లి మాణిక్యాన్ని కొట్టి బయటకు పంపించారని సమాచారం. ఆ తర్వాత మాణిక్యం ఇల్లు ఖాళీ చేసి భార్యాబిడ్డలను తీసుకుని ఊరి నుంచి వెళ్లిపోయారు. మాచర్ల నియోజకవర్గంలోని కేపీగూడెం పోలింగ్ బూత్‌లో కూడా ఇదేవిధంగా పైశాచికత్వాన్ని వైసీపీ గూండాలు ప్రదర్శించారు. అక్కడ పోలింగ్ బూత్‌లో ఏజెంట్లుగా కూర్చున్న గిరిజన నేతలు హనుమంతునాయక్, రేక్యానాయక్, చిన్న మంత్రునాయక్‌లను పోలింగ్ బూత్ నుంచి బయటకు వెళ్లాలని బెదిరించారు. వారు వినకపోవడంతో వారిళ్లను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ తర్వాత పోలింగ్ బూత్‌లోకి వచ్చి ఆ ముగ్గురినీ చితగ్గొట్టారు.

తాడిపత్రిలో ఉద్రిక్తత

- జేసీ అనుచరుడిని పిలిపించి చితగ్గొట్టిన పోలీసులు
- బాష్పవాయువు ప్రభావంతో జేసీ ప్రభాకర్‌కు అస్వస్థత



అస్వస్థతకు గురైన జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి టౌన్, హైదరాబాద్ సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): తాడిపత్రిలో ఉద్రిక్తత చల్లారలేదు. మంగళవారం అర్ధరాత్రి దాటాకా మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్, టీడీపీ మద్దతుదారు దాసరి కిరణ్‌ను పోలీసులు చావబాదారు. దివ్యాంగుడని చూడకుండా లాఠీలతో కుళ్లపొడిచారు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న కిరణ్‌ను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. డీఎస్పీ చెప్పి మరీ పోలీసులతో తనను కొట్టించారని బాధితుడు కిరణ్ ఆరోపించారు. "మంగళవారం అర్ధరాత్రి స్పెషల్ పార్టీ పోలీసులు నా వద్దకొచ్చారు. డీఎస్పీ చైతన్య పిలుస్తున్నారు.. కాలేజీ గ్రౌండ్‌లో ఉన్నారు.. రావాలని అన్నారు. అక్కడకు వెళ్లిన తరువాత డీఎస్పీ చైతన్య...నన్ను చూపించి.. 'వీన్ని కొట్టండి' అని ఏపీఎస్పీ పోలీసులను ఆదేశించాడు. వారు లాఠీలతో ఇష్టారాజ్యంగా కొట్టారు" అని బాధితుడు వాపోయాడు. ఇదిలాఉండగా, మంగళవారం పోలీసులు ప్రయోగించిన బాష్పవాయువు ప్రభావంతో బుధవారం జేసీ ప్రభాకర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఆయనను హైదరాబాద్‌కు తరలించి అక్కడి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయన ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని తెలిపారు.

దుమ్మురేపిన ఏపీ ఓటర్!

- 81.86% ఓటింగ్ నమోదు
- దేశంలోనే 'రికార్డ్' సృష్టించిన పోలింగ్

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు పోటెత్తారు. దీంతో కనీవినీ ఎరుగని రీతిలో పోలింగ్ నమోదైంది. సోమవారం జరిగిన పోలింగ్‌కు సంబంధించిన ఓటింగ్ శాతాన్ని బుధవారం ఎన్నికల సంఘం ప్రకటించింది. దేశంలో ఇప్పటి వరకు జరిగిన నాలుగు దశల పోలింగ్ ప్రక్రియలో ఏపీ టాప్‌లో నిలిచి సరికొత్త రికార్డును సృష్టించింది. మొత్తంగా 81.86% ఓట్లు పోలైనట్టు ఎన్నికల సంఘం వివరించింది. దీనిలో ఈవీఎంల ద్వారా 80.66%, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1.2% పోలింగ్ నమోదైనట్టు తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానధికారి ముఖేశ్ కుమార్ మీనా పోలైన ఓట్ల వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో 4,13,33,702 మంది ఓటర్లు ఉండగా వారిలో 3,33,40,560 మంది ఓటర్లు తాజా ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి 2.09% పోలింగ్ పెరిగింది. ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా 87.06% పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా విశాఖపట్నం పార్లమెంట్ స్థానంలో 71.11 శాతం పోలింగ్ నమోదైంది. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిశీలిస్తే దర్శిలో అత్యధికంగా 90.91% పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో 63.32 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటేసి వస్తూ మృత్యుఒడిలోకి..

- పంతంగి టోల్ గేట్ వద్ద ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొట్టిన బైక్
- ఏపీలో రాజమండ్రికి చెందిన యువకుడి మృతి
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో ఐదు కార్లు ఢీ
- మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- విజయవాడ- హైదరాబాద్ హైవేలో వేర్వేరు ఘటనలు



పెద్దకాపర్తి శివారులో రహదారిపై నిలిచిన వాహనాలు

చౌటుప్పల్ రూరల్, చిట్యాల రూరల్, మే 15: ఎన్నికల ప్రభావంతో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిలో వాహన రద్దీ బుధవారం కూడా కొనసాగింది. జాతీయ రహదారిపై బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోగా.. ఓ ఘటనలో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎన్నికల్లో ఓటేసేందుకు హైదరాబాద్ నుంచి ఏపీలోని స్వస్థలానికి వెళ్లిన ఓ యువకుడు తిరుగుప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి బలైపోయాడు. విజయవాడ-హైదరాబాద్ హైవేలోని పంతంగి టోల్‌గేటు సమీపంలో ఆగి ఉన్న కంటెయినర్‌ను ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో కొనికల దీపక్ రాజ్ (29) అనే యువకుడు బుధవారం మరణించాడు. చౌటుప్పల్ పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని రాజమండ్రికి చెందిన కొనికల దీపక్ రాజ్, అనిరుద్ ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నివాసముంటున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వస్థలానికి వెళ్లిన వీరిద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై బుధవారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, పంతంగి టోల్‌గేటు సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఓ కంటెయినర్ లారీని ప్రమాదవశాత్తు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దీపక్‌రాజ్ మరణించగా అనిరుద్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఘటనలో, నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో విజయవాడ-హైదరాబాద్ హైవేలో వెళుతున్న ఐదు కార్లు ఒక దానిని మరొకటి వెనుక నుంచి ఢీకొన్నాయి. ఓ కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా అదే వరుసలో వెనుక వస్తున్న మరో నాలుగు కార్లు ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. కార్ల ముందు, వెనుక భాగాలు దెబ్బతిన్నాయి. కానీ, ఆయా వాహనదారులు రహదారిపై వాగ్వాదానికి దిగడంతో బుధవారం మధ్యాహ్నం మూడు కిలోమీటర్ల మేర వాహనాలు అరగంటకు పైగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రమాదానికి గురైన కార్లను పక్కకు తరలించిన తర్వాత వాహన రాకపోకలు కొనసాగాయి.

నిద్రలోనే అగ్నికి ఆహుతి

పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదం.. టిప్పర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు.. చిన్నారి సహా ఆరుగురు సజీవ దహనం

బాపట్ల (ఆంధ్రజ్యోతి), చిలకలూరిపేట, చినగంజాం, గుంటూరు, మే 15: రెండు గంటల ముందు వరకూ అమ్మమ్మ, తాతయ్యకు కబుర్లు చెబుతూ ఆడుకుంది ఆ పాప.! ఆ బుజ్జిబుజ్జి మాటలకు మురిసిపోతూ మెల్లిగా మనవరాలితో కలిసి నిద్రలోకి జారుకున్నారు ఆ పెద్దవాళ్లు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఓటేయడానికి వచ్చిన ఓ యువకుడు అప్పుడే అమ్మానాన్నతో మాట్లాడి రెప్పవాల్చారు.... పిల్లల చదువుల కోసం హైదరాబాద్‌లో ఉంటూ ఓటేయడానికి స్వగ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణమైన వ్యక్తి మరొకరు.... ఇలా ఆ బస్సులో దాదాపుగా అందరూ ఓటేయడానికి సొంతూరికొచ్చి హైదరాబాద్‌కు తిరుగుపయనమైన వారే. మంగళవారం రాత్రి 44 మందితో బాపట్ల జిల్లా చినగంజాం నుంచి చిలకలూరిపేట మీదగా హైదరాబాద్ బయల్దేరిన ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు అర్ధరాత్రి దాటాక 1:30 సమయంలో ఘోర ప్రమాదానికి గురైంది. పల్నాడు జిల్లాలోని అన్నంబట్ల వారిపాలెం-పసుమర్రు గ్రామాల మధ్య ఈవూరివారిపాలెం రోడ్డు వద్దకు రాగానే కంకర లోడుతో వేగంగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ప్రమాద ధాటికి టిప్పర్ ఆయిల్ ట్యాంకర్ పగలడంతో రెప్పపాటులోనే మంటలు వ్యాపించాయి. గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులు ఏం జరిగిందో అర్థంకాక హాహాకారాలు చేశారు. డోర్ దగ్గరే కూర్చున్న ఓ యువకుడు అందరినీ అప్రమత్తం చేయడంతో కొంతమంది ముందుగేటు నుంచి దిగగా, కొంతమంది ఎమర్జెన్సీ ద్వారం నుంచి, మరి కొందరు కిటికీ అద్దాలు పగలగొట్టి బయటకు దూకేశారు. బస్సు, టిప్పర్ డ్రైవర్లతోపాటు బస్సులోని మరో నలుగురు సజీవ దహనమయ్యారు. 29 మంది గాయాలతో బయటపడ్డారు. మృతిచెందిన వారిని బస్సు డ్రైవర్ అంజి (35), నీలాయపాలెం గ్రామానికి చెందిన ఉప్పుగుండూరు కాశీ బ్రహ్మేశ్వర రావు (64), ఆయన భార్య ఉప్పుగుండూరు లక్ష్మీ (55), మనవరాలు ముప్పరాజు ఖ్యాతి శ్రీసాయి (8), గోనసపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (52), మధ్యప్రదేశ్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ హరిసింగ్ (39)గా గుర్తించారు. గాయపడిన వారిలో 20 మందిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట నుంచి అగ్నిమాపక దళం వచ్చి మంటలను ఆర్పివేశారు. కాగా, సంఘటన ప్రదేశం పక్కనే చీరాల వాడరేవు - నకరికల్లు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణకు అవసరమైన గ్రావెల్‌ను టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అయితే అక్కడ రోడ్డు పనులకు సంబంధించి ఎలాంటి ఇండికేషన్లూ లేవు. కాగా, ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మద్యం మత్తులో నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మంటల్లో కాలిపోతున్న బస్సు-టిప్పర్

మాంసపు ముద్దలుగా...

ఘటనా స్థలంలోనే బస్సు పూర్తిగా కాలిబూడిదైంది. అందులోని మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా భస్మం మాత్రమే మిగిలి ఉన్న దృశ్యాలు చూపరులను కంటతడిపెట్టించాయి. ఘటనాస్థలానికి వచ్చిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆ దృశ్యాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.



మృతులు ఉప్పుగుండూరు కాశీబ్రహ్మేశ్వరరావు, ఖ్యాతి శ్రీసాయి; ఉప్పుగుండూరు లక్ష్మీ; దావులూరి శ్రీనివాసరావు (ఫైల్)

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు..

ఈ ప్రమాదంలో మృతిచెందిన కాశీ బ్రహ్మేశ్వరరావు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె దొప్పలపూడి భావనకు, పట్టిచెరుకూరుకు చెందిన అనిల్‌తో వివాహమైంది. వారు హైదరాబాదులో ఉంటున్నారు. రెండో కుమార్తె దుర్గకు, దర్శికి చెందిన ముప్పరాజ సుబ్బారావుతో వివాహమైంది. వీరు ఒంగోలులో ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె ఖ్యాతి శ్రీసాయి. బ్రహ్మేశ్వరరావు, లక్ష్మి హైదరాబాద్ నుంచి ఓటు వేయడానికి వచ్చారు. వేసవి సెలవులు కావడంతో వారి మనవరాలు ఖ్యాతిసాయి వారివెంట హైదరాబాద్ వెళ్లేందుకు బయల్దేరింది. కానీ, ప్రమాదంలో ఈ ముగ్గురూ అగ్నికి ఆహుతయ్యారు. ప్రమాదం జరిగినప్పుడు భావన చిన్నారి శ్రీసాయిని వెంటబెట్టుకుని కిందకు దిగేందుకు మెయిన్ డోర్ వద్దకు వెళ్లారు. అయితే మెయిన్ డోర్ విరిగి లోపలికి పడడంతో సాధ్యం కాలేదు. అదే సమయంలో వెనకవైపు కిటికీ అద్దాలు పగలగొట్టి కిందకు దిగుతున్నట్లు తెలుసుకున్న భావన చిన్నారి చేయి పట్టుకుని అటువైపు వెళ్లింది. అయితే చిన్నారి భయాందోళనతో ఎటుపోవాలో అర్థం కాక తాతయ్య వద్దకు వెళ్లింది. అప్పటికే పరిస్థితి చేయి దాటి పోతుండడంతో బయటకు దిగిన ప్రయాణికులు భావనను బలవంతంగా కిటికీ నుంచి బయటకు లాగేశారు. దీంతో భావన ప్రాణాలతో బయటపడింది. బ్రహ్మేశ్వరరావు, లక్ష్మీ దంపతులతో పాటు వారి మనవరాలు సాయి కూడా అగ్నికి ఆహుతయ్యారు. భావన ప్రస్తుతం గుంటూరులోని రమేశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. తమ కుటుంబంలో ఉన్న ఏకైక సంతానం ఖ్యాతి మృతిని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

డ్రైవర్‌ను రెండుసార్లు హెచ్చరించా..



చినగంజాంలో బస్సు బయల్దేరినప్పటి నుంచి నేను డ్రైవర్ ప్రక్కనే కూర్చుని ఉన్నా. పర్చూరు, చిలకలూరిపేట రహదారి మధ్య రెండుసార్లు బస్సు రోడ్డు మార్జిన్ దిగడం గమనించి డ్రైవర్‌ని హెచ్చరించా. మరోసారి డ్రైవర్‌ని అప్రమత్తం చేసేలోపే ఘోరప్రమాదం జరిగింది. బస్సులో లైట్లు ఆరిపోవడం, మంటలు రావడం కనిపించింది. వెంటనే డ్రైవర్ క్యాబిన్‌కి, ప్రయాణికులకు మధ్య ఉన్న డోరు తీద్దామనుకుంటే లాక్ అయింది. లాక్‌ను తీసి ప్రయాణికులను దించివేయాలని చూసేలోగా మంటలు వ్యాపించాయి. కొంతమందిని ఈ డోరు ద్వారా బయటకు దించాను. కొంతమంది కిటికీ అద్దాలు పగలగొట్టుకొని వచ్చారు. అద్దాలలో ఇరుక్కున్న వారిని బయటకు లాగాను. వెంటనే 108, 101 లకు ఫోన్ చేశాను. బస్సులో చిక్కుకున్న ఆ నలుగురిని మాత్రం కాపాడలేకపోయాము.

- సింగోతు సాయికుమార్, భాగ్యనగర్

నేడు బీఆర్‌ఎస్ నిరసనలు

రైతు వ్యతిరేక చర్యలను సహించం: కేసీఆర్

హైదరాబాద్, మే15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలోని రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగిస్తోందని, సర్కారు చర్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు ఆ పార్టీ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే ధాన్యానికి రూ.500బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కార్.. ఇప్పుడు సన్న రకాల ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామనడం వంచించడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సన్న రకం ధాన్యాన్ని 10శాతం మాత్రమే పండిస్తారని, 90శాతం ఇతర రకాల ధాన్యం వస్తుందని పేర్కొన్నారు. ఓట్లు వేసుడు అయిపోగానే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరిందని, మాటమార్చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు... రైతుల పక్షాన నిలబడి కొట్లాడాలని నేడు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

కరెంటు కోతల నియంత్రణపై చిత్తశుద్ధి ఏది?

రాష్ట్రంలో కరెంటు కోతల నియంత్రణపై చిత్తశుద్ధి లేని సీఎం రేవంత్.. అనవసరంగా ప్రతిపక్షాలు, విద్యుత్ ఉద్యోగులపై నిందారోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. విద్యుత్ రంగ వైఫల్యాలకు తమను బాధ్యులను చేసి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 5 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను కుప్ప కూల్చిందని విమర్శించారు.

ముఖ్యమంత్రికి చేతకాక.. విద్యుత్తు ఉద్యోగులపై నిందలా?

సీఎం రేవంత్‌రెడ్డివి చిల్లర రాజకీయాలు.. అప్పులు తప్పన్నవారు ఇప్పుడెందుకు తెస్తున్నారు?

- రాజకీయాలు తప్ప రైతుల కష్టాలు పట్టించుకోరా?
- తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి
- ఇప్పటికే ఓ బ్లాక్‌మెయిలర్‌ను గెలిపించాం
- ఎమ్మెల్సీగా మరొక బ్లాక్‌మెయిలర్ వద్దు: కేటీఆర్



హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సక్రమంగా విద్యుత్తు సరఫరా చేయించడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చేతకావడంలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు విద్యుత్తు ఉద్యోగులపై నిందలు మోపుతూ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యుత్తు ఉద్యోగులు బీఆర్‌ఎస్ పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని, తాము చెబితేనే కరెంటు కోతలకు పాల్పడుతున్నారంటూ సీఎం స్థాయి వ్యక్తి మాట్లాడటం తగదని హితవు పలికారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో బుధవారం ఆ మూడు జిల్లాలకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులతో తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియా తో మాట్లాడారు. నారాయణఖేడ్‌లో మంగళవారం ఉపాధ్యాయుల మీద పోలీసులు దౌర్జన్యం, లాఠీచార్జికి పాల్పడ్డారని, ఎన్నికల విధుల్లో పాల్గొన్నందుకు తగిన వేతనం ఇవ్వాలని అడగడం తప్పా? అని ప్రశ్నించారు. "ప్రభుత్వం అప్పులు చేయడమే తప్పు అన్నట్లుగా ప్రచారం చేసిన కాంగ్రెస్ సన్నాసులు ఇప్పుడు రూ.వేల కోట్ల అప్పులు ఎందుకు చేస్తున్నారు" అని కేటీఆర్ నిలదీశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారానికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాజకీయాలు తప్ప.. రైతుల కష్టాలు పట్టవా?

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికలు, రాజకీయాలు తప్ప.. రైతాంగం కష్టాలు పట్టడంలేదని కేటీఆర్ విమర్శించారు. ఓవైపు అకాల వర్షాలతో, మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు స్తంభించిపోవడంతో రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 25 రోజులుగా మార్కెట్ యార్డుల్లో ధాన్యం కొనకపోవడంతో అన్నదాతలు అవస్థపడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసినందున.. ప్రభుత్వం ఇప్పటికైనా ధాన్యం కొనుగోలుపై దృష్టి పెట్టాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా ఎఫ్‌సీఐ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఒక బ్లాక్ మెయిలర్‌ను అభ్యర్థిగా నిలబెడుతున్నారని, ఆయనను గెలిపిస్తే మరో నయీంలాగా మారతారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఒక బ్లాక్‌మెయిలర్‌ను గెలిపించామని, ఆయన పాలన ఎలా ఉందో చూస్తున్నామని పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాగా, అచ్చంపేటలో తమ పార్టీ నేతలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడాన్ని ఖండిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు.

సమావేశానికి పలువురు నేతల డుమ్మా

కేటీఆర్ నిర్వహించిన ఈ సమావేశానికి నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాలకు చెందిన పలువురు నేతలు గైర్హాజరైనట్లు సమాచారం. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక విషయంలో వారు అసంతృప్తితో ఉన్నట్లు, పార్టీ కోసం పనిచేస్తున్న తమకు కాదని.. కొత్తగా పార్టీలో చేరిన రాకేశ్‌రెడ్డి టికెట్ ఇచ్చారంటూ అలకబూనినట్లు తెలుస్తోంది. సమావేశానికి 130 మంది నాయకులను ఆహ్వానించగా.. అందులో సగానికి పైగా నేతలు గైర్హాజరైనట్లు తెలుస్తోంది.

రేవంత్‌రెడ్డివి 420 హామీలు

- అధికారంలోకి వచ్చాక దాటవేత ధోరణి
- ఏపీలో కూటమిదే అధికారం: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, మే 15 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఉద్దేశంతో రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు 420 హామీలిచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుపై దాటవేసే ధోరణిని అవలంబిస్తోంది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇష్టారీతిన హామీలిచ్చాయి" అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జికిషన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఇక్కడ తన అధికారిక నివాసంలో మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీపై వ్యక్తిగతంగా రేవంత్ పూనకం పట్టినట్లు విమర్శలు చేశారని, ఈ విధానం సరికాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే అని ప్రచారం చేసి గెలిచారని, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాజ్యాంగం, రిజర్వేషన్ల అంశాల్లో బీజేపీపై తప్పుడు ప్రచారం చేసి తెలంగాణలో గెలవాలని రేవంత్ కుట్ర చేశారని ఆరోపించారు. ఇకనైనా బీజేపీపై బురదజల్లడం ఆపి, హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో పాలన మొదలెట్టకుండానే.. పార్లమెంటు ఎన్నికలు తన పాలనకు పరీక్ష అని రేవంత్ చెప్పారని, పరీక్షలో ఫెయిల్ అయితే ఏం చేస్తారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కనుమరుగు కానున్నదని, లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ మారనుందని చెప్పారు. రాష్ట్రంలో కమల వికాసం ఖాయమని, ఎంపీ ఎన్నికల్లో డబుల్ డిజిట్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయమని చెప్పారు. ఏపీలో అల్లర్లపై విలేకరుల ప్రశ్నలకు స్పందిస్తూ.. హింసాత్మక ఘటనల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. ఏపీ మినహా తెలంగాణ సహా దేశమంతా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. ఏపీలో రెండు పార్టీలు, అభ్యర్థుల మధ్య ఉన్న నిరాశ, నిస్పృహ, పట్టుదలలు అల్లర్లకు కారణం కావొచ్చన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఓటింగ్ శాతం తగ్గడం పట్ల మాట్లాడుతూ.. ఎన్నికలకు రెండ్రోజుల ముందు నియోజకవర్గానికి 20-30 వేల ఓట్లు తొలగించారని, వారం రోజుల ముందు ఓటర్ స్లిప్పుల పంపిణీ చేశాక కూడా ఓట్లు తీసివేశారన్నారు. కావాలనే బీజేపీ అనుకూల ఓటర్లను తీసివేశారని ఆరోపించారు. రిగ్గింగ్ జరిగిన బూత్‌ల వివరాలను సేకరిస్తున్నామని.. అన్ని ఆధారాలతో ఈసీకి ఫిర్యాదు చేస్తామని కిషన్ రెడ్డి తెలిపారు.

పోలీసుల అదుపులో కామారెడ్డి డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్

మహిళా ఉద్యోగుల ఫిర్యాదులతో ఇరువురిపై పలు సెక్షన్ల కింద కేసులు

కామారెడ్డి టౌన్, మే 15: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కామారెడ్డి డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, సూపరింటెండెంట్ శ్రీనునాయక్‌ను బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మణ్ సింగ్, శ్రీనునాయక్‌పై తాజాగా మరికొందరు పీహెచ్‌సీల మహిళా మెడికల్ ఆఫీసర్లు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు అధికారులపై 354, 354 డీ, 509 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, సూపరింటెండెంట్ శ్రీనునాయక్ తనిఖీల పేరిట వస్తూ తమను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారంటూ జిల్లాలోని పలు పీహెచ్‌సీలకు చెందిన 21 మంది మహిళా మెడికల్ ఆఫీసర్లు 10 రోజుల కింద వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేశారు. 'పీహెచ్‌సీకి వచ్చినప్పుడు డీఎంహెచ్‌వో పక్కన కూర్చోమనేవారు.. కూర్చోకపోతే పనిలో లోపాలు వెతికి వేధించేవారు. ఫోన్ చేసి మరీ సంసారం జీవితం ఎలా సాగుతుందంటూ అభ్యంతరకరంగా మాట్లాడేవారు' అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడీహెచ్ (అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్) అమర్‌సింగ్ నాయక్ బుధవారం కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇరు వర్గాలను పిలిపించి.. వారితో మాట్లాడారు. విషయం తెలిసి స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అక్కడికి చేరుకోగా.. వేధింపుల విషయాన్ని పలువురు మహిళా ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా విచారణ జరుగుతోందని ఎమ్మెల్యే తప్పుబట్టారు. బాధిత మహిళా ఉద్యోగులతో పాటు మరికొందరు అధికారులూ ఇక్కడికి రావాలన్నారు. డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్‌ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా వీరు ఉద్యోగాల నియామకాలు, డిప్యుటేషన్ల విషయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై స్పందించిన ఏడీహెచ్ అమర్‌సింగ్.. డీఎంహెచ్‌వోతో పాటు ఇతర ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ అంశాన్ని రికార్డు చేశానని, విచారణ నివేదికలో వాటిని పొందుపర్చి.. ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

పాలనతోపాటు ప్రచారానికి సై!

ఏఐసీసీ స్టార్ క్యాంపెయినర్ హోదాలో వెసులుబాటును బట్టి ప్రచారానికి రేవంత్

పలు పీసీసీల నుంచి ఇప్పటికే ఆహ్వానాలు.. 2 రోజులుగా సమీక్షలతో సీఎం బిజీ



హైదరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి పెట్టారు. ధాన్యం కొనుగోళ్లు, పంట రుణాల మాఫీ వంటి అంశాలపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఇక వంద శాతం పాలనపైనే దృష్టి పెడతానంటూ మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా రేవంత్‌రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే రైతులకు సంబంధించి తక్షణ సమస్యగా ఉన్న ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష చేశారు. ఆగస్టు 15 నాటికి రుణమాఫీ చేసి తీరుతామన్న హామీ నేపథ్యంలో ఈ అంశంపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. పది, పదిహేను రోజుల్లో క్షేత్రస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పాలనా వ్యవస్థను పూర్తిగా గాడిలో పెట్టి ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో ఫీల్ గుడ్ వాతావరణం తీసుకువచ్చే పనిలో పడ్డారు. అయితే, ఏఐసీసీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న రేవంత్‌రెడ్డికి.. తమ రాష్ట్రాల్లో ప్రచారానికి రావాలంటూ పలు పీసీసీల నుంచి ఆహ్వానాలు అందాయి. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ బరిలో ఉన్న రాయ్‌బరేలీతో పాటు మహారాష్ట్ర, ఒడిసాల్లో తెలుగు వారు నివసించే భీవండీ, బరంపురం నియోజకవర్గాలు ఈ జాబితాలో ఉన్నాయి. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేసి రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ ఎన్నికల సభల్లో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రచారం.. ప్రసార మాధ్యమాల ద్వారా ఇతర రాష్ట్రాల ప్రజల్లోకీ బలంగా వెళ్లింది. ఈ అంశానికి సంబంధించి ఢిల్లీ పోలీసులు రేవంత్‌రెడ్డికి నోటీసులు జారీ చేయడం.. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో తమ రాష్ట్రాల్లోనూ అభ్యర్థుల తరఫున ప్రచారానికి రావాలని ఆయా పీసీసీలు కోరుతున్నాయి. అయితే సీఎం రేవంత్‌రెడ్డి.. ఏయే రాష్ట్రాలకు ప్రచారానికి వెళ్లేదీ ఇంకా షెడ్యూల్ ఖరారు కాలేదు. వెసులుబాటును బట్టి రాయ్‌బరేలీ, భీవండీ, బరంపురం నియోజకవర్గాల్లో ఆయన ప్రచారం చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం ఒడిసాలోని బోలాంగిరిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్‌గాంధీతో కలిసి పాల్గొన్నారు.

త్వరలో ఐఏఎస్, ఐపీఎస్ బదిలీలు?

ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టిన సర్కారు.. 4న కౌంటింగ్ ముగియగానే ఉత్తర్వులు

- ఒకరిద్దరు కీలక ఐఏఎస్‌లకు స్థానచలనం
- పోలీసు కమిషనర్లు, ఎస్పీల బదిలీలపైనా నజర్



హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో పాలనపై దృష్టి సారించిన ప్రభుత్వం.. త్వరలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేయనుందా? ఈ మేరకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టిందా? జూన్ 4న ఎన్నికల ఫలితాల విడుదల తర్వాత ఏ క్షణాన్నైనా బదిలీ ఉత్తర్వులను విడుదల చేయనుందా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిణామాలు, పరిపాలనలో ప్రభుత్వ అవసరాలు ఔననే చెబుతున్నాయి. ఈ క్రమంలో కీలక శాఖలకు బాధ్యత వహిస్తున్న ఒకరిద్దరు అధికారులకు స్థానచలనం తప్పదని తెలుస్తోంది. అంతేకాదు.. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయడం, వెయిటింగ్‌లో ఉన్న ఏఐఎస్‌లకు పోస్టింగులు ఇవ్వడం, జిల్లాల్లో వ్యతిరేకత ఉన్న కొందరు కలెక్టర్లు, ఎస్పీల స్థానంలో కొత్తవారిని నియమించడంపై సర్కారు కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.

రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత భారీ ఎత్తున ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. గత సర్కారుతో సన్నిహితంగా మెలిగిన కొందరు అధికారులను అప్రాధాన్య పోస్టింగుల్లో నియమించింది. జనవరిలోనూ 26 మంది బ్యూరోక్రాట్లు బదిలీ అయ్యారు. మార్చిలోనూ బదిలీల పరంపర కొనసాగగా.. ఇటీవల లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈసీ పలువురిని బదిలీ చేసింది. ఎన్నికలు ముగియడంతో పూర్తిస్థాయిలో పరిపాలనపై దృష్టిపెట్టిన సర్కారు.. మళ్లీ బదిలీలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా బదిలీల వ్యవహారాన్ని కొలిక్కి తెచ్చి, కౌంటింగ్ తర్వాత.. ఎన్నికల కోడ్ ముగియగానే బదిలీల ఉత్తర్వులు జారీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన ఒకరిద్దరు అధికారులను బదిలీ చేయాలని రేవంత్ సర్కారు యోచించినా.. అప్పట్లో అది వీలుపడలేదని తెలిసింది. వచ్చేనెల జరగనున్న బదిలీల్లో ఇలాంటి వారికీ స్థానచలనం తప్పదని తెలుస్తోంది.

ఖాళీల భర్తీపై దృష్టి

సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ)కు ప్రస్తుతం పూర్తిస్థాయి ముఖ్య కార్యదర్శి లేరు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు జీఏడీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో జీఏడీకి పూర్తిస్థాయి కార్యదర్శిగా అధికారిని నియమించడంపై సర్కారు దృష్టి సారించినట్లు తెలిసింది. గవర్నర్ కార్యదర్శిగా ఉన్న సురేంద్ర మోహన్‌ను మార్చిలో బదిలీ చేసినా.. ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వలేదు. 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి చాహత్ బాజపేయి లాంటి వారు వెయిటింగ్‌లో ఉన్నారు. ఇలా వెయిటింగ్‌లో ఉన్నవారికి పోస్టింగులు ఇచ్చే అవకాశాలున్నాయి. వివాదాస్పదంగా మారిన ఒకరిద్దరు అధికారుల బదిలీ తప్పదనే చర్చ కూడా సాగుతోంది. రెండు ప్రభుత్వ శాఖల మధ్య వివాదానికి కారణమైన ఓ అధికారిణిని కూడా మార్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకట్రెండు జిల్లాల కలెక్టర్లను మార్చాలంటూ స్థానికంగా వస్తున్న విజ్ఞప్తులను రేవంత్ సర్కారు పరిగణనలోకి తీసుకుని, వారిని మార్చే అవకాశాలున్నట్లు సమాచారం.

ఐపీఎస్ అధికారులకూ స్థానభ్రంశం

పోలీసు శాఖలోనూ ఎస్పీ స్థాయి మొదలు సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలకు సర్కారు కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, మిషన్ భగీరథలో అక్రమాలపై ప్రభుత్వం విచారణ బాధ్యతలను విజిలెన్స్‌కు అప్పగించిన విషయం తెలిసిందే.! అయితే.. విజిలెన్స్ డీజీగా ఉన్న రాజీవ్‌రతన్ గత నెల ఆకస్మికంగా మృతిచెందారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ స్థానాన్ని భర్తీ చేసే క్రమంలో రేవంత్ సర్కారు ఇప్పటికే డీజీపీతో చర్చించినట్లు తెలిసింది. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని సర్కారు కంకణబద్ధమైన విషయం తెలిసిందే.! తెలంగాణ యాంటి నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్‌గా కొనసాగుతున్న సందీప్ శాండిల్య ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. దాంతో ఖాళీ అయ్యే ఆ స్థానాన్ని కూడా భర్తీ చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తొమ్మిది పోలీసు కమిషనరేట్లలో ఒకరిద్దరు కమిషనర్లకు స్థానచలనం తప్పదని తెలుస్తోంది. ఎస్పీ స్థాయి మొదలు సీనియర్ ఐపీఎస్‌లలో కొందరిని బదిలీ చేసే అవకాశాలున్నాయి. ఇక సీనియర్ ఐపీఎస్‌లలో కొందరి వద్ద అదనపు బాధ్యతలు ఉన్నాయి. రెండు, అంతకంటే ఎక్కువ విభాగాల బాధ్యతలను నెరవేరుస్తున్న వారిపైనా పనిభారాన్ని తగ్గించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

రుణమాఫీ చేసి తీరాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి విధివిధానాలనూ రూపొందించాలని ఆదేశించారు. బుధవారం రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, దళారుల జోక్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. తడిసిన ధాన్యం, తేమ విషయంలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రైతుల నుంచి పంటను కొని మిల్లింగ్ చేసి రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమాలకు పాల్పడే రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విభజన సమస్యలను తేల్చేద్దాం..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తికావస్తున్నందున.. ఆంధ్రప్రదేశ్‌తో విభజన సమస్యలన్నింటినీ పరిష్కరించుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందుకోసం ఉద్యోగుల కేటాయింపు దగ్గర్నుంచి.. ఆస్తులు, అప్పుల పంపిణీకి సంబంధించిన పెండింగ్ అంశాలన్నింటిపైనా నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సచివాలయంలో సమావేశమై ఈ అంశంపై చర్చించారు. విభజన చట్టంలోని షెడ్యూలు 9, షెడ్యూలు 10లో ఉన్న కార్పొరేషన్లకు సంబంధించిన ఆస్తులు, అప్పుల పంపిణీ ఇంకా పూర్తి కాకపోవడం, పలు అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరని నేపథ్యంలో ఇప్పటివరకు చేసిన ప్రయత్నాలపై ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. రెండు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకునేందుకు వీలున్న ఉద్యోగుల బదిలీల వంటి అంశాలను పూర్తి చేయాలని ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిరిన వాటిని పరిష్కరించుకోవాలని, పీటముడి పడిన అంశాలపై తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా తదుపరి కార్యాచరణ చేపట్టాలని అన్నారు. రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు పూర్తవనుండటంతో పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఇక కేవలం తెలంగాణ రాష్ట్ర రాజధానిగా మారనుంది. దీంతో ఈ పదేళ్లకుగాను ఏపీకి కేటాయించిన లేక్ వ్యూ గెస్ట్ హౌస్ వంటి భవనాలను జూన్ 2 తర్వాత రాష్ట్ర అధీనంలోకి తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు.

18న కేబినెట్ సమావేశం

ఈ నెల 18న రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఏపీతో పీటముడిగా ఉన్న అంశాలను ఆ సమావేశంలో చర్చించనున్నారు. వీటితోపాటు రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, వచ్చే వానాకాలం పంటల ప్రణాళికపైనా చర్చించాలని నిర్ణయించారు.

వీసీల భర్తీకి ఈసీ ఓకే

- సెర్చ్ కమిటీల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు
- వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి



హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు కొత్త ఉప కులపతులను (వీసీలు) నియమించేందుకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, తెలంగాణ, అంబేడ్కర్, జేఎన్‌టీయూహెచ్, జేఎన్ఏఎఫ్ఏ యూనివర్సిటీల వీసీల పదవి కాలం ఈ నెల 21వ తేదీతో ముగియనున్న సంగతి తెలిసిందే. అప్పటికల్లా కొత్త వీసీలను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి.. ఈమేరకు నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను కూడా స్వీకరించింది. ఇంతలోనే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. మే 13న పోలింగ్ ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు వీసీల నియామకానికి ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. దీంతో పది వర్సిటీలకూ వేర్వేరు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ విద్యా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో యూజీసీ, ఆయా వర్సిటీల నుంచి ఒక్కో ప్రతినిధి, సీఎస్ సభ్యులుగా ఉంటారు. అలాగే.. విద్యా శాఖ కార్యదర్శి మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ఒకటి రెండు రోజుల్లో ఈ సెర్చ్ కమిటీలు సమావేశమై తదుపరి కార్యాచరణ చేపట్టే అవకాశం ఉంది. వారంలోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక.. ట్రిపుల్ ఐటీ బాసరతోపాటు కొత్తగా ఏర్పాటైన మహిళా వర్సిటీలకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చిన తర్వాతే వీసీలను నియమించాల్సి ఉంది. కాబట్టి ఆ రెండు వర్సిటీలకూ పాత వారే కొనసాగే అవకాశం ఉంది.

312 దరఖాస్తులు..

పది విశ్వవిద్యాలయాల వీసీ పోస్టులకు మొత్తం 312 మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నారు. అన్ని వర్సిటీలకూ కలిపి 1,382 దరఖాస్తులు వచ్చాయి. సెర్చ్ కమిటీలు వీటిని పరిశీలించనున్నాయి. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో వీసీల నియామకంలో జరిగిన కొన్ని సంఘటనలను కూడా దృష్టిలో ఉంచుకోనున్నారు. ఈ మేరకు దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించి పూర్తి వివరాలపై ఇప్పటికే నిఘా అధికారుల నుంచి నివేదికలను తెప్పించుకున్నట్టు సమాచారం. ఈ నివేదికల ఆధారంగా దరఖాస్తులను వడపోయనున్నారు. అనంతరం సెర్చ్ కమిటీ చేసే సిఫారసుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆయా వర్సిటీలకు వీసీల పేర్లను ఆమోదించనుంది. అనంతరం ఈ ప్రతిపాదనలను రాష్ట్ర గవర్నర్‌కు పంపించనున్నారు. గవర్నర్ ఆమోదంతో కొత్త వీసీల నియామక ప్రక్రియ పూర్తవుతుంది.

ఏ వర్సిటీకి ఎన్ని దరఖాస్తులు?

యూనివర్సిటీ	దరఖాస్తులు
ఉస్మానియా	193
కాకతీయ	149
పాలమూరు	159
మహాత్మగాంధీ	157
శాతవాహన	158
తెలంగాణ	135
పొట్టి శ్రీరాములు	66
అంబేడ్కర్	208
జేఎన్‌టీయూహెచ్	106
జేఎన్ఏఎఫ్ఏ	51
మొత్తం	1,382

వర్చువల్ తనిఖీలు.. జరిమానాలు

వైద్య కళాశాలల్లో లోపాలపై ఎన్ఎంసీ కొరడా.. ప్రైవేటుతో పాటు ప్రభుత్వ కాలేజీలపై దృష్టి

9 మినహా అన్ని సర్కారీ కళాశాలల తనిఖీ.. లోపాలున్న వాటికి గరిష్ఠంగా 10 లక్షల ఫైన్

2 నెలల్లో సవరించుకోకుంటే చెల్లించాల్సిందే.. ఇక నుంచి ఏటా గుర్తింపు ఫీజులు కట్టాలి



హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం లేని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలపై జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) జరిమానాల కొరడా ఝళిపిస్తోంది. రాష్ట్రంలోని ఈ కాలేజీలను ఎన్ఎంసీ వర్చువల్ పద్ధతిలో తనిఖీ చేస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని 9 మినహా దాదాపు అన్ని కాలేజీల్లోనూ ఈ తనిఖీలు పూర్తయినట్లు ఎన్ఎంసీ వర్గాలు వెల్లడించాయి. గాంధీ, ఉస్మానియాతో పాటు గత ఏడాది కొత్తగా ఏర్పాటైన వైద్య కళాశాలలను కూడా తనిఖీ చేశారు. ఇందులో కొన్నింటికి రూ.2 లక్షలు, మరికొన్నింటికి గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు జరిమానా వేసినట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించిన నోటీసులు ఇంకా కాలేజీలకు అందలేదని తెలుస్తోంది. తనిఖీల్లో బయటపడిన లోపాలను రెండు మాసాల్లోగా సరిదిద్దుకోవాలని ఎన్ఎంసీ సూచించింది. లేదంటే జరిమానా కట్టాల్సిందేనని స్పష్టం చేసింది. ఇప్పటి దాకా కాలేజీల్లో నిబంధనల మేరకు సౌకర్యాలు లేకుంటే సీట్లలో కోత విధించడమో లేకుంటే, గుర్తింపును తాత్కాలికంగా ఆ ఏడాదికి రద్దు చేయడమో చేసేవారు. ఈ ఏడాది నుంచి కొత్త నిబంధన అమల్లోకి తీసుకొచ్చారు. ముందుగా జరిమానాలు విధిస్తారు. కాలేజీ గుర్తింపును మాత్రం రద్దు చేయరు. ఎన్ఎంసీ ప్రధానంగా అధ్యాపకులు హాజరును పరిశీలిస్తోంది. ప్రస్తుతం ప్రొఫెసర్ల హాజరు కోసం అబాస్ విధానం అమలు చేస్తున్నారు. ప్రొఫెసర్లు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలి. అది వెంటనే ఢిల్లీలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుంది. దాని ఆధారంగా వారి హాజరును ఎన్ఎంసీ స్వయంగా పర్యవేక్షిస్తోంది. హాజరు 75 శాతం కంటే తక్కువగా ఉండే కాలేజీలకు కోటి రూపాయల వరకు జరిమానా విధిస్తోంది. అనుబంధ ఆస్పత్రుల్లో పడకల సంఖ్యకు అనుగుణంగా ఓపీ, ఐపీ లేకున్నా కూడా దాదాపు అదే స్థాయిలో జరిమానా విధిస్తామని ఎన్ఎంసీ పేర్కొంది. ప్రధానంగా ఈ రెండు విషయాలపై ఎన్ఎంసీ దృష్టి సారించింది. ఎన్ఎంసీ కొత్త నిబంధనల ప్రకారం ఇక నుంచి ప్రతీ కాలేజీ విధిగా వార్షిక నివేదిక ఇవ్వాలి. దాన్ని ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. దాని ఆధారంగానే ఎన్ఎంసీ గుర్తింపునిస్తుంది. అధ్యాపకుల హాజరు శాతం, వారి వివరాలు, అవుట్ పేషెంట్లు, ఇన్‌పేషెంట్లు, ల్యాబ్ రిపోర్టులు, చేసిన సర్జరీల గణాంకాలు వంటివి ఉండాలి. ఈ వివరాలను ఎన్ఎంసీ వర్చువల్ తనిఖీలో కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్ 'హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్ఎమ్ఐఎస్)'లో ఉన్న గణాంకాలతో పోల్చి చూస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయి కాలేజీలకు గుర్తింపు వచ్చిన తర్వాతే మెడికోలు తదుపరి తరగతులకు వెళ్లే, కోర్సులు చేసే అవకాశం ఉంటుంది. ఎన్ఎంసీ మెడికల్ కాలేజీలను భౌతికంగా తనిఖీలు చేయదు. వార్షిక నివేదికల ఆధారంగా వర్చువల్ తనిఖీలు మాత్రమే చేసి గుర్తింపు ఇవ్వనుంది.

గుర్తింపు ఫీజుల భారం!

ఇక నుంచి మెడికల్ కాలేజీలన్నీ ప్రతీ ఏటా విధిగా ఎన్ఎంసీ నుంచి గుర్తింపు పొందాలి. ఇప్పటి వరకు పాత కాలేజీలు ప్రతి ఐదేళ్లకొకమారు, కొత్తవి ప్రతీ ఏటా గుర్తింపు పొందాల్సి ఉండేది. కొత్త నిబంధన ప్రకారం కొత్త, పాత అనే తేడా లేకుండా ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీ ఎన్ఎంసీ నుంచి ప్రతీ సంవత్సరం గుర్తింపు పొందాలి. అంతేకాకుండా గుర్తింపు కోసం ప్రతీ ఏటా ఫీజులు కూడా చెల్లించాలి. ప్రభుత్వ వైద్య కళాశాలలకు రూ.3 లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు ఒక్కో పాత కాలేజీకి ఐదేళ్లకొకమారు ఉండేది.

కీలక దశకు యాదాద్రి పవర్ ప్లాంట్

- బాయిలర్ల 'లైటప్' విజయవంతం
- అక్టోబరు 10 నాటికి 2 యూనిట్లలో విద్యుదుత్పాదన లక్ష్యంగా పనులు
- ప్లాంటుకు బొగ్గు ఇల్లెందు గనుల నుంచే

హైదరాబాద్/నల్లగొండ, మే 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రతిష్ఠాత్మక యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ విద్యుదుత్పత్తికి సిద్ధమవుతోంది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న ఈ ప్లాంటులో రెండు యూనిట్లలో బాయిలర్లను మండించే ప్రక్రియ (లైటప్) మంగళవారం విజయవంతంగా పూర్తయింది. దీంతో జెన్‌కో అధికారులు అక్టోబర్ 10 నాటికి 800 మెగావాట్ల సామర్థ్యం గల ఈ రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పాదన ప్రారంభించాలని నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్లాంటు వద్దే సమీక్ష నిర్వహించి అక్టోబర్ నాటికి మొదటి రెండు యూనిట్లను విద్యుదుత్పత్తికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అప్పటి నుంచి జెన్‌కో యంత్రాంగం పనులను వేగంగా కొనసాగిస్తోంది. ప్లాంటు వద్దకు బొగ్గు రవాణాకు విష్ణుపురం నుంచి నిర్మిస్తున్న రైల్వే లైన్ పనులు చివరి దశకు చేరాయి. 2025 ఫిబ్రవరికల్లా మొత్తం 5 యూనిట్లను అందుబాటులోకి తీసుకురావాలని జెన్‌కో లక్ష్యంగా పెట్టుకొంది.

బొగ్గు రవాణా భారమే

దేశవ్యాప్తంగా పిట్‌హెడ్ (బొగ్గు గని ఉపరితల భాగంలో) విధానంలోనే థర్మల్ పవర్ ప్లాంట్‌లు నిర్మిస్తుండగా... యాదాద్రి ప్లాంట్‌ను మాత్రం నాన్ పిట్‌హెడ్ (బొగ్గు గనులకు దూరంగా) విధానంలో నిర్మిస్తున్నారు. ప్లాంటుకు 179 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇల్లెందు గనుల నుంచి బొగ్గు తరలించనున్నారు. దీంతో బొగ్గు రవాణా ఖర్చు పెరిగి, ప్రతీ యూనిట్ కరెంట్‌పై రూపాయి దాకా అదనపు భారం పడుతుందన్న అంచనాలు ఉన్నాయి. ఈ ప్లాంట్‌ను రూ.25,099 కోట్లతో ప్రతిపాదించగా, సవరించిన అంచనా వ్యయం రూ.34,543 కోట్లకు పెరిగింది. నిర్మాణం పూర్తయ్యేలోపు మరో రూ.5 వేల కోట్లు పెరగొచ్చని అంచనా. బొగ్గు రవాణా ఖర్చు, పెరిగిన అంచనా వ్యయంతో యూనిట్ కరెంటు రేటు రూ.6.50-రూ.7 దాకా పడుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది.



ఇంటికో ఉద్యోగం హామీ నెరవేర్చాలి

ఇంటికో ఉద్యోగంతోపాటు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్లాంటునిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు డిమాండ్ చేస్తున్నారు. 1,560 కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. కపూర్‌తండా, మోదుగులకుంట తండా గ్రామస్థుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస గ్రామాల్లో మౌలిక వసతుల్లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్ ప్రారంభోత్సవంలోపైనా న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఈసారి అందుబాటులో 1.20 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లు

- ఎక్కువ ధరకు విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు: తుమ్మల

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈసారి ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 60.53 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేసిందని, ఇందుకు సరిపడా బీజీ-2 (బోల్‌గార్డ్-2) పత్తి విత్తనాలను ఈ నెలాఖరువరకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. 2021లో 60.53 లక్షల ఎకరాలున్న పత్తి పంట విస్తీర్ణం క్రమంగా తగ్గుతూ 2023లో 45.17 లక్షల ఎకరాలకు చేరిందని తెలిపారు. అయితే ప్రపంచ మార్కెట్లో పత్తికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈసారి విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని, ఈమేరకు బీజీ-2 విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గతేడాది 90 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అమ్మడవగా ఈసారి 1.20 కోట్ల ప్యాకెట్లను మార్కెట్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీజీ-2 పత్తి విత్తన ప్యాకెట్ గరిష్ఠ ధరను రూ.864గా నిర్ణయించిందని, ఏ డీలరైనా దీనికన్నా ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీ బృందాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అమ్మకాలను పర్యవేక్షిస్తూ నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో సీతారామా ప్రాజెక్ట్ ఏన్కూర్ లింక్ కెనాల్ పనులు శరవేగంగా పూర్తిచేయాలని పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏన్కూరు వద్ద సీతారామ లింక్ కెనాల్ పనులను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు నాటికి పనులు పూర్తి చేసి, సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ కాల్వను ప్రారంభిస్తామన్నారు.

కృష్ణా ట్రైబ్యునల్ విచారణ జూలై 15కు వాయిదా

హైదరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): కృష్ణా ట్రైబ్యునల్ విచారణ జూలై 15వ తేదీకి వాయిదా పడింది. కృష్ణా జలాలపై ఏపీ దాఖలు చేసిన స్టేట్ ఆఫ్ కేసు(ఎస్ఓసీ)పై కౌంటర్ దాఖలు చేయడానికి 2 వారాల గడువు కావాలని తెలంగాణ కోరగా.. ఏపీ మాత్రం 4 వారాల గడువు కోరింది. దాంతో నాలుగు వారాల పాటు గడువు ఇస్తూ ట్రైబ్యునల్ బుధవారం నిర్ణయం తీసుకుంది. న్యాయస్థానాలకు సెలవులు ఉండటంతో తదుపరి విచారణ జూలై 15కి వాయిదా వేస్తూ ఆదేశాలిచ్చింది. ఏపీ దాఖలు చేసిన ఎస్ఓసీపై కౌంటర్‌తో పాటు, ఇరు రాష్ట్రాలు కూడా కౌంటర్లపై రీజాయిండర్లను రెండు వారాల్లోగా దాఖలు చేయాలని నిర్దేశించింది.

'అగ్నివీర్‌వాయు' కోసం దరఖాస్తుల ఆహ్వానం

అల్వాల్, మే15 (ఆంధ్రజ్యోతి): అగ్నిపథ్ పథకంలో భాగంగా భారత వాయుసేనలో అగ్నివీర్‌వాయు(మ్యూజిషియన్)ల కోసం పెళ్లి కాని యువతీయువకుల నుంచి వాయుసేన దరఖాస్తులను ఆహ్వానిస్తోందని రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివహరినాయక్ తెలిపారు. ఈ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను https://agnipathvayu. c[వెబ్‌సైట్‌]లో అందుబాటులో ఉంది. దాని ప్రకారం అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటల నుంచి వచ్చేనెల 5వ తేదీ రాత్రి 11 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వయసు, ఇతర వివరాలు, సందేహాల నివృత్తి కోసం 12 ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ సికింద్రాబాద్‌ను సంప్రదించవచ్చు. అలాగే 040 27753500 ఫోన్ నంబరులో లేదా E>mail Id> co.12ascap@gov.in లో కూడా సంప్రదించవచ్చు.

షేక్‌పేట్‌లో ఈసీ క్షేత్రస్థాయి పరిశీలన

- తొలగింపునకు గురైన ఓటర్ల ఇంటికెళ్లి విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఓటర్ల ఇంటివద్ద విచారణ చేస్తున్న ఈసీ అధికారులు

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం షేక్‌పేట్ డివిజన్‌లో ఓట్ల తొలగింపు వ్యవహారంపై ఎన్నికల సంఘం స్పందించింది. ఇక్కడి డివిజన్‌లో 3,942 ఓట్ల తొలగింపుపై బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అసెంబ్లీకి ఓటు.. లోక్‌సభకు వేటు' శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం అధికారులు బుధవారం షేక్‌పేట డివిజన్లో పర్యటించారు. తొలగింపునకు గురైన ఓటర్ల ఇంటికి వెళ్లి వారి ఓటరు గుర్తింపు కార్డులు పరిశీలించారు. తొలగింపునకు గురైన ఓటర్ల వివరాలను పరిశీలించి మళ్లీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చారు. అధికారుల నిర్వాకంతో అనేకమంది తమ ఓటు హక్కును కోల్పోయారని బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జూటూరు కీర్తి రెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు.

సైబర్ నేరగాళ్ల ముఠాలో మరో నిందితుడి అరెస్టు

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను సమకూరుస్తున్న ముఠాలో మరో నిందితుడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, ఏడు మొబైల్ ఫోన్లు, ఏడు సిమ్ కార్డులు, 10 బ్యాంకు పాస్‌బుక్‌లు, 19 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన కె.కేశవరెడ్డి అలియాస్ మహా బెంగళూరులో నివసిస్తూ.. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడేవాడు. గత ఏడాది ఫిబ్రవరిలో ఇతనికి సోషల్ మీడియా ద్వారా పలువురు గేమింగ్, ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులతో(ప్రణయ్ శిందే, మరికొందరు) పరిచయం ఏర్పడింది. బెట్టింగ్ లావాదేవీల కోసం బ్యాంకు ఖాతాలు సమకూర్చేలా కేశవరెడ్డి వారితో చేతులు కలిపారు. భైంసా పరిధిలో 125 మందితో బ్యాంకు ఖాతాలు తెరిపించారు. బెట్టింగ్ నిర్వాహకులు ఆన్‌లైన్‌లో ఈ ఖాతాల ద్వారా బెట్టింగ్ మొత్తాలను తీసుకునేవారు. ఆయా ఖాతాల్లో జరిగే లావాదేవీలపై 30% మేర కేశవరెడ్డికి కమీషన్ ఇచ్చేవారు. ఈ గ్యాంగ్‌లో ప్రణయ్ శిందేతోపాటు మరికొందరు ఇటీవలే అరెస్టయిన విషయం తెలిసిందే.! వారి వాంగ్మూలం మేరకు పోలీసులు తాజాగా కేశవరెడ్డిని అరెస్టు చేశారు.

ముస్లిం విద్వేషమే మోదీ రాజకీయ లక్ష్యం

- బీజేపీకి ఓటేసిన వారంతా దోషులే: అసదుద్దీన్

హైదరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు చేయడం.. ఆ దిశగా బీజేపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలను రెచ్చగొట్టడమే ప్రధాని మోదీ రాజకీయ జీవితమని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ముస్లింలను విద్వేషించిన మోదీకే కాదు.. ఆయన ప్రసంగాలు విని బీజేపీకి ఓటు వేసిన వారంతా దోషులేనని అన్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా తాను ఎన్నడూ మాట్లాడలేదని, ముస్లింలకు ఎక్కువ పిల్లలుంటారని ఎన్నడూ అనలేదంటూ ఓ ఛానల్ ఇంటర్వ్యూలో మోదీ పేర్కొనడంపై అసద్ స్పందించారు. ఈ ఎన్నికల్లో మోదీ, బీజేపీ ముస్లింలపై లెక్కలేనంత విద్వేషం వెళ్లగక్కారన్నారు.

బ్రిటన్ పార్లమెంట్ బరిలో తెలుగోడు

- లేబర్ పార్టీ అభ్యర్థిగా రాష్ట్రానికి చెందిన ఉదయ్ నాగరాజు



హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి తెలంగాణ బిడ్డ ఎంపికయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ నాగరాజు అక్కడ లేబర్ పార్టీ నుంచి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. కొత్తగా ఏర్పడిన 'నార్త్ బెడ్‌ఫోర్డ్‌షైర్' పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఈయన రానున్న ఎన్నికల్లో లేబర్ పార్టీ నుంచి పోటీ చేయనున్నారు. ఈ ఏడాదిలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రస్తుతం అధికారంలో ఉన్న కన్జర్వేటివ్ పార్టీపై లేబర్ పార్టీ విజయం సాధిస్తుందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయ్ నాగరాజుకు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనా వేస్తున్నారు. శనిగరంలోని సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందిన హనుమంత రావు, నిర్మలాదేవి దంపతులకు నాగరాజు జన్మించారు. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లండన్‌లో ఆయన పాలనాశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. తెలుగు మూలాలున్న వ్యక్తి బ్రిటన్ పార్లమెంట్‌కు పోటీచేయడంపై అక్కడి తెలుగు సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

చెట్టును ఢీకొట్టిన కారు..
వృద్ధ దంపతుల మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు, ప్రమాద తీవ్రతకు కారు దహనం


కొత్తూరు సూర్యనారాయణ, రుక్మిణీ (ఫైల్)

బోనకల్, మే 15: పెళ్లైన నాటి నుంచి కష్టసుఖాల్లో ఒకరికి ఒకరుగా ఉన్న ఆ దంపతులు చివరికి చావులోనూ ఒక్కటిగానే ఉన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్ల సమీపంలో బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కొత్తూరు సూర్యనారాయణ(92), రుక్మిణీ(86) అనే దంపతులు దుర్మరణం చెందారు. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో వృద్ధ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా వారితో పాటు ఉన్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామానికి చెందిన కొత్తూరు సూర్యనారాయణ, రుక్మిణి దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. డిగ్రీ కళాశాల అధ్యాపకునిగా వేర్వేరు ప్రాంతాల్లో పని చేసిన సూర్యనారాయణ మధిరలో స్థిరపడ్డారు. సూర్యనారాయణ ముగ్గురు కుమారుల్లో చిన్న కొడుకు మధిరలో మిగిలిన ఇద్దరు ఖమ్మంలో నివాసముంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న సూర్యనారాయణకు సహాయకునిగా నాగరాజు అనే వ్యక్తిని కేర్ టేకర్‌గా పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా, మనవడు అనిల్, కేర్‌టేకర్ నాగరాజుతో కలిసి సూర్యనారాయణ దంపతులు బుధవారం కారులో మధిర నుంచి ఖమ్మం బయలుదేరారు. అయితే, వీరు ప్రయాణిస్తున్న కారు ముష్టికుంట్ల సమీపంలో అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో సూర్యనారాయణ దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అనిల్, నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు పెట్రోలు పైపు పగిలి కారులో మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు దంపతుల మృతదేహాలను బయటికి తీశారు. తీవ్రంగా గాయపడిన అనిల్, నాగరాజును ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మంటలు మరింత చెలరేగడంతో కారు పూర్తిగా దహనమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్రంలో నేడు, రేపు వర్షాలు

హైదరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నేడు, రేపు అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు అన్ని జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. గురువారం అన్ని జిల్లాల్లో.. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుకురిసే అవకాశం ఉందని వెల్లడించింది. బుధవారం జగిత్యాల జిల్లా జైనాలో అత్యధికంగా 42.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఒకరోజు ముందే నైరుతి

- 31న కేరళ తీరాన్ని తాకుతాయి: ఐఎండీ

విశాఖపట్నం, మే 15(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు మే 31న కేరళ తీరాన్ని తాకుతాయని బుధవారం ప్రకటించింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1 కేరళకు వస్తాయి. అయితే ఈ ఏడాది ఒక రోజు ముందుగా (నాలుగు రోజులు అటూఇటుగా) రానున్నాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్రా తెలిపారు. గతనెలలో ఇచ్చిన నివేదిక ప్రకారం నైరుతి సీజన్‌లో సాధారణానికి మించి వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. 4నెలల నైరుతి సీజన్‌లో జూన్, జూలై నెలలు అత్యంత కీలకం. ఈ నెలల్లోనే ఖరీఫ్ సాగు ఎక్కువగా సాగుతుంది. ఈ రెండు నెలల్లో వర్షాలు సంతృప్తికరంగా ఉంటాయని మహాపాత్రో వివరించారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో సాధారణానికి మించి వర్షాలు కురుస్తాయని కేంద్రం ప్రకటించింది.

కులాంతర వివాహమే ప్రేమకు శాపమై..

పెళ్లైన 20 రోజులకే నవ వధువు ఆత్మహత్య

ఆ కేసులో జైలుకెళ్లి ఇటీవల విడుదలైన భర్త

తీవ్ర మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య

బీబీనగర్, మే 15: పెద్దలను ఎదిరించి కులాంతర వివాహం చేసుకోవడమే ఆ ప్రేమ జంట పాలిట శాపమైంది. కుల సమస్య ఇరుకుటుంబాల్లో రేపిన కల్లోలం ఆ జంట బలవన్మరణాలకు కారణమైంది. పెళ్లైన 20 రోజులకే ఆ జంటలోని వధువు ఆత్మహత్య చేసుకోగా.. ఆమె మరణంతో జైలుపాలై ఇటీవల విడుదలైన భర్త.. మనస్తాపంతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చీమలకొండూరుకు చెందిన బిట్కూరి మనోహర్(25), పల్లెర్ల భూమిక ప్రేమికులు. వేర్వేరు కులాలు వారు కావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించకపోవడంతో మనోహర్, భూమిక ఫిబ్రవరి 17న యాదగిరిగుట్టలో పెళ్లి చేసుకున్నారు. అనంతరం మనోహర్ తన భార్య భూమికను తమ ఇంటికి తీసుకెళ్లాడు. అయితే, కులం తక్కువదానివంటూ భూమికకు అత్తింటి వారి నుంచి వేధింపులు ఎదురయ్యాయి. దీంతో మనస్తాపం చెంది పుట్టింటికి వెళ్లిన భూమిక మార్చి 6న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు భూమికను వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మార్చి 9న మరణించింది. భూమిక మరణ వార్త తెలిసిన వెంటనే మనోహర్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబసభ్యులు సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డారు. మరోపక్క, అత్తింటి వేధింపుల వల్లే భూమిక ఆత్మహత్య చేసుకుందని ఆమె కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదుతో మనోహర్, అతని తల్లిదండ్రులను పోలీసులు అరెస్టు చేశారు. రెండు నెలలు జైలులో ఉన్న ఆ కుటుంబం పది రోజుల క్రితం బెయిలుపై విడుదలైంది. ఈ నెల 13న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న మనోహర్.. తల్లిదండ్రుల సూచన మేరకు బీబీనగర్ మండలం జైనపల్లిలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. అయితే, తన జీవితంలో జరిగిన ఘటనలతో తీవ్ర మనస్తాపంతో ఉన్న మనోహర్.. బీబీనగర్, ముగ్దుంపల్లి రోడ్డులోని ఓ వెంచర్‌లోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం ఈ ఘటనపై స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మనోహర్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పొరుగు రాష్ట్రాల్లో ఎన్నికల విధులు..
హోంగార్డుల జీతాల్లో కోత

- ఇక్కడ గైర్హాజరంటూ డీడీఏలోనూ కోత
- ఇతర రాష్ట్రాల్లో అదనపు భత్యాలు
- ఇక్కడ మాత్రం జీతాల్లో కోతలు
- గతంలో మధ్యప్రదేశ్‌లో హోంగార్డు మృతి
- ఆ కుటుంబానికి ఇంకా అందని సాయం
- హోంగార్డులకు జీవిత బీమా దక్కని వైనం

హైదరాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): వారంతా ఖాకీ యూనిఫాం వేసుకుంటారు..! కానీ, పోలీసు శాఖలో శాశ్వత ఉద్యోగులు కాదు..! కానిస్టేబుళ్లకు దీటుగా బందోబస్తుల్లో.. ట్రాఫిక్ నియంత్రణలో నిలువుకాళ్ల జీతం చేస్తారు..! కానీ, జీతం విషయంలో భారీ వ్యత్యాసం ఉంటుంది. ఇదీ హోంగార్డుల పరిస్థితి..! ఇప్పుడు ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న హోంగార్డులకు కొత్త చిక్కొచ్చిపడింది. నిజానికి భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) చెప్పిన సంఖ్యలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు ఆయా రాష్ట్రాల ఎన్నికల విధులకు పోలీసులను పంపాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో అధికారులు రెండో ఆలోచన లేకుండా పంపించేది హోంగార్డులనే..! లోక్‌సభతో పాటు.. పలు రాష్ట్రాల అసెంబ్లీలకు జరుగుతున్న ఎన్నికల సందర్భంగా ఇప్పుడు కూడా హోంగార్డులను ఆయా రాష్ట్రాలకు తరలించారు. ముఖ్యంగా తెలంగాణ హోంగార్డులు ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల్లో సేవలందిస్తున్నారు.

ఇక్కడ మాత్రం గైర్హాజరీ

ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల విధులకు వెళ్లిన హోంగార్డులకు తమ సొంత యూనిట్లలో గైర్హాజరు వేస్తున్నారు. దాంతో వేతనంలో కోతతోపాటు.. రోజువారీ విధులకు సంబంధించిన భత్యం(డీడీఏ) కూడా దక్కడం లేదు. ఎన్నిరోజులు పొరుగు రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తే.. అన్ని రోజులు ఇక్కడ వేతనంలో కోత విధిస్తున్నారు. నిజానికి హోంగార్డుకు రోజంతా పనిచేస్తే.. ఓ తాపీ మేస్త్రీకి దక్కే కూలీ కంటే తక్కువగా గౌరవ వేతనం(రూ.921) వస్తోంది. ఇక్కడ విధులు నిర్వర్తించినప్పుడు షిఫ్టుల వారీగా పనిచేస్తారు. పొరుగు రాష్ట్రాల్లో మాత్రం 24 గంటలూ నిలువుకాళ్ల జీతం చేస్తున్నారు. 24 గంటలూ కష్టపడ్డా వారికి ఈసీఐ ద్వారా అదే రూ.921 దక్కుతోంది. ఆయా రాష్ట్రాల్లో డైట్ చార్జీల కింద రూ.250 అదనంగా ఇస్తారు. డైట్ చార్జీల వంకతో ఉన్నతాధికారులు వీరికి భోజన వసతులను సైతం కల్పించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనూ చేతిలో లాఠీ తప్ప ఎలాంటి ఆయుధం లేకుండా పనిచేసే తమ పట్ల ఇంతటి వివక్ష తగదని హోంగార్డులు వాపోతున్నారు. కానిస్టేబుళ్లు ఇతర రాష్ట్రాల్లో బందోబస్తు నిర్వహిస్తే వారికి రవాణా భత్యం, ఇతర భత్యాలు అందుతాయని గుర్తుచేస్తున్నారు. తమకు గైర్హాజరు పేరుతో వేతనంలో కోత విధించకూడదని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వందల కిలోమీటర్లు ప్రయాణించి, విధులు నిర్వర్తించి, తిరిగి వచ్చిన వెంటనే విశ్రాంతి కూడా లేకుండా వెంటనే డ్యూటీలో చేరాలని ఉన్నతాధికారులు హుకుం జారీ చేస్తున్నారని, కానిస్టేబుళ్ల మాదిరిగా తమకు కూడా సాంత్వన కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పొరుగు రాష్ట్రాల్లోనే నయం!

ఆంధ్రప్రదేశ్, ఒడిసా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో హోంగార్డులకు గౌరవ వేతనంతోపాటు.. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్నందుకు అదనపు భత్యం, ఈసీఐ ఇచ్చే వేతనం లభిస్తోంది. ఈ రాష్ట్రాల నుంచి తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల బందోబస్తుకు పలువురు హోంగార్డులు వచ్చారు. వారి డైట్ చార్జీలు కూడా సంతృప్తికరంగా ఉన్నాయని రాష్ట్ర హోంగార్డులు వివరిస్తున్నారు. ఆయా రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాన్నే ఇక్కడా అమలు చేయాలని కోరుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో చనిపోతే అంతే..?

పొరుగు రాష్ట్రాల్లో విధులు నిర్వర్తించే హోంగార్డులను మరో భయం వెంటాడుతోంది. అక్కడ విధి నిర్వహణలో మరణిస్తే.. తమ కుటుంబాలు రోడ్డున పడడం తప్ప.. ప్రభుత్వం ఆదుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల బందోబస్తుకు వెళ్లిన శ్యామ్‌కుమార్‌అనే హోంగార్డు.. గుండెపోటుతో మృతిచెందారు. అప్పట్లో ఉన్నతాధికారులు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఇచ్చిన రూ.10 వేలు తప్ప.. శ్యామ్‌కుమార్ కుటుంబానికి దక్కిందేమీ లేదు. హోంగార్డులకు ప్రభుత్వం జీవిత బీమాను కల్పిస్తున్నా.. శామ్‌కుమార్‌ది ప్రమాదవశాత్తు జరిగిన మరణం కాదని, అది సహజ మరణమని పేర్కొంటూ బీమా కంపెనీ చేతులెత్తేసినట్లు తెలిసింది. ఇప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. కానిస్టేబుళ్ల విషయంలో భద్రత ఉంటుందని, వారిని కాదని.. తమను ఇతర రాష్ట్రాలకు పంపడమేంటని హోంగార్డులు ప్రశ్నిస్తున్నారు.

ఏపీలో ఏం జరుగుతోంది?

- పోలింగ్ ముగిసినా ఈ హింస ఏమిటి?
- కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్

అమరావతి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల రోజు, ఆ తర్వాత కూడా ఏపీలో కొనసాగుతున్న హింసాకాండపై కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) మండిపడింది. దీనిపై గురువారం ఢిల్లీ వచ్చి వివరణ ఇవ్వాలని సీఎస్ జవహర్ రెడ్డిని, డీజీపీ హరీశ్ గుప్తాను బుధవారం ఆదేశించింది. 'పోలింగ్ ముగిసిన తర్వాత కూడా హింసాత్మక ఘటనలు జరగడమేంటి? రాష్ట్రంలో ఈ రెండ్రోజుల్లో జరిగిన పరిణామాలకు బాధ్యులెవరు..? పోలింగ్ రోజు నిర్లక్ష్యం వహించారు.. ఆ తర్వాత కూడా నిర్లిప్తత కనిపిస్తోంది.. ఇంతకూ ఏపీలో ఏం జరుగుతోంది..? మీరిద్దరూ ఢిల్లీకి వచ్చి సమాధానం ఇవ్వండి' అని నిర్దేశించింది. పోలింగ్ ముందు రోజు అర్ధరాత్రి నుంచి మాచర్ల, నరసరావుపేట, చంద్రగిరి, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో వరుసగా కొనసాగుతున్న హింసాత్మక ఘటనలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. హింసాకాండ జరుగుతుందని గతానుభవాలు ఉన్నా.. ఎందుకు నిర్లక్ష్యం వహించారని నిలదీసింది. చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూముల వద్దే మారణాయుధాలతో దాడి చేయడాన్ని గట్టిగా నిలదీసింది. రాష్ట్రంలో హింసాత్మక ఘటనలను సీఈసీ సీరియస్‌గా తీసుకున్న నేపథ్యంలో సీఎస్, డీజీపీ గురువారం ఢిల్లీ వెళ్తున్నారు. ఈసీకి ఏం చెప్పాలన్న దానిపై చర్చించేందుకు బుధవారం సాయంత్రం సచివాలయంలో సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్ గుప్తా, నిఘా చీఫ్ కుమార్ విశ్వజీత్ సమావేశమయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే సమస్యాత్మక ప్రాంతాలపై నిఘాపెట్టి ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉండగా.. అలా జరగలేదని.. తాను డీజీపీగా బాధ్యతలు తీసుకున్న రెండ్రోజుల్లోనే కాకినాడ ప్రాంతంలోని బలగాలను ఇటు తెప్పించానని డీజీపీ గుప్తా సమావేశంలో వెల్లడించినట్లు తెలిసింది. నిఘా విభాగం ఎప్పటికప్పుడు నివేదికలు ఇస్తూ వచ్చిందని, చర్యలు తీసుకోవలసింది పోలీసు బాస్ మాత్రమేనని కుమార్ విశ్వజీత్ స్పష్టం చేసినట్లు తెలిసింది. ప్రధానంగా నాలుగు ఘటనలపై నివేదిక సిద్ధం చేసుకుని ఈసీ ముందుకు వెళ్లాలని సీఎస్, డీజీపీ ఈ సమావేశంలో నిర్ణయించారు. కాగా.. అధికార పక్షానికి ఓట్లు కురిపించే పథకాలకు నిధులు విడుదల చేయించడానికి చూపిన శ్రద్ధ శాంతిభద్రతల సమీక్షలో సీఎస్ జవహర్‌రెడ్డి చూపలేదని ఈసీ దృఢంగా భావిస్తోందని.. ఇదంతా ఆయన వైఫల్యమేనని గుర్రుగా ఉన్నట్లు ఐపీఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 16 మే 2024
diksuchi@andhrajyothy.com

(నిన్నటి పేజీ తరువాయి)

అందుకే దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఐదో స్థానంలో ఉన్నాయి. ఫుడ్ టెక్నాలజీ పరిశ్రమలో ఆర్గానిక్ కెమిస్టులు, బయోకెమిస్టులు, అనలిటికల్ కెమిస్టులు, హోస్ ఎకనమిస్టులు, ఇంజనీర్లు(కెమికల్, మెకానికల్, ఇండస్ట్రియల్, ఎలక్ట్రికల్, అగ్రికల్చరల్, సివిల్, ప్యాకింగ్), రీసెర్చ్ సైంటిస్టులు, మేనేజర్లు, అకౌంటెంట్లు మొదలైన వారికి అవకాశాలు ఉంటాయి. ఎంపిసి, బైపిసితో ఇంటర్ పూర్తిచేసి ఈ రంగంలోకి వెళ్లవచ్చు.

కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Acharya N.G. Ranga Agricultural University, Bapatla, Andhra Pradesh,
- Prof. Jayasankar Agricultural University, Rajendra Nagar, Hyderabad-500030,
- Central Food Technology Research Institute, Mysore-570020, Karnataka.
- Central Institute of Fisheries Education, Fisheries University Road, Seven Bungalows, Andheri(W), Mumbai-400061, Maharashtra, Website: www.cife.edu.in



- College of Agricultural Technology, Marathwada Krishi Vidyapeeth,Parbani-431402, Maharashtra.
- CSK Krishi Vishwa Vidyalaya, Palamuru-176060, Himachala Pradesh, Website: www.hillagric.org
- Govind Ballabh Pant University of Agriculture and Technology, Pantnagar-263145, Distt. Udham Singh Nagar, Uttarakhand, Website: www.gbpuat.ac.in
- Guru Nanak Dev University, Department of Food Science & Technology, Amritsar-143005, Punjab, Website: www.gndu.ac.in
- Harcourt Butler Technological Institute, Nawab Ganj, Kanpur-208002, Uttar Pradesh, Website: www.hbti.ac.in
- IIT(Indian Institute of Technology), Kharagpur-721302, West Bengal.
- Jadhavpur University, Department of Food and Technology and Biochemical Engineering, 188 Raja S.C Malik Road, Kolkata-200032, West Bengal, Website: www.jadavpur.edu
- Mahatma Gandhi University, Priyadarshini Hills PO, Kottayam-686560, Kerala, Website: www.mguniversity.edu
- Manipur University, Canchipur, Imphal, Manipur, Website: www.manipuruniv.ac.in
- M.S.University, Vadodara-390002, Gujarat Website: www.msuboroda.ac.in
- National Dairy Research Institute, NDRI Deemed - University Karnal-132001, Haryana, Website: www.karnal.nic.in
- National Sugar Institute, P.O: NSI Kalyanpur, Kanpur-208017, UttarPradesh.
- SNDT Women's University, 1, Nathibai Thakersey Marg, Marine Lines, Mumbai - 400022, Maharashtra, Website: www.sndt.ac.in
- University of Delhi, Delhi-110007, Website: www.du.ac.in
- University College of Technology (Osmania University), Hyderabad-500007, Telangana.
- University Department of Chemical-Technology (U.D.C.T), Nathalal Parikh Marg, Matunga, Mumbai - 400019, Maharashtra Website: www.udct.org

హోమ్ సైన్స్ అండ్ ఫుడ్ టెక్నాలజీ

ఇంటర్ బైపీసీతో పూర్తిచేసినవారు ఈ కోర్సుల్లో చేరవచ్చు. న్యూట్రిషనిస్ట్, డైటీషియన్స్, ఫుడ్ టెక్నాలజిస్టులుగా ఉపాధి లభిస్తుంది. సమతుల ఆహారంపై ఈ మధ్య కాలంలో అందరికీ ఆసక్తి ఏర్పడటంతో ప్రైవేటు రంగంలోనూ ఇబ్బడిముబ్బడిగా అవకాశాలు పెరుగుతున్నాయి. ముడి ఆహార పదార్థాలను మనుషులు, జంతువులు ఆసక్తిగా, అవసరమైనప్పుడు తినేట్టు చేయడమే ఫుడ్ టెక్నాలజీ కోర్సు. వివిధ పద్ధతులు ఆచరించి, మరికొన్ని కలిపి ఆహార పదార్థాలు రుచికితోడు నిల్వ ఉండేలా చేస్తుంటారు. ప్రస్తుతం దేశంలో మూడు కోట్లమంది నెలలో ఎక్కువ రోజులు ప్యాకేజీ ఫుడ్‌పై ఆధారపడి ఉన్నారు. మరో రెండు కోట్లమంది త్వరలోనే ఈ జాబితాలో చేరే పరిస్థితిలో ఉన్నారని సర్వేలు చెబుతున్నాయి.

సైన్స్ విద్యార్థుల కోసం

టెన్త్, ఇంటర్ తరవాత
What Next



ఫోరెన్సిక్ సైన్స్

ఫోరెన్సిక్ అనేది లాటిన్ పదం. ఫోరెన్సిక్ సైన్స్ అనేది నేరాలను శాస్త్రీయంగా నిర్ధారించే శాస్త్రం. ఫిజికల్, మెడికల్, బయోలాజికల్, మెడికల్ తదితర సబ్జెక్టుల నుంచి పుట్టిన శాస్త్రం ఇది. మొదటిసారిగా భారత ప్రభుత్వం 1972లో న్యూఢిల్లీలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్‌సైన్స్(www.nicfs.nic.in)ను ఏర్పాటు చేసింది. ఇది కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ సంస్థ ఇప్పటి వరకు వేలాది మందికి ఫోరెన్సిక్ సైన్స్‌లో శిక్షణ ఇచ్చింది. వీరిలో ప్రపంచంలోని 200 దేశాలవారు ఉన్నారు. ఢిల్లీ ఇన్‌స్టిట్యూట్‌తోపాటు కోల్‌కతా, హైదరాబాద్, చండీగఢ్‌లో ఫోరెన్సిక్ లేబొరేటరీలను ఏర్పాటు చేసింది. క్రిమినాలజీలో ఎంఏ, ఫోరెన్సిక్ సైన్స్‌లో ఎమ్మెస్సీ కోర్సును ఎల్ఎన్‌జెపి - ఎన్ఐసిఎఫ్ఎస్ అందిస్తోంది. ఒక్కో దానిలో 20 సీట్లు ఉన్నాయి. ఇక్కడ పీజీ డిప్లొమా ఇన్ డాక్యుమెంటేషన్, ఫోరెన్సిక్ బాలిస్టిక్, ఫోరెన్సిక్ బయాలజీలతోపాటు కొన్ని షార్ట్‌టర్మ్ కోర్సులు కూడా ఉన్నాయి. ఫోరెన్సిక్ సైన్స్‌కు సంబంధించి దేశంలోని పలు యూనివర్సిటీలు వివిధ కోర్సులను అందిస్తున్నాయి. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇన్ క్రిమినల్ జస్టిస్ కోర్సు ఉంది. ఏ డిగ్రీ చేసిన వారైనా ఈ కోర్సులో చేరొచ్చు. అదేవిధంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో గుజరాత్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (www.gfsu.edu.in) కూడా ఉంది.

కోర్సు అందించే కొన్ని సంస్థలు

- Anna University (Chennai 600025) - Post - BE Diploma in Forensic Engineering
- Bundelkhand University (Jhansi 284128)-PG Diploma in Forensic Science
- PG Diploma in Criminology; University of Delhi (Delhi 110007)- Certificate in Forensic Science(3 months)
- Dr. B.R. Ambedkar University(Agra 282004) - MSc(Forensic Science)
- Dr.Hari Singh Gour Vishwavidyalay (Sagar 470003)-MSc. (Criminology), MA (Criminal and Forensic Science).
- Karnataka University (Dharwad-580003)-MA (Criminology and Forensic Science)
- Lucknow University (Lucknow 226007)-PG Diploma in Forensic Anthropology
- University of Madras (Chennai 600005)-MA (Criminology), and MSc. (Forensic Science)
- Osmania University (Hyderabad 500007)-MSc. (Forensic Science Laboratory)
- Panjab University(Chandigarh 160014)-PG Diploma in Forensic Science and Criminal Science.
  1- Punjabi University (Patiala 147002) - MSc(Forensic Science)
- Amity University (Sector 44, Noida-UP) BSc. and MSc. (Forensic Science).



మర్చెంట్ నేవీ

ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు ఎక్కువ మొత్తం నౌకా రవాణా ద్వారానే జరుగుతున్నాయి. అందుకు కారణం మిగిలిన రవాణాలతో పోలిస్తే ఇది చాలా చౌక. అందుకే ప్రపంచ వ్యాప్తంగా షిప్పింగ్ ఇండస్ట్రీకి మంచి ఆదరణ ఉంది. మర్చెంట్ నేవీలోకి వెళ్లినవారికి అనుకూలతలు, ప్రతికూలతలు రెండూ ఉన్నాయి. కొత్త కొత్త ప్రదేశాలకు వెళ్లడం వీరికి అనుకూలత. అయితే నెలల తరబడి సముద్ర ప్రయాణంలోనే జీవితం గడిచిపోతుంది. కుటుంబ జీవితం కూడా దూరమవుతుంది. నేవిగేటింగ్ ఆఫీసర్, రేడియో ఆఫీసర్, మెరైన్ ఇంజనీర్స్ తదితరాల్లో కెరీర్ వెతుక్కోవచ్చు. ఇప్పటి వరకు ఇందులో మహిళలకు అవకాశాలు లేవు. అయితే షిప్ డాక్టర్లు, రేడియో ఆఫీసర్లుగా ఇప్పుడిప్పుడు వారు ఇందులోకి ఎంటర్ అవుతున్నారు. కోల్‌కతాలోని మెరైన్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ముంబైలోని చాణక్యలో చేరాలంటే మాత్రం జెఇఇలో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది.

ఇవికాకుండా... మర్చెంట్ నేవీలో శిక్షణ ఇచ్చే సంస్థలు

- Indian Maritime University (T.S. Chanakya), Karave Village, Sector 34, Nerul, Navi Mumbai, Maharashtra 400706, Ph: 022 2770 3876.
- Praveenya Institute of Marine Engineering & Maritime Studies (PRIME), D.No.-1-74-15, Plot No.61/3,Sector 3, MVP Colony, Visakhapatnam, Andhra Pradesh 530017,
- AMET UNIVERSITY, Plot No.135, East Coast Road, Kanathur, Chennai, Tamil Nadu 603112, Ph: 044 2747 2904.
- Commander Ali's Academy of Merchant Navy, Commander Ali's Estates, Survey No.469, Donthi, Shivampet Mandal, Medak District, Telangana 502334.
- Dr.B.R.Ambedkar Institute of Technology, Polytechnic Road, Pahargaon, Junglighat, Port Blair, Andaman and Nicobar Islands 744103, Ph: 03192 259 693.
- Indian Maritime College, Masilamani Street, T.Nagar, Chennai-600 0178. Ph: 044 2433 6953
- NUSI MARITIME ACADEMY, NUSIWADO, Sucaldem,Chinchinim, Salcette-Goa-403715, Ph: 0832 277 3859

ఫిజికల్, కెమికల్ అండ్ ఎర్త్ సైంటిస్టులు

ఇంజనీరింగ్ ద్వారా కెమికల్ ఇంజనీరింగ్ చేయవచ్చు. బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చేసిన వారికి కూడా కెమికల్‌కు సంబంధించిన స్పెషలైజ్డ్ డిప్లొమాలు ఉన్నాయి. జేఎన్‌టీయూ, ఆంధ్రా, ఓయూలలో కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఫిజిక్స్, మేథ్స్‌లో కూడా ఇలాంటి కోర్సులు ఉన్నాయి. డిగ్రీ/పీజీల్లో జాగ్రఫీ సబ్జెక్టులు చదివిన వారు జియాలజిస్టులుగా వెళ్లవచ్చు. ఓషనోగ్రఫీకి సంబంధించిన కోర్సులు ఆంధ్రా యూనివర్సిటీలో ఉన్నాయి. కెమికల్ ఇండస్ట్రీ, ఫిజిక్స్ అండ్ అలైడ్ ఫీల్డ్‌లో ఉపాధి ఉంటుంది. మేథమెటీషియన్స్ అండ్ స్టాటిస్టీషియన్స్, జియాలజిస్టులుగా, జాగ్రఫీ అండ్ జాగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ స్పెషలిస్టులుగా, మెట్రోలాజిస్టులుగా, ఓషనోగ్రాఫర్లుగా అవకాశాలుంటాయి.

ఆర్కిటెక్చర్ & కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ



మేథ్స్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు ఇందులో ఇంజనీరింగ్ చేయవచ్చు. టెన్త్ తరవాత పాలిటెక్నిక్ డిప్లొమా ఆధారంగా కూడా సర్టిఫికెట్ పొందవచ్చు. ఆర్కిటెక్చర్, నేవల్ ఆర్కిటెక్చర్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో ఉద్యోగాలుంటాయి.

పారా మెడికల్

సాధారణంగా రోగులు డాక్టర్ల దగ్గరికి వెళ్లిన తరవాత పలు రకాలు టెస్టులు చేయించుకోవాల్సి ఉంటుంది. వీటన్నింటినీ డాక్టర్లు నిర్వహించరు. ఈ విషయంలో పారా మెడికల్ సిబ్బంది సహాయపడతారు. పారా మెడికల్ కోర్సుల్లో ఆప్టోమెట్రీ, ల్యాబ్ టెక్నాలజీ, ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ మొదలైనవన్నీ ఉంటాయి. ఈ కోర్సుల్లోని చాలా విభాగాల్లో ఉద్యోగ అవకాశాలతోపాటు, స్వయం ఉపాధికి కూడా అవకాశం ఉంటుంది.



క్యాబిన్ క్రూ



క్యాబిన్ క్రూ అంటే విమానంలో పనిచేసే సిబ్బంది. ప్రయాణికులు విమానంలో ఎక్కడానికి ముందు ప్రారంభమై, వారిని సురక్షితంగా చేర్చేంత వరకు కొనసాగుతుంది. సాధారణంగా వారానికి 30 వరకు పనిగంటలు ఉంటాయి. అయితే ఇతర ఉద్యోగుల్లా రోజుకు ఇన్ని గంటలు ఉండే అవకాశం ఉండదు. ఒకే రోజు 20 గంటలు కూడా పనిచేయాల్సి రావచ్చు. అయినా ఒత్తిడిని ఏమాత్రం దరిచేరనీయకుండా చూసుకోవాలి. క్యాబిన్ క్రూలో చేరడానికి సాధారణంగా డిగ్రీని అర్హతగా పరిగణిస్తారు. వయసు 19-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. కొన్ని ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ సంస్థలు ఇంటర్ పాసైనవారికీ ఉద్యోగాలు ఇస్తాయి. అలాంటివారి వయసు 18-21 సంవత్సరాల మధ్యలో ఉండాలి. హోటల్ మేనేజ్‌మెంట్/ టూరిజం డిప్లొమా ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఎయిర్ హోస్టెస్‌లకు ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుంది. ఫస్ట్‌ఎయిడ్ తదితరాలను నేర్పిస్తారు. ఇక్కడ పని చేయాలనుకునే వారికి హిందీ, ఇంగ్లీషు భాషలు తప్పనిసరిగా వచ్చి ఉండాలి. పెద్ద పెద్ద సంస్థలు ఎయిర్ హోస్టెస్‌లకు మంచి మొత్తంలో జీతాలుగా ఇస్తాయి.

(మిగిలిన వివరాలు రేపటి పేజీలో)

లిటిల్స్



దేశం- టువాలు

- పసిఫిక్ మహాసముద్రంలో ఆస్ట్రేలియా, హవాయి దీవుల మధ్య ఉండే తొమ్మిది చిన్న దీవుల సముదాయమే టువాలు.
- 17, 18 శతాబ్దంలో డచ్, ఫ్రాన్స్, రష్యా, అమెరికా నావికులు ఎక్కువగా వెళ్లేవారు.
- 1892లో యూకే అధీనంలో ఉండేది. 1916లో ఇక్కడ ఉండే గిల్‌బర్ట్.. లాంటి చిన్న దీవుల్లో కాలనీలు ఏర్పరిచారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికన్లు, జపనీస్.. ఈ ప్రాంతం మాదే అనుకున్నారు. 1978లో ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.
- ఈ దేశంలో పన్నెండు వేల మంది మాత్రమే జనాభా ఉన్నారు. టువాలున్, ఇంగ్లీషు భాషలు మాట్లాడతారు.
- చేపల వ్యాపారం వల్లనే ఈ దేశానికి అధిక డబ్బు వస్తుంది.
- ఇక్కడ ఎక్కువగా ఫుట్‌బాల్ ఆడతారు. క్రికెట్, వాలీబాల్ ఆడేవాళ్లున్నారు ఇక్కడ.



- ఇది అభివృద్ధి చెందుతున్న దేశంగా ఐరాస ప్రకటించింది. బాధాకరమైన విషయమేంటంటే గ్లోబల్ వార్మింగ్ వల్ల ఈ దేశం పూర్తిగా కొన్ని సంవత్సరాల్లోనే తుడిచిపెట్టుకుపోతుంది. ఇప్పటికే అధిక శాతం మునిగిపోయింది.
- దీంతో ఈ దేశంలోని సంప్రదాయాలు, సంస్కృతులు కనుమరుగు కాకూడదనే లక్ష్యంతో దేశం మొత్తాన్ని డిజిటలైజ్ చేసింది. అంటే ఈ దేశానికి సంబంధించిన ప్రతి విషయాన్ని డాక్యుమెంటరీలు చేసింది. ఇలా దేశం మొత్తం డిజిటలైజ్ చేసిన తొలి దేశంగా ఇది రికార్డులకెక్కింది.
- ఇక్కడివాళ్లు సూర్యరశ్మిని తట్టుకోలేక పొడవైన దుస్తులు ధరిస్తారు.







సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 308

		9						3
5	6		2		4		7	
1		7	8	3			2	
9						8		
	3			5			9	
		2						7
	8			2	5	7		6
	9		7		3		8	4
2						9		

సుడోకు - 307 సమాధానం

1	2	6	8	3	4	9	7	5
5	9	3	7	6	1	2	8	4
7	8	4	2	9	5	3	1	6
2	6	9	1	5	7	4	3	8
4	1	7	3	8	6	5	2	9
3	5	8	4	2	9	7	6	1
6	4	1	9	7	3	8	5	2
8	3	5	6	4	2	1	9	7
9	7	2	5	1	8	6	4	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.